



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



# పోర్టు ఇన్‌ఫ్రా ఎకో సిస్టమ్‌గా ఏపీ

- రాష్ట్రంలో హార్డ్‌వేర్ తయారీ హబ్ ఏర్పాటుపై దృష్టి
- రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- 28 ప్రాజెక్టులతో 19,739 మందికి ఉద్యోగాల కల్పన
- ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో తిరుపతి
- ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలి
- రేర్ ఎర్త్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి
- సీఎం అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీలో నిర్ణయం

2

ఏపీని కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు... తీర ప్రాంతం పొడవునా పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసేలా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 21వ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశమైంది. మొత్తం 28 పారిశ్రామిక ప్రతిపాదనలకు సంబంధించి రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన రంగం, ఐటీ కమ్యూనికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన వివిధ ప్రతిపాదనలపై చర్చించి ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.

## నాలుగు దశాబ్దాల కలకు..

# నేడు పట్టా!

- రూ.8,874 కోట్ల విలువైన భూమిపై సంపూర్ణ హక్కులతో పట్టాలివ్వనున్న సీఎం
- 28,445 కుటుంబాలకు ఇంటి హక్కు
- 399 ఎకరాల్లో 19,33,853 చదరపు గజాల క్రమబద్ధీకరణ
- 40 ఏళ్ల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- విశాఖలో నేడు పెద్దఎత్తున ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టనున్న సీఎం చంద్రబాబు
- పూర్తి హక్కులతో సొంతిల్లు ఉండాలన్న కలను సాకారం చేసేందుకు విశాఖ వస్తున్నానంటూ ట్వీట్

4

40 ఏళ్లుగా తమ ఇళ్లపై పూర్తి హక్కుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద, మధ్య తరగతి కుటుంబాల కల సాకారం కానుంది. విశాఖపట్నం వేదికగా శనివారం చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతోంది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న 28,445 కుటుంబాలకు ఆ స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హక్కుదారు పట్టాలను పంపిణీ చేయనున్నారు. దీని విలువ రూ.8,874 కోట్లు.




## దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్

### ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం



- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ
- రూ.15,000 కోట్ల పెట్టుబడి...
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏడాదికి 12 లక్షల టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యం

3

ఏపీని దేశంలోనే ప్రముఖ షిప్‌బిల్డింగ్, మెరైన్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. దుగరాజ పట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటుకు మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ(ఎన్‌షిప్-ఏపీ) మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది.

## రాజధానికి మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రణాళిక




- నూతన అసెంబ్లీ భవనంపై ఎత్తైన స్పియర్ నిర్మాణానికి ఆమోదం
- రెండో దశలో ఎకరం కంటే తక్కువున్న రైతులకు యాన్యుటీ
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం

5

అమరావతి రాజధాని పరిధిలో ప్రజా రవాణా కోసం ఓ మాస్ ట్రాన్స్ పోర్టేషన్ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విజయవాడ, గుంటూరు సహా సమీపంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను రూపొందించాలన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 66వ సీఆర్డీఏ సమావేశం వివిధ ప్రతిపాదనలకు ఆమోదాన్ని తెలియచేసింది.

## స్థానిక ఎన్నికలపై ఎన్డీఏ కూటమి కసరత్తు

- మూడు పార్టీల కీలక నేతల సమావేశం
- క్షేత్రస్థాయి పరిస్థితులు, ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘ చర్చ
- కూటమి సమన్వయమే కీలకం, గెలుపే లక్ష్యంగా కార్యాచరణ
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెల్లడి



11

## ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు.. ప్రతిభకు పదును పెట్టాలి

- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలు నెలకొల్పాలి
- రెసిడెన్షియల్ విద్యార్థులకు ఏఐ స్కిల్లింగ్ తప్పనిసరి చేయాలి
- రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి
- నిమ్మకూరులో ఐఐటి జెఇఇ/ నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం
- ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ గవర్నింగ్ బాడీ సమావేశంలో విద్యా మంత్రి లోకేష్

6



# పోర్టు ఇన్‌ఫ్రా ఎకో సిస్టమ్‌గా ఏపీ

- రాష్ట్రంలో హార్డ్‌వేర్ తయారీ హబ్ ఏర్పాటుపై దృష్టి
- రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- 28 ప్రాజెక్టులతో 19,739 మందికి ఉద్యోగాల కల్పన
- ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో తిరుపతి
- ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలి
- రేర్ ఎర్త్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి
- సీఎం అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీలో నిర్ణయం






అమరావతి (చైతన్య రథం): దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు... తీర ప్రాంతం పొడవునా పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసేలా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 21వ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశమైంది. మొత్తం 28 పారిశ్రామిక ప్రతిపాదనలకు సంబంధించి రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన రంగం, ఐటీ కమ్యూనికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన వివిధ ప్రతిపాదనలపై చర్చించి ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఏపీని దేశంలోనే ప్రముఖ హార్డ్‌వేర్ తయారీ రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని సమావేశంలో సీఎం స్పష్టం చేశారు. సెమీకండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి వంటి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చేలా అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కేవలం ఎలక్ట్రానిక్స్ తయారీతో ఆగకుండా పరిశోధన, డిజైన్ల రూపకల్పన, మాన్యుఫ్యాక్చరింగ్‌తో పూర్తిస్థాయి ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. సోలార్ ప్యానళ్ల తయారీతోపాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, సాంకేతికత, నైపుణ్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో పరిశోధన, తయారీ సంస్థలు వేగంగా ఏర్పాటయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. డ్రోన్, స్పేస్ సిటీల సమీపంలో ఆయా రంగాలకు అనుబంధంగా ఉండే క్లస్టర్ పరిశ్రమలు ఏర్పడేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సీఎం చెప్పారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ తయారీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా తెలిపారు.

పెట్టుబడులకు ఆమోదం తెలిపిన తర్వాత ప్రాజెక్టులు కేవలం త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించేలా పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు 6 నెలల గడువు విధించి, ఆ వ్యవధిలోగా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. రాష్ట్రం లోని అన్ని పోర్టుల వద్ద ఉన్న భూమిని వాణిజ్యపరంగా సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకో వాలని సీఎం అన్నారు. పోర్టుల అభివృద్ధితోపాటు వాటి చుట్టూ లాజిస్టిక్స్, షిప్‌బిల్డింగ్, గోదాములు, తయారీ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఫిషింగ్ హార్బర్లను కూడా అభివృద్ధి చేయాలన్నారు. కార్గో షిప్‌ల నిర్మాణంతోపాటు డిఫెన్స్, టూరిజం అవసరాలకు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ కార్యకలాపాల ను రాష్ట్రంలో అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.

## లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ

పోర్టులు-షిప్‌బిల్డింగ్-లాజిస్టిక్స్-పరిశ్రమలను అనుసంధానించే సమగ్ర ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. లాజిస్టిక్స్ రంగంపై విస్తృతంగా పనిచేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని అన్నారు. పోర్టులు, రైలు, రోడ్డు, ఎయిర్ కార్గో, అంతర్గత జల రవాణా వంటి అన్ని రవాణా మార్గాలను అనుసంధానం చేసి సమగ్ర లాజిస్టిక్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీసిటీతో తిరుపతి జిల్లా ఎగుమతుల్లో దేశంలోనే 10వ స్థానంలో నిలిచిందని సీఎం వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా 12వ స్థానంలో ఉందని, ఎగుమతుల్లో టాప్-5లోకి తీసుకురావాలని సీఎం సూచించారు. రాష్ట్ర యువత నైపుణ్యాల్లో అగ్రస్థానంలో ఉండాలని సీఎం అన్నారు. 10వ తరగతి నుంచే స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని సూచించారు. దీనిపై స్కిల్ మ్యాపింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పీఎం సేతును కూడా అనుసంధానం చేసుకుంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. విశాఖపట్నంలోని అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణతో పాటు సివిల్ ఏవియేషన్ సహా ఎంఆర్వో ఫెసిలిటీని కూడా అభివృద్ధి చేస్తున్న విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. పరిశ్రమ లకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందిం చేందుకు ఇలాంటి అవకాశాలను విస్తరించాలని సూచించారు. మెటీరియల్ రీసెర్చ్‌లో కూడా అత్యంత కీలకంగా నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భవిష్యత్ తయారీ పరిశ్రమలకు అవసరమైన పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, మానవ వనరులను అభివృద్ధి చేయాలని సూచించారు. సిమెంట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు కొన్ని సిమెంట్ కంపెనీలు ముందుకు వచ్చినట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ఉన్న అవకాశాలు, ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న వ్యాపారాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు, ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న విధానా లను పరిశీలించి సమగ్ర కార్యాచరణ రూపొందిం చాలని ఆదేశించారు. అగ్రి-బేస్డ్ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో కూడా మహిళలు మరింతగా పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు విస్తృతమయ్యేలా 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

## రేర్ ఎర్త్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను హబ్‌గా తయారు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ ఆధారిత ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలు, పరిశోధన, తయారీ రంగాలను అనుసంధానం చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టీటీడీ పరిధిలోని భవనాలపై సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాల వైపు మళ్లాలని సూచించారు. టీటీడీలో నెట్‌జీరో

(తరువాయి 3లో.. )

### 21వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం తెలిపిన 28 ప్రాజెక్టుల వివరాలు:

- క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, కడప జిల్లా -రూ.950 కోట్ల పెట్టుబడి -90 మందికి ఉద్యోగాలు.
- సాయి బయోఎనర్జీ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ లిమిటెడ్, నంద్యాల జిల్లా -రూ.168.56 కోట్ల పెట్టుబడి -600 మందికి ఉద్యోగాలు.
- ఎం వెంకటరావు ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంవీఆర్ టెర్రావాంట్ జేవీ), శ్రీ సత్యసాయి జిల్లా -రూ.3,078 కోట్లు -1,300 ఉద్యోగాలు.
- రిజాల్వెన్ టూ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, కర్నూలు -రూ.980 కోట్లు -250 మందికి ఉద్యోగాలు.
- ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్, విశాఖపట్నం -రూ.100 కోట్లు -2,400 మందికి ఉద్యోగాలు.
- డెలాయిట్, విశాఖపట్నం -రూ.43.75 కోట్లు -2,500 ఉద్యోగాలు.
- ఫోటాన్‌కోర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమరావతి -రూ.9 కోట్లు -45 ఉద్యోగాలు.
- వెరిడాటా హెల్త్ ఇంక్., అమరావతి -రూ.4.5 కోట్లు -50 ఉద్యోగాలు.
- క్వాన్‌ఫ్లుయెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమరావతి -రూ.5 కోట్లు -30 ఉద్యోగాలు.
- ట్రైక్వాంటా ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమరావతి (క్వాంటమ్ హార్డ్‌వేర్) -రూ.35 కోట్లు -175 ఉద్యోగాలు.
- క్వాంటమ్ కోడాన్ ప్రైవేట్ లిమిటెడ్, అమరావతి (క్వాంటమ్ ఏఐ/ బయోటెక్నాలజీ) -రూ.167 కోట్లు -126 ఉద్యోగాలు.
- శ్రిష్టి క్వాంటమ్ ప్రైవేట్ లిమిటెడ్, అమరావతి (క్వాంటమ్ హార్డ్‌వేర్) -రూ.100 కోట్లు -110 ఉద్యోగాలు.
- ఆరోహక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అమరావతి (క్వాంటమ్ టెక్నాలజీ) -రూ.62 కోట్లు -300 ఉద్యోగాలు.
- గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్, మచిలీపట్నం -రూ.8,000 కోట్లు -3,000 ప్రత్యక్ష, 5,000 పరోక్ష ఉపాధి.
- మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, పల్నాడు -రూ.3,000 కోట్లు -2,000 ఉద్యోగాలు.
- క్యాటర్‌పిల్లర్ ఇంక్., శ్రీసిటీ, తిరుపతి -రూ.150 కోట్లు -80 ఉద్యోగాలు.
- ఎంఏఎఫ్ క్లాతింగ్ ప్రైవేట్ లిమిటెడ్, కుప్పం, చిత్తూరు -రూ.215 కోట్లు -2,560 ఉద్యోగాలు.
- దాల్మియా సిమెంట్, కడప -రూ.395.23 కోట్లు.
- అగర్వాల్ ఫౌండ్రీస్, నెల్లూరు -రూ.549 కోట్లు -245 ఉద్యోగాలు.
- శ్రీ వైభవ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరు -రూ.222.63 కోట్లు -300 ఉద్యోగాలు.
- శ్రీ వసుధ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం -రూ.254.06 కోట్లు -350 ఉద్యోగాలు.
- రావోక్స్ అగ్రిటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, చిత్తూరు -రూ.1,388.14 కోట్లు -1,000 ఉద్యోగాలు.
- కెల్లాగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీసిటీ, సత్యవేడు -రూ.211.70 కోట్లు -30 ఉద్యోగాలు.
- ఎపిటోమ్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్, నెల్లూరు -రూ.530.65 కోట్లు -238 ఉద్యోగాలు.
- హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్, విజయనగరం, తిరుపతి -రూ.1,127 కోట్లు -195 ఉద్యోగాలు.
- గ్రాండ్ తిరుపతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి -రూ.188.11 కోట్లు -851 ఉద్యోగాలు.
- సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్, అమరావతి -రూ.167 కోట్లు -600 ఉద్యోగాలు.
- జేఎల్ అసోసియేట్స్, కడప -రూ.53.25 కోట్లు -314 ఉద్యోగాలు.

# దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్

- ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ
- రూ.15,000 కోట్ల పెట్టుబడి...
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏడాదికి 12 లక్షల టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యం



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ షిప్‌బిల్డింగ్, మెరైన్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటుకు మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ (ఎన్‌షిప్-ఏపీ) మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది.

**రూ.15 వేల కోట్ల పెట్టుబడి**

దుగరాజపట్నంలో ఆధునిక గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ నిర్మాణానికి వచ్చే ఐదేళ్లలో ఎండీఎల్ సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో సుమారు 45,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తోపాటు అనుబంధ పరిశ్రమలు, మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసెస్ తదితర రంగాల్లో పెద్దఎత్తున ఉపాధి, పెట్టుబడులు వస్తాయి.

**ఏడాదికి 12 లక్షల టన్నుల సామర్థ్యం**

ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల (1.2 మిలియన్ జీటీ) నౌకల నిర్మాణ సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. భవిష్యత్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు కూడా వీలుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు, ఇతర భారీ ప్రత్యేక నౌకలను నిర్మించేలా ఈ షిప్‌యార్డ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా దేశీయ అవసరాలతోపాటు అంతర్జాతీయ మార్కెట్లకు కూడా నౌకలను నిర్మించే సామర్థ్యం రాష్ట్రానికి అందుబాటులోకి రానుంది.

**దుగరాజపట్నంలో సమగ్ర షిప్‌బిల్డింగ్ క్లస్టర్**

దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్ అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ (టీఈఎఫ్ఆర్) ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి సుమారు రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. పోర్టును కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయనుండగా, షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌ను కేంద్ర ప్రభుత్వ షిప్ బిల్డింగ్ డెవలప్మెంట్ స్కీం (ఎస్‌బీడీఎస్) కింద అభివృద్ధి చేయనున్నారు. ఈ క్లస్టర్‌కు ఎండీఎల్‌ను యాంకర్ షిప్‌యార్డ్‌గా ఎంపిక చేశారు.

**దేశ షిప్‌బిల్డింగ్ లక్ష్యాలకు అనుగుణంగా..**

భారత్‌ను 2047 నాటికి ప్రపంచంలోని అగ్రశ్రేణి షిప్‌బిల్డింగ్ దేశాల్లో ఒకటిగా నిలబెట్టాలన్న జాతీయ లక్ష్యానికి దుగరాజపట్నం ప్రాజెక్టు దోహదపడనుంది. మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047, కేంద్ర ప్రభుత్వ షిప్ బిల్డింగ్ డెవలప్మెంట్ స్కీం లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఎండీఎల్ సీఎండీ జగ్మోహన్, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఛైర్‌పర్సన్ జస్మీత్ సింగ్ బింద్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లోకేష్ చొరవతో.. టెక్ కంపెనీల క్యూ

- క్వాంటమ్ బాటలో ఏపీ.. ఐటీతో కొత్త జోరు
- రూ.526.25 కోట్ల పెట్టుబడులతో 10 ఐటీ ప్రాజెక్టులు
- 8,896 ఉద్యోగాల కల్పనకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- విశాఖలో డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ కార్యకలాపాలు
- అమరావతి కేంద్రంగా క్వాంటమ్ టెక్నాలజీ ప్రాజెక్టులు
- ఆరు క్వాంటమ్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం
- అత్యాధునిక టెక్నాలజీ రంగాల్లో భారీ పెట్టుబడులు



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం సచివాలయంలో జరిగింది. ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ, కృషితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీఎత్తున దిగ్గజ ఐటీ, ఫ్యూచర్ టెక్నాలజీ కంపెనీలు తరలివస్తున్నాయి. నేడు జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో రాష్ట్రంలో ఐటీ, క్వాంటమ్ రంగాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా కీలక ప్రాజెక్టులకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో, ముఖ్యంగా విశాఖపట్నం, అమరావతి మరియు కడప జిల్లాల్లో భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ముత్తూట్ ఫిన్‌కార్ప్: విశాఖపట్నంలో రూ.100 కోట్ల పెట్టుబడితో "ఇంటిగ్రేటెడ్ హబ్ ఏఐ అండ్ టెక్ ట్రైనింగ్ సెంటర్" ఏర్పాటుకు ఆమోదం లభించింది. దీనిద్వారా 2,400 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్: కడప జిల్లాలో రూ.70 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకానున్న యూనిట్‌కు సంబంధించి ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 2021-24 కింద అర్హమైన ప్రోత్సాహకాల దరఖాస్తు గడువు పొడిగింపునకు ఆమోదం లభించింది. 300 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

**క్వాంటమ్ రంగానికి అమరావతి కేంద్రం**

సృష్టి క్వాంటమ్ ప్రైవేట్ లిమిటెడ్ అమరావతిలో రూ.2,700 కోట్ల భారీ పెట్టుబడితో క్వాంటమ్ కంప్యూటింగ్ హార్డ్‌వేర్, నానో ఫ్యాబ్రికేషన్ రీసెర్చ్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. దీని ద్వారా దాదాపు 3,000 ఉద్యోగాలు సృష్టించబడతాయి. క్వాంటమ్ కోడాన్ ప్రైవేట్ లిమిటెడ్ అమరావతిలో రూ.167 కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ క్వాంటమ్ ఏఐ-డ్రివెన్ బయోటెక్నాలజీ ఇన్నోవేషన్ క్యాంపస్ (డ్రగ్ డిస్కవరీ రీసెర్చ్ కోసం) ఏర్పాటుకు ఆమోదం లభించింది. దీని ద్వారా 126 మందికి ఉద్యోగాలు రానున్నాయి. అరోహాక్ టెక్నాలజీస్ అమరావతిలో రూ.62 కోట్ల పెట్టుబడితో ఫోటోనిక్స్ క్వాంటమ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. తద్వారా 300 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ట్రిక్వాంటా లాబ్స్ అమరావతిలో రూ.35 కోట్ల పెట్టుబడితో క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్, ఇండియా యొక్క మొట్టమొదటి హైబ్రిడ్ క్వాంటమ్ కంప్యూటింగ్ హార్డ్‌వేర్ తయారీ చేయనుంది. దీని ద్వారా 175 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఫోటాన్‌కోర్ సిస్టమ్స్ అమరావతిలో రూ.9 కోట్ల పెట్టుబడితో 'ఫోటాన్ క్యూ' రూమ్-టెంపరేచర్ ఫోటోనిక్ క్వాంటమ్ కంప్యూటింగ్ సిస్టమ్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనుంది, 45 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. వెరిడేటా హెల్త్ అమరావతిలో రూ.4.5 కోట్ల పెట్టుబడితో ప్రపంచపు మొట్టమొదటి రెగ్యులేటరీ-గ్రేడ్, క్వాంటమ్ ఎనేబుల్డ్ క్లినికల్ ఆపరేటింగ్ సిస్టమ్ గ్లోబల్ ఇంజినీరింగ్ హబ్ ఏర్పాటు చేసి 50 మందికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర యువతకు అత్యాధునిక రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ మరియు క్వాంటమ్ రంగంలో గ్లోబల్ హబ్‌గా మారబోతుంది.


## పోర్టు ఇన్‌ఫ్రా ఎకో సిస్టమ్‌గా ఏపీ

(2వ పేజీ తరువాయి..)

లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులు, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 511 చార్జింగ్ స్టేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు సమావేశంలో వెల్లడించారు. ఆన్‌షోర్ విండ్ మిల్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను కూడా పరిశీలించాలని సీఎం సూచించారు. గ్రీన్ ఎనర్జీలో రాష్ట్రం నిర్దేశించుకున్న 160 గిగావాట్ల లక్ష్యానికి గాను ఇప్పటికే 113.75 గిగావాట్లకు సంబంధించి పెట్టుబడులు సాధించినట్టు అధికారులు వివరించారు. డిసెంబర్ 17,18 తేదీల్లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో హైడ్రోజన్ వ్యాలీ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సు సందర్భంగా పెట్టుబడిదారులకు అందించే ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాల ఏర్పాటుపై చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆతిథ్య రంగంలో హోటళ్లు పెద్దఎత్తున ఏర్పాటయ్యేలా చూడాలని సీఎం సూచించారు. ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ సంస్థలు వచ్చేలా ఆహ్వానించాలన్నారు. విశాఖలో భాగస్వామ్య సదస్సుకు మరో 50 రోజులు సమయమే ఉందని... అప్పటికల్లా గతంలో కుదిరిన ఒప్పందాలు గ్రౌండ్ అయ్యేలా చూడాలన్నారు. ఇప్పటివరకు జరిగిన 21 ఎస్ఐపీబీ సమావేశాల్లో మొత్తం 387 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.14.05 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.79 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంది. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పరిశ్రమలు, ఐటీ, ఐ అండ్ ఐ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నాలుగు దశాబ్దాల కలకు.. నేడు పట్టా!

- రూ.8,874 కోట్ల విలువైన భూమిపై సంపూర్ణ హక్కులతో పట్టాలివ్వనున్న సీఎం
- 28,445 కుటుంబాలకు ఇంటి హక్కు
- 399 ఎకరాల్లో 19,33,853 చదరపు గజాల క్రమబద్ధీకరణ
- 40 ఏళ్ల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- విశాఖలో నేడు పెద్దఎత్తున ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టనున్న సీఎం చంద్రబాబు
- పూర్తి హక్కులతో సొంతిల్లు ఉండాలన్న కలను సాకారం చేసేందుకు విశాఖ వస్తున్నానంటూ ట్వీట్



అమరావతి (చైతన్య రథం): 40 ఏళ్లుగా తమ ఇళ్లపై పూర్తి హక్కుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద, మధ్య తరగతి కుటుంబాల కల సాకారం కానుంది. విశాఖపట్నం వేదికగా శనివారం చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతోంది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న 28,445 కుటుంబాలకు ఆ స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హక్కుదారు పట్టాలను పంపిణీ చేయనున్నారు. దీని విలువ రూ.8,874 కోట్లు. మొత్తం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరిస్తూ 19,33,853 చదరపు గజాలను పేద కుటుంబాలకు హక్కులు కల్పించనున్నారు. విశాఖలో ఇంత పెద్ద ఎత్తున క్రమబద్ధీకరణ చేపట్టి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం ఇదే తొలిసారి. ఇల్లు నిర్మించుకుని దశాబ్దాలుగా అందులో నివసిస్తున్నా.. ఆ ఇంటి స్థలంపై పూర్తి హక్కు లేకపోవడం అనేక కుటుంబాలను వేధిస్తోన్న సమస్య. పట్టా లేకపోవడంతో ఆస్తిని పూర్తిస్థాయిలో అనుభవించలేని పరిస్థితి.. బదలాయించుకోలేక... భవిష్యత్తుపై భరోసా లేకపోవడం వంటి సమస్యలకు కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది. శనివారం సీఎం చంద్రబాబు చేపట్టనున్న ఇళ్ల పట్టాల పంపిణీతో ఇన్నాళ్లూ పడిన కష్టాలు గట్టెక్కనున్నాయి. విలువైన ఆస్తి, భవిష్యత్తుకు భద్రత, పిల్లలకు వారసత్వ సంపద, ఆత్మగౌరవం, భరోసా కల్పించేలా అంగరంగ వైభవంగా విశాఖలో ఇళ్ల పట్టాల పంపిణీని ప్రభుత్వం చేపట్టనుంది.

### ఇల్లే కాదు... ఇంటిపై హక్కూ ఉండాలి

పేదవాడికి ఇల్లు ఉండడమే కాదు... ఆ ఇంటిపై పూర్తి హక్కు ఉండాలన్నది ప్రభుత్వ విధానం. దానికిఅనుగుణంగానే 2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించింది.. కొన్ని జీవోలను కూడా జారీ చేసింది.. కొంత మందికి పట్టాలు ఇచ్చింది. అయితే ప్రభుత్వం మారడంతో ఆ సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం దక్కలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం మళ్లీ ఈ సమస్యపై దృష్టి సారించింది. సీఎం చేపట్టిన జిల్లా సమీక్షల్లో కూడా ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరణ ద్వారా హక్కులు కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపుతూ విశాఖలో భారీ స్థాయిలో పట్టాల పంపిణీకి రంగం సిద్ధమైంది.

### మండలాల వారీగా లబ్ధిదారుల కుటుంబాలు

ప్రస్తుతం విశాఖలో చేపడుతున్న క్రమబద్ధీకరణలో గాజువాక నుంచి భీమిలి వరకు పలు ప్రాంతాల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. విశాఖ రూరల్‌లో అత్యధికంగా 9,261 కుటుంబాలు లబ్ధి పొందనుండగా.. ములగాడలో 4,213, గాజువాకలో 4,353, గోపాలపట్నంలో 3,253, పెందుర్తిలో 2,722, పెదగంట్యాడలో 1,910, మహారాణిపేటలో 1,235, సీతమ్మధారలో 668, భీమిలిలో 464, ఆనందపురంలో 349, పద్మనాభంలో 17 కుటుంబాలకు హక్కులు కల్పించనున్నారు.

### విశాఖ అభివృద్ధిలో పేదలకు భాగస్వామ్యం

ప్రపంచస్థాయి నగరంగా విశాఖను అభివృద్ధి చేసే కార్యక్రమాల్లో వేగం పెంచుతూ.. ఆ అభివృద్ధిలో సామాన్య కుటుంబాలను భాగస్వాములను చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గ్లోబల్ సంస్థలను విశాఖకు తీసుకురావడం, పెట్టుబడులు--ఉద్యోగ అవకాశాలను పెంచడం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. పేద కుటుంబాలకు ఆస్తిపై హక్కు, భవిష్యత్తుపై భరోసా కల్పించడం ద్వారా అభివృద్ధి ఫలాలు సామాన్యుడి ఇంటి గడపకు చేరేలా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. తమకంటూ పూర్తి హక్కులతో సొంతిల్లు ఉండాలనేది ప్రతి ఒక్క కుటుంబ కల. అలాంటి వేల మంది కలను నిజం చేసేందుకు విశాఖ వస్తున్నా అంటూ ముఖ్యమంత్రి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కార్యక్రమం కాదని... 28 వేల కుటుంబాలకు వారి నివాసాలపై పూర్తి హక్కు కల్పించే చారిత్రక సందర్భమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పట్టాతో ప్రతి కుటుంబానికి ఒక విలువైన ఆస్తి దక్కుతుందని... భవిష్యత్తుకు భద్రత కలుగుతుందని.... బిడ్డలకు వారసత్వ సంపద లభిస్తుందని... ఆత్మగౌరవం, భరోసా దక్కుతుందని సీఎం వెల్లడించారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ఇంటిపై హక్కు కోసం ఎదురుచూసిన ప్రతి కుటుంబంలో ఆనందం చూడటమే ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి అని ముఖ్యమంత్రి చెప్పారు.

### ముఖ్యమంత్రి విశాఖ టూర్ షెడ్యూల్...

ముఖ్యమంత్రి శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖకు బయలుదేరతారు. విశాఖ చేరుకున్న అనంతరం ఆర్‌కే బీచ్‌లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక మత్స్యకారులతో ముఖ్యమంత్రి ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందిస్తారు. బహిరంగ సభ... ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ముగించుకుని విశాఖ నుంచి ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణమవుతారు.


## వర్షాభావ పరిస్థితి నేపథ్యంలో

# రైతులు, కౌలు రైతులను ఆదుకోండి



### -సీఎం చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ వినతి

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, పశుపోషకులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో శుక్రవారం కలిసి పలు అంశాలపై రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులున్న జిల్లాల్లో తాము పర్యటించామని తెలిపారు. ఎల్‌నినో కారణంగా తలెత్తిన కరువు పరిస్థితులను సాధారణ ప్రకృతి వైపరీత్యంగా కాకుండా అత్యవసర పరిస్థితిగా పరిగణించాలన్నారు. పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం అందించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతులకు ఉచితంగా విత్తనాలు అందించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, ముప్పాళ్ల నాగేశ్వరరావు ఉన్నారు.




చైతన్యరథం

# రాజధానికి మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రణాళిక

- **నూతన అసెంబ్లీ భవనంపై ఎత్తైన స్పియర్ నిర్మాణానికి ఆమోదం**
- **రెండో దశలో ఎకరం కంటే తక్కువున్న రైతులకు యాన్యుటీ**
- **సీఎం చంద్రబాబు అధ్యక్షతన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం**





అమరావతి (చైతన్య రథం): అమరావతి రాజధాని పరిధిలో ప్రజా రవాణా కోసం ఓ మాస్ ట్రాన్స్ పోర్టేషన్ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విజయవాడ, గుంటూరు సహా సమీపంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను రూపొందించాలన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 66వ సీఆర్డీఏ సమావేశం వివిధ ప్రతిపాదనలకు ఆమోదాన్ని తెలియచేసింది. రాజధానిలో నూతనంగా నిర్మించే అసెంబ్లీ భవనంపై 250 మీటర్ల ఎత్తైన స్పియర్ టవర్ సహా లిఫ్ట్‌లను నిర్మించేందుకు అథారిటీ ఆమోదాన్ని తెలిపింది. రూ.661 కోట్ల వ్యయంతో స్పియర్ సహా లిఫ్ట్‌ల నిర్మాణానికి అథారిటీ సమావేశం ఆమోదాన్ని ఇచ్చింది. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో ఎల్పీఎస్ జోన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1548 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. హోటళ్లు, పాఠశాలలకు భూములు కేటాయిస్తూ మంత్రుల కమిటీ చేసిన సిఫార్సులకు ఆమోదం తెలిపారు. రెండో దశ పూలింగ్‌లోనూ ఎకరా కన్నా తక్కువ కమతం ఉన్న రైతులకు యాన్యుటీ చెల్లింపునకు సంబంధించి అథారిటీ ఆమోదం ఇచ్చింది. మరోవైపు అసెంబ్లీ భవనంలో వ్యూపాయింట్ ఏర్పాటు చేసే అంశంపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదికైన అసెంబ్లీ భవనంలో ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఈ స్పియర్ నిర్మాణం జరగాలని సీఎం సూచించారు. రాజధాని నగరంలో నిర్మిస్తున్న అసెంబ్లీ- హైకోర్టు- సచివాలయ టవర్లతోపాటు క్వాంటం టవర్స్, బిట్స్ పిలానీలాంటి భవనాలు కూడా ప్రత్యేకమైన కట్టడాలుగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. దీంతోపాటు అమరావతి నగరంలో 50 శాతం సస్టెయినబుల్ గ్రీన్ కవర్‌తోపాటు బయోడైవర్సిటీని కాపాడేలా చర్యలు చేపట్టాలని ఏడీసీ అధికారులను సీఎం ఆదేశించారు. పచ్చదనంతోపాటు పుష్ప జాతులకు చెందిన మొక్కలు నాటాలన్నారు. రాజధానిలో ఉన్న కొండలు, నీటి వనరులను కూడా అత్యుత్తమ ప్రాంతాలుగా తీర్చిదిద్దేలా ఓ బ్లూప్రింట్‌ను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అమరావతి ఘనత చాటేలా విస్తృత ప్రచారం**

అమరావతి నగరం పేరును దేశ విదేశాల్లో మార్మోగేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇటీవల లద్దాఖ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన ఓ బైకర్‌ను ఓ బాలుడు అమరావతి నుంచి వచ్చారా? అంటూ మాట్లాడిన అంశం రాజధాని అమరావతి పేరు ప్రజల మనస్సుల్లోకి ఎంతగా చొచ్చుకు పోయిందన్న దానికి ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. ఇలా దేశ, విదేశాల్లోనూ అమరావతి ఘనతను చాటేలా విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాలులేని, బ్లూ గ్రీన్, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీలాంటి ఐదు అంశాలను థీమ్‌గా అమరావతిని తీసుకెళ్లాలన్నారు. ప్రతీ పౌరుడూ ఇది నా నగరం అని భావించేలా అమరావతి పేరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాజధాని నగరాన్ని నడిపేలా భవిష్యత్ రెవెన్యూ మోడల్స్‌పై కూడా దృష్టి సారించాలన్నారు. దీనిపై ఓ కమిటీని నియమించి అధ్యయనం చేయాలన్నారు. విజయవాడ- గుంటూరు- మంగళగిరి- తాడేపల్లి కార్పోరేషన్లు కలిపి ఓ మెగా సిటీగా అమరావతి తయారవుతుందని సీఎం అన్నారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సిటీగా అమరావతి అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. సీఆర్డీఏ అథారిటీ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి నారాయణ, సీఎస్ సాయిప్రసాద్, పురపాలక, ఆర్థిక, ఐ అండ్ ఐ, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు హాజరయ్యారు.

# గుంటూరు జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు భేటీ

## హాజరైన విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్

గుంటూరు (చైతన్య రథం): గుంటూరు సాయిబాబా రోడ్డు, వినాయక నగర్‌లో శుక్రవారం సాయంత్రం గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశం జరిగింది. ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నివాసంలో జరిగిన ఆత్మీయ విందు భేటీకి విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు. ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. వైసీపీ అరాచక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో గుంటూరు ఎంపీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, గుంటూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, గుంటూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.











# ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..
# ప్రతిభకు పదును పెట్టాలి





- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలు నెలకొల్పాలి
- రెసిడెన్షియల్ విద్యార్థులకు ఏఐ స్కిల్లింగ్ తప్పనిసరి చేయాలి
- రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి
- నిమ్మకూరులో ఐఐటి జెఇఇ/ నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం
- ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ గవర్నింగ్ బాడీ సమావేశంలో విద్యా మంత్రి లోకేష్

ఉండవల్లి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో అకడమిక్ ఎక్సలెన్స్ (విద్యాపరమైన ప్రతిభ)పై దృష్టి సారించాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అధికారులు, ఉపాధ్యాయులను కోరారు. ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఆర్ఈఐఎస్) 59వ గవర్నింగ్ బాడీ సమావేశం మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన ఉండవల్లి నివాసంలో జరిగింది. సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రతిభావంతులను తయారుచేసే కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. ఏపి రెసిడెన్షియల్ స్కూళ్లు అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో తొలిసారి పత్రికా ప్రకటనలిచ్చి సెలబ్రేట్ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇప్పటివరకు ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యనభ్యసించిన వారిలో దాదాపుగా 27మంది ఐఏఎస్, 20మంది ఐపీఎస్, 13మంది ఐఆర్ఎస్, నలుగురు ఐఎఫ్ఎస్‌లుగా, ఎంతోమంది సమాజంలో అత్యున్నత స్థానాల్లో సేవలందిస్తున్నారని అధికారులు చెప్పగా, మంత్రి లోకేష్ ఆనందం వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో 10 ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేసేందుకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఆమోదం తెలిపింది. (ఇప్పటికే తాడికొండ, కొడిగినహల్లి పాఠశాలలు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా ఉన్నాయి.) కృష్ణాజిల్లా నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటి-జెఇఇ/ నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని 6 ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయడానికి సమావేశం ఆమోదించింది. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేసి, ఎడ్యుకేషన్ మరియు క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడానికి గల అవకాశాలను పరిశీలించాలని మంత్రి లోకేష్ సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది స్టాఫింగ్ ప్యాట్రన్‌కు ఆమోదం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ పరంగా వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఏపీఆర్‌జేసీ స్కూళ్లలో కంప్యూటర్ ల్యాబ్స్, ఏఐ స్కిల్లింగ్ తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు.

అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్న ప్రాంతాల్లో ఇండస్ట్రీ డిమాండ్‌కు అనుగుణంగా వృత్తివిద్యా కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ అందించాలని కోరారు. ఏపీఆర్ విద్యాసంస్థల్లో సర్వీసు రూల్స్ తయారీకి కమిటీ ఏర్పాటు చేయాలని బోర్డు నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఏపీఆర్ విద్యాసంస్థల సిబ్బంది వయోపరిమితిని 60నుంచి 62సంవత్సరాలకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా అందజేసే ప్రతిపాదనను సైతం ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న పిఇటిలను పిడిలుగా అప్‌గ్రేడ్ చేయడానికి బోర్డు ఆమోదించింది. ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌తోపాటు అకడమిక్ అవుట్ కమ్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అన్ని స్కూళ్లలో క్రిటికల్ ఇన్‌ఫ్రా, శాశ్వత భవనాల నిర్మాణానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఏపీఆర్ విద్యాసంస్థల్లో విద్యార్థుల మెడికల్ ఎమర్జెన్సీ కోసం లక్షరూపాయలు వరకు ఖర్చుచేసే వెసులుబాటుకు సెక్రటరీకి కల్పిస్తూ సమావేశం ఆమోదం తెలిపింది. అన్ని ఏపీఆర్ విద్యాసంస్థల్లో ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్లను ఏర్పాటుచేసే ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్య డైరక్టర్ నారాయణ భరత్ గుప్త, ఎస్‌సిఇఆర్‌టి డైరక్టర్ ఎంవి కృష్ణారెడ్డి, ఏపీ విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవెన్ రెడ్డి, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్ మూల్యాంకన సిబ్బందికి రెమ్యునరేషన్ పెంపు

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో పాల్గొన్న సిబ్బందికి భత్యాన్ని 25శాతం వరకు పెంచే ప్రతిపాదనకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ 78వ పాలకవర్గ సమావేశం మంత్రి లోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరిగింది. అదేవిధంగా మూల్యాంకనంలో తీవ్రమైన తప్పిదాలకు పాల్పడే సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో 1978 నుంచి ఇప్పటివరకు జారీచేసిన సర్టిఫికెట్లన్నింటినీ డిజిటలైజ్ చేసి, బ్లాక్ చైన్ టెక్నాలజీతో అనుసంధానించాలని తీర్మానించారు. ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేసే సిబ్బందికి కూడా పదవీవిరమణ వయోపరిమితిని 60నుంచి 62సంవత్సరాలకు పెంచుతూ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షల్లో థియరీ సబ్జెక్టులకు 32పేపర్ల జవాబు పత్రం అందించేందుకు సమావేశం తీర్మానించింది. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే.శ్యామలరావు, హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.రంజిత్ బాషా, ఏపీ ఓపెన్ స్కూల్స్ సెక్రటరీ ఆర్ నర్సింహారావు, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ఎస్ విజయభాస్కర్ రావు, ఆంధ్ర యూనివర్సిటీ వీసీ జీపీ రాజశేఖర్, ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ పీవీ సత్యనారాయణ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ వి ఉమ, ఇంటర్ బోర్డు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ఏ సైమన్ విక్టర్ పాల్గొన్నారు.

# డిజిటల్ వ్యవసాయంలో దేశానికే దిక్సూచిగా ఏపీ

- 52.08 లక్షల మంది రైతులకు ఫార్మర్ ఐడీలు, 86.8 శాతం అగ్రీస్టాక్ లక్ష్యం పూర్తి
- ఏపీఏఐఎంఎస్ 2.0తో ఎరువుల అక్రమ వినియోగానికి అడ్డుకట్ట, 22 శాతం ఆదా
- ఎల్‌నినోలోనూ పప్పుధాన్యాల సాగులో 99 శాతం లక్ష్యసాధన
- 80 శాతం రాయితీపై కంటింజెన్సీ విత్తనాలకు రూ.200 కోట్లు
- పంటల బీమాకు 44 లక్షల దరఖాస్తులు.. రూ.16 వేల కోట్ల బీమా రక్షణ
- రైతు సంక్షేమంలో కేంద్రం సహకారం అభినందనీయం
- దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సదస్సులో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




హైదరాబాద్ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాంకేతికతను రైతుకు చేరువ చేస్తూ, సాగు వ్యయాన్ని తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో వినూత్న సంస్కరణలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ రైతులకు అండగా నిలుస్తూ డిజిటల్ వ్యవసాయం, పప్పుధాన్యాల స్వయం సమృద్ధి, ఎరువుల పారదర్శక పంపిణీ, పంటల బీమా, మార్కెటింగ్ రంగాల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతున్నామన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సాంకేతిక సంస్కరణలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారానికి, ముఖ్యంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### 52.08 లక్షల మంది రైతులకు ఫార్మర్ ఐడీలు

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా అగ్రిస్టాక్ అమల్లో ఆంధ్రప్రదేశ్ వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 60 లక్షల పీఎం-కిసాన్ లబ్ధిదారుల్లో 52.08 లక్షల మందికి ఫార్మర్ ఐడీలు సృష్టించి 86.8 శాతం ప్రగతి సాధించామన్నారు. ఖరీఫ్-2026లో డిజిటల్ పంటల సర్వే ద్వారా సుమారు 68 లక్షల మంది రైతులకు చెందిన 97 లక్షల ఎకరాల పంట విస్తీర్ణాన్ని నమోదు చేశామని తెలిపారు. ఈ డేటాను పంట విస్తీర్ణం, దిగుబడి అంచనాలకు వినియోగిస్తున్నామని, అగ్రిస్టాక్‌ను ఎరువుల పంపిణీ, ఎంఎస్‌పీ కొనుగోళ్లు, ఉత్పత్తి అంచనాలు, పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానం చేస్తున్నామని వివరించారు.

### ఏపీఏఐఎంఎస్ 2.0తో 22 శాతం ఎరువుల ఆదా

ఎరువుల పంపిణీలో ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతు వివరాలు, కమతం, విస్తీర్ణం, సాగుచేసిన పంట ఆధారంగా శాస్త్రీయ సిఫార్సుల మేరకు యూరియా, డాప్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 24.69 లక్షల మంది రైతులు డిజిటల్ విధానంలో ఎరువులు కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా విక్రయాలు 31 శాతం, డాప్ విక్రయాలు 32 శాతం తగ్గాయని, యూరియా వినియోగం 6.67 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి సుమారు 4.60 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గిందన్నారు. ఎల్‌నినో కారణంగా సాగు విస్తీర్ణం తగ్గడంతో ఎరువుల వినియోగం 9 శాతం తగ్గగా, ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా అక్రమ వినియోగాన్ని అరికట్టి మరో 22 శాతం ఎరువులను ఆదా చేయగలిగామని మంత్రి వివరించారు. కృష్ణా, కాకినాడ జిల్లాల్లో పైలట్‌గా అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ ఎరువుల యాప్‌ను రబీ 2026-27లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు వెల్లడించారు.

### అగ్రిస్టాక్‌కు కేంద్రం మరింత సహకరించాలి

సమగ్ర డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం కొనసాగించాలని మంత్రి కోరారు. భూ రికార్డుల అనుసంధానంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, జియో-రిఫరెన్స్ చేసిన గ్రామ పటాల ధ్రువీకరణను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అగ్రిస్టాక్ ఆధారిత కొనుగోళ్లు, పంటల బీమా తదితర సేవల కోసం వివిధ శాఖల మధ్య డేటా అనుసంధానాన్ని మరింత సులభతరం చేయాలని కోరారు.

### పప్పుధాన్యాల్లో 99 శాతం లక్ష్యం

ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ పప్పుధాన్యాల సాగులో రాష్ట్రం దాదాపు 99 శాతం లక్ష్యాన్ని సాధించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 3.4 లక్షల హెక్టార్లు కాగా కంది, మినుము, పెసర పంటల్లో కొన్ని లక్ష్యాలను మించి సాగు నమోదైందన్నారు. పప్పుధాన్యాల ఆత్మనిర్భరత మిషన్ కింద కంది, మినుముల 100 శాతం కొనుగోలుకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. స్వల్పకాలిక, కరువును తట్టుకునే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, పశు గ్రాస పంటలను ప్రోత్సహిస్తున్నామని, అవసరమైన పంటలకు ప్రభుత్వపరంగా బైబ్యాక్ భరోసా కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

### రైతుకు గిట్టుబాటు.. వినియోగదారుడికి అందుబాటు

వ్యవసాయం, ఉద్యానవనం, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లను క్రియాశీలం చేశామని మంత్రి తెలిపారు. సాధారణ రైతు బజార్లతో పాటు మొబైల్, డిజిటల్ రైతు బజార్లను అనుసంధానం చేస్తున్నామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### ఎల్‌నినో ఉపశమనానికి రూ.200 కోట్లు

ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కంటింజెన్సీ విత్తనాలను 80 శాతం రాయితీపై అందించేందుకు రూ.200 కోట్లు కేటాయించామని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రీ-మాన్‌సూన్ డ్రై సోయింగ్ కింద 32 రకాల విత్తనాలను ప్రోత్సహిస్తున్నామని, తద్వారా భూమిపై పచ్చదనం పెంచడంతోపాటు పశుగ్రాస కొరతను తగ్గించవచ్చన్నారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నీటి కొరత ప్రాంతాల్లో అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆగస్టు 7 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ, సాగునీటి, రెవెన్యూ, అనుబంధ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఎల్‌నినో ఉపశమన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రతి రైతు.. ప్రతి పొలం.. ప్రతి పంటను పరిశీలించి రైతుకు అవసరమైన సాంకేతిక సలహాలు అందిస్తున్నాం. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను కాపాడటమే మా మొదటి ప్రాధాన్యం అని మంత్రి స్పష్టం చేశారు.

### 44 లక్షల బీమా దరఖాస్తులు.. రూ.16 వేల కోట్ల రక్షణ

పంటల బీమా నమోదును ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టడంతో రైతుల నుంచి భారీ స్పందన లభించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. మొత్తం 44 లక్షల దరఖాస్తులు అందగా, వీరిలో 18.83 లక్షల మంది రుణ రైతులు, సుమారు 26 లక్షల మంది రుణేతర రైతులు ఉన్నారని చెప్పారు. గత ఏడాది సుమారు 2 లక్షలుగా ఉన్న రుణేతర రైతుల నమోదు ఈ ఏడాది 26 లక్షలకు పెరగడం విశేషమన్నారు. సుమారు 17 లక్షల హెక్టార్లకు దాదాపు రూ.16 వేల కోట్ల బీమా రక్షణ కల్పించామని, మొత్తం ప్రీమియం సుమారు రూ.630 కోట్లు కాగా రైతుల వాటా దాదాపు రూ.270 కోట్లుగా ఉందని వివరించారు.

### బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలి

వర్షాధార వ్యవసాయ కుటుంబాలకు పంటల బీమా అత్యంత కీలకమైన ఆర్థిక భరోసా అని మంత్రి పేర్కొన్నారు. రైతుల బీమా క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద కేంద్ర ప్రభుత్వ వాటాను సకాలంలో విడుదల చేయడంతోపాటు పెండింగ్ బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంకేతికతను రైతుకు చేరువ చేసి, సాగు వ్యయాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచి, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రకృతి ఎంత సవాల్ విసిరినా రైతుకు అండగా నిలుస్తాం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే ప్రతి సవాల్‌ను అధిగమించి రైతును మరింత బలోపేతం చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**- మంత్రి ఎన్ఎండి ఫరూక్**



నంద్యాల (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాలలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రి ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. వచ్చిన అర్జీలకు సంబంధించి తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# సాలూరులో 'మన డబ్బులు-మన లెక్క' అవగాహన ర్యాలీ

**- ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి**



సాలూరు (చైతన్యరథం): స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళల్లో ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మన డబ్బులు - మన లెక్క అవగాహన ర్యాలీ మన్యం జిల్లా సాలూరు పట్టణంలో ఉత్సాహంగా సాగింది. స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై పూర్తి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజువారీ పొదుపు, ఖాతాల నిర్వహణ, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండటమే మన డబ్బులు - మన లెక్క కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధికారులకు, మహిళలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, మెప్మా, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.

చైతన్యరథం

# పోలవరం ఎత్తుపై జగన్ దుష్ప్రచారం

- ఫేజ్-1, ఫేజ్-2 ప్రతిపాదనలు చేసింది వైసీపీ ప్రభుత్వమే
- ఆ పాపాన్ని కూటమి ప్రభుత్వంపై రుద్దే కుటిల యత్నం
- వైసీపీ హయాంలో ప్రశ్నార్థకం.. నేడు పూర్తవుతుందనే భరోసా తెచ్చాం
- సీఎం చంద్రబాబు సంకల్పంతో చకచకా పనులు
- పూర్తిస్థాయి 45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం నిర్మాణం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారం చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి పలుమార్లు ప్రతిపాదనలు పంపిందని, ఇప్పుడు ఆ తప్పులను కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలవరం ప్రాజెక్టును ఫేజ్-1, ఫేజ్-2గా విభజిస్తూ, తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తును 2022 జనవరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదించిందని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోకు అప్పటి స్పెషల్ సీఎస్ లేఖ రాసి రూ.10,911.15 కోట్ల నిధులు కోరారని చెప్పారు. అనంతరం జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పోలవరం ప్రాజెక్టు సీఈ, తదితరులు కూడా వైసీపీ పాలనలో పలుమార్లు లేఖలు రాశారని, ఆ లేఖల్లో పోలవరం ఎత్తు 41.15 మీటర్లుగా స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు.

పోలవరం నీటి నిల్వను 41.15 మీటర్లు, 45.72 మీటర్లుగా విభజించి ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేసింది జగన్ ప్రభుత్వం కాదా అని మంత్రి నిమ్మల ప్రశ్నించారు. 2024 ఫిబ్రవరి 16న వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1 అంచనా వ్యయాన్ని రూ.30,436.95 కోట్లుగా నిర్ధారించిందని మంత్రి గుర్తు చేశారు.

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ఎప్పుడూ ఫేజ్-1, ఫేజ్-2గా విభజించలేదని స్పష్టం చేశారు. నాటి టీడీపీ ప్రభుత్వం హయాంలోనే 11.02.2019 న జరిగిన 141 వ సాంకేతిక సలహా కమిటీ (టిఎసి) సమావేశంలో 2017-18 ధర స్థాయి (పిఎల్) ప్రకారం రూ. 55, 548. 87 కోట్లకు 45.72 మీటర్ల ఎత్తుకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం లభించిందని చెప్పారు. నాడు మా ప్రభుత్వ హయాంలో ఫేజ్-1, ఫేజ్-2 అనే ప్రతిపాదన ఎక్కడైనా ఉందా? జగన్ చేసిన పాపానికి మా ప్రభుత్వాన్ని బాధ్యులను చేయాలని చూస్తున్నారు. ఫేజ్-1, ఫేజ్-2 ప్రతిపాదనకు నాటి వైసీపీ ప్రభుత్వం అంగీకరించిందని, ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

## 45.72 మీటర్ల ఎత్తుతోనే నిర్మాణం

గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ అవార్డు-1980 ప్రకారం పోలవరం స్పిల్‌వే, ఈసీఆర్ఎఫ్ డిజైన్లు 45.72 మీటర్ల ఎత్తుతో, 194.60 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగానే రూపొందించబడ్డాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా పోలవరం నిర్మాణ పనులను 45.72 మీటర్ల ఎత్తు, 194.60 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతోనే పూర్తి చేస్తోందని స్పష్టం చేశారు. పోలవరం ఎత్తు విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వం ఏమాత్రం రాజీపడబోదని అని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, గోదావరి ట్రిబ్యునల్ అనుమతించిన మేరకు 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేసేలా, ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని మంత్రి రామానాయుడు తెలిపారు. మొదట 41.15 మీటర్లకు నీరు నిల్వ




చేసి, తర్వాత 45.72 మీటర్ల కాంటూరుకు నిల్వ చేసేందుకు అవసరమైన ఆర్‌అండ్ఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రం నుండి ఆమోదం కోరతామని అన్నారు

## పోలవరాన్ని విధ్వంసం చేసింది వైసీపీ ప్రభుత్వమే

పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి, ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని మంత్రి రామానాయుడు విమర్శించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు గండికొట్టారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి ఉంటే ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించగలిగేవారమని మంత్రి తెలిపారు. సుమారు 400 టీఎంసీల నీటిని రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు తరలించి ప్రయోజనం కల్పించే అవకాశం ఉండేదని చెప్పారు. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేం.. అని స్వయంగా నాడు అసెంబ్లీలో ప్రకటించిన వారు ఇప్పుడు పోలవరం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు.

## డయాఫ్రం వాల్ ధ్వంసం..

వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో ప్రాజెక్టు నిర్మాణం మరింత క్లిష్టంగా మారిందని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో డయాఫ్రం వాల్ ప్రాధాన్యత కూడా తెలియని విధంగా నాటి పాలకులు వ్యవహరించారని విమర్శించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రం నుంచి నిధులు సాధించి పోలవరం పనులను తిరిగి గాడిలో పెట్టామని మంత్రి తెలిపారు. ప్రశ్నార్థకంగా మారిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామనే భరోసాను ప్రజలకు కల్పించామని అన్నారు.

## పట్టిసీమతో కృష్ణా డెల్టాకు జీవనాడి


పట్టిసీమ ప్రాజెక్టును గతంలో వృథా ప్రాజెక్టుగా విమర్శించిన వారు, తాము అధికారంలోకి వస్తే పట్టిసీమ, పురుషోత్తమపట్నం పంపులు పీకేస్తామని చెప్పారని మంత్రి గుర్తు చేశారు. అయితే పట్టిసీమ ద్వారా వచ్చిన 500 టిఎంసిల గోదావరి జలాలతో కృష్ణా డెల్టాలో ఐదేళ్లలో సుమారు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించగలిగామని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా పట్టిసీమ కృష్ణా డెల్టాకు ఊపిరి పోస్తోందని చెప్పారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పట్టిసీమ నుంచి 45 టీఎంసీలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కృష్ణా డెల్టాలో సుమారు 6.80 లక్షల ఎకరాల్లో పంట సాగు జరుగుతోందంటే అందుకు పట్టిసీమ నీరు కీలక కారణమని చెప్పారు. పట్టిసీమ నీరు కృష్ణాడెల్టాకు అందడం వలనే శ్రీశైలం నుండి కృష్ణా నీరు పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ద్వారా రాయలసీమ అవసరాలకు ఇవ్వగల్గుతున్నామన్నారు. పట్టిసీమ లేకపోతే శ్రీశైలంకు వచ్చిన కృష్ణానీటిని కృష్ణా డెల్టాకు ఇవ్వవలసి వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబు నాయుడు ముందుచూపుతో నిర్మించిన పురుషోత్తపట్నం, పుష్కర లిఫ్ట్ స్కీమ్‌ల వల్లే నేడు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించగలుగుతున్నామని మంత్రి తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీమ్ ద్వారా 16.6 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని మంత్రి వెల్లడించారు.

## కాకినాడ జీజీహెచ్‌లో...

# క్యాన్సర్‌కు మరింత మెరుగైన వైద్యం

- ఓఎన్‌జీసీ సాయంతో రూ.36.65 కోట్లతో ఆధునిక చికిత్సా పరికరాలు
- అందుబాటులోకి రానున్న అత్యాధునిక లీనియర్ యాక్సిలరేటర్ 'హేలా'
- త్వరలో సేవలు ప్రారంభించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రధాన ప్రభుత్వ సర్వజనాసుపత్రుల్లో ఒకటైన కాకినాడ జీజీహెచ్‌లో త్వరలో క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఈ దిశగా రూ.36.65 కోట్ల వ్యయంతో హై ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్ (హెచ్‌ఇఎల్ఎ-హేలా)తోపాటు సీటీ స్కాన్ మెషీన్ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ అంగీకరించింది. ఈ ఆధునిక పరికరాల ఏర్పాటుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్) కింద వ్యయాన్ని భరించేందుకు ఓఎన్‌జీసీ ముందుకొచ్చింది. భారీ వ్యయంతో కూడిన ఈ పరికరాలు ఏర్పాటుకు సంబంధించి ఓఎన్‌జీసీ, కాకినాడ జీజీహెచ్ ల మధ్య ఒప్పందం చేసుకునేందుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. కాకినాడ ప్రాంత ప్రజల ప్రయోజనం కోసం సాయమందించేందుకు ముందుకొచ్చిన ఓఎన్‌జీసీ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. పరికరాల




కొనుగోలు, ఏర్పాటును వీలైనంత త్వరలో పూర్తి చేసి క్యాన్సర్ రోగులకు ఆధునిక చికిత్సలను ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.

## 'హేలా' తో ప్రయోజనాలు

కాకినాడ జీజీహెచ్‌లో ప్రస్తుతం క్యాన్సర్ రోగులకు టెలీకోబాల్ట్ మెషీన్ ద్వారా రేడియేషన్ చికిత్సను అందిస్తున్నారు. కోబాల్ట్ రేడియో న్యూక్లైడ్ ఆధారంగా పనిచేసే ఈ మెషీన్ ద్వారా అందించే రేడియేషన్ రోగి క్యాన్సర్ కణాలతో పాటు సాధారణ కణజాలాన్ని కూడా ప్రభావితం చేస్తుందని, దీనివల్ల రోగులకు కొంత ఇబ్బంది ఎదురవుతుందని కాకినాడ జీజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. లీనియర్ యాక్సిలరేటర్ ద్వారా అందించే చికిత్సలో ఈ దుష్పరిణామాలు ఉండవని ఆయన అన్నారు. కాకినాడ నగరంలో ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో 3 లీనియర్ యాక్సిలరేటర్లు అందుబాటులో ఉన్నాయని, కాకినాడ జీజీహెచ్‌లో సాధారణ లీనియర్ యాక్సిలరేటర్ కంటే మెరుగైన రూ.30 కోట్ల వ్యయంతో కూడిన హై ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్ (హేలా)ను ఏర్పాటు చేయనున్నామని, దీనివల్ల మరింత మెరుగైన సేవలు లభిస్తాయని తెలిపారు.

సాధారణ లీనియర్ యాక్సిలరేటర్ కేవలం 6 ఎంవి స్థాయి రేడియేషన్‌ను మాత్రమే అందిస్తుందని, దీనికి భిన్నంగా హేలా 6 ఎంవి, 15 ఎంవి శక్తితో కూడిన రేడియేషన్‌ను అందిస్తుందని డాక్టర్ శ్రీనివాసన్ వివరించారు. రోగి బరువు, ఊబకాయం స్థితిని బట్టి క్యాన్సర్ కణితి లోతు ఆధారంగా నిర్దిష్ట రీతిలో రేడియేషన్ చికిత్సను అందించడానికి ఆధునిక హేలా మెషీన్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో క్యాన్సర్ స్థితిని బట్టి రేడియేషన్ చికిత్సకు కనీసంగా రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు ఖర్చవుతుందని, కాకినాడ జీజీహెచ్‌లో హేలా ఏర్పాటుతో రోగులకు ఈ మేరకు ఉచితంగా క్యాన్సర్ చికిత్స అభిస్తుందని డాక్టర్ శ్రీనివాసన్ వివరించారు. ప్రస్తుతం కోబాల్ట్ మెషీన్‌తో రోజుకు సగటున 25 మంది రోగులకు చికిత్సను అందిస్తున్నామని, హేలా ఏర్పాటుతో రోజుకు 60 నుంచి 70 మంది ప్రయోజనం పొందనున్నారని ఆయన తెలిపారు. ఈ ఆధునిక యంత్రాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఇప్పటికే రూ. 7 కోట్ల ఖర్చుతో బంకర్‌ను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు.

హేలా యంత్రం ద్వారా రేడియేషన్ చికిత్స ప్రారంభించే ముందు సీటీ స్కాన్ యంత్రంతో రోగికి పరీక్షలు చేసి మూడు కోణాలనుంచి క్యాన్సర్ కణితి ఉన్న ప్రదేశాన్ని నిర్దిష్టంగా గుర్తిస్తారు.

# యువత భవితకు బంగారు బాటలు




## నిరుద్యోగులను మోసగించిన జగన్

ఏటా జాబ్ క్యాలెండర్, డీఎస్సీ నిర్వహిస్తామంటూ నాడు అధికారంలోకి వచ్చిన జగన్ మాట తప్పి నిరుద్యోగులను మోసగించారని మంత్రి సవిత మండిపడ్డారు. అయిదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేని అసమర్థుడు జగన్ అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మెగా డీఎస్సీని మంత్రి నారా లోకేష్ ఎంతో పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వడం ఓర్వుకోలేని జగన్... మెగా డీఎస్సీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

- మాది జెన్ జీ పక్షపాత ప్రభుత్వం
- 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఈ ఏడాది 10,060కు పైగా పోస్టులభర్తీకి నిర్ణయం
- పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగానే ఉద్యోగాల కల్పన
- యువత కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఉద్ఘాటన
- పెనుకొండలో ఘనంగా 'యువత భవితకు భరోసా'

పెనుకొండ/శ్రీసత్యసాయి (చైతన్యరథం): ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను జగన్ మోసగిస్తే, కూటమి ప్రభుత్వంలో ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూ రాష్ట్ర యువతకు బంగారు పునాదులు వేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. తమది జెన్ జీ ప్రభుత్వమని, చదువుకున్న యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. నైపుణ్యం పోర్టల్‌ను ఏర్పాటు చేసి, అందులో నిరుద్యోగ యువతకు అవసరమయ్యే ఉద్యోగావకాశాలు, స్కిల్ పెంచుకునే వివరాలు పొందుపర్చామన్నారు. యువశక్తితో 2047 నాటికి ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని ధీమా వ్యక్తంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువత భవితకు భరోసా కార్యక్రమంలో శుక్రవారం మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చదువులు పూర్తికాగానే యువతకు ఉద్యోగాలు లభించేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. కేవలం రెండేళ్ల కాలంలో ఏపీకి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకొంటున్నారని మంత్రి సవిత తెలిపారు.

### ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని మంత్రి సవిత తెలిపారు. ఈ ఏడాది 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను మంత్రి లోకేష్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిలో భాగంగా ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా 892 ఉద్యోగాలు, పోలీస్ డిపార్ట్‌మెంట్ లో 2,050 పోస్టులు, అగ్నిమాక డిపార్ట్‌మెంట్ లో 147 డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. మూడు వేల టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారన్నారు. రాబోయే మూడేళ్లలో మూడు డీఎస్సీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇకపై ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

### మాది జెన్ జీ పక్షపాత ప్రభుత్వం

అంతకుముందు మంత్రి సవిత... పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించాలని సూచించారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం గర్వపడేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవసరం మేరకే సెల్ ఫోన్లు ఉపయోగించాలని తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను ఏర్పాటు చేసి అందులో ఉద్యోగ అవకాశాలు, స్కిల్ పెంచనే విధానాలను పొందుపర్చామని, తమది జెన్ జీ పక్షపాత ప్రభుత్వమని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ద్వాక్రా అంటేనే చంద్రబాబు..

- మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాలే పునాది
- ద్వాక్రా వీఓఏ, వీఓబీల ఆత్మీయ సమావేశంలో మంత్రి నిమ్మల



పాలకొల్లు (చైతన్యరథం): ద్వాక్రా అంటేనే చంద్రబాబు నాయుడు, చంద్రబాబు అంటేనే ద్వాక్రా అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు లైన్స్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం యలమంచిలి, పోడూరు మండలాల ద్వాక్రా వీఓఏ, వీఓబీల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు వినాయక చవితి, దసరా పండుగలను పురస్కరించుకుని చీరలను అందజేశారు. సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ సమాజంలో సగం జనాభా మహిళలేనని, మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేలా భారతదేశంలోనే తొలిసారిగా స్వయం సహాయక సంఘాల ఉద్యమాన్ని విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనన్నారు. మహిళల పొదుపు శక్తిని సంఘటిత శక్తిగా మార్చి, బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేశారని చెప్పారు.

ద్వాక్రా సంఘాల ద్వారా లక్షలాది మహిళలు చిన్న వ్యాపారాలు, పశుపోషణ, కుట్టు కేంద్రాలు, ఆహార ఉత్పత్తులు, హస్తకళలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారారని వివరించారు. ఒకప్పుడు కుటుంబ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడిన మహిళలు నేడు కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

ద్వాక్రా ఉద్యమ విజయాల్లో వీఓఏలు, వీఓబీల పాత్ర అత్యంత కీలకమని మంత్రి కొనియాడారు. గ్రామ స్థాయి సంఘాల సమన్వయం, సభ్యుల పొదుపులు, రుణాల పర్యవేక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక పారదర్శకత విషయంలో వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు.

ద్వాక్రా సీఏలు, ఆర్పీలకు తొలిసారిగా గౌరవ వేతనాల వ్యవస్థను తీసుకువచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఆ సమయంలో అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి దృష్టికి తీసుకెళ్లానని, అనంతరం చంద్రబాబు నాయుడిని కలిసి వారి పరిస్థితిని వివరించగా సానుకూలంగా స్పందించి అమలు చేసినట్లు చెప్పారు.

మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో ద్వాక్రా మహిళలు ఇళ్ల అరుగులపై, ఆలయాల వరండాల్లో సమావేశాలు నిర్వహిస్తున్న పరిస్థితులను చూసి స్వయం సహాయక సంఘాలకు సొంత భవనాలు ఉండాలనే లక్ష్యంతో పాలకొల్లు నియోజకవర్గంలో 67 ద్వాక్రా భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోయాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామని, ఇప్పటికే కొంతమేర నిధులు కూడా మంజూరయ్యాయని వెల్లడించారు. ద్వాక్రా మహిళలకు ఏ సమస్య వచ్చినా మీ కుటుంబంలో ఒక సభ్యుడిగా తీర్చేందుకు ఎప్పుడు అండగా ఉంటానని మంత్రి నిమ్మల తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని మంత్రి అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు వివిధ పరిశ్రమలు, సంస్థల సీఎస్ఆర్ నిధులను సమీకరించి శ్మశానాల అభివృద్ధి, విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తున్నాయని చెప్పారు. మహిళల చేతిలో పొదుపు పుస్తకం ఉంటే కుటుంబానికి భరోసా, గ్రామానికి అభివృద్ధి, రాష్ట్రానికి ఆర్థిక బలం లభిస్తుందనే లక్ష్యంతో ప్రారంభమైన ద్వాక్రా ఉద్యమం నేడు లక్షలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల ఖబర్రి, తుల రామలింగేశ్వరరావు, కర్నేన గౌరు నాయుడు, గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, పెనుమత్స రాంబద్ర రాజు, బోనం నాని, ఆరిమిల్లి శ్రీనివాస్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, దాసరి రత్నం రాజు, పాలవలస తులసి రావు, కడలి గోపాలరావు, పొట్నూరి శ్రీనివాస్, రియా, అల్లూరి పద్మవర్మ జక్కంపూడి కుమార్, ఎర్రంశెట్టి పద్మారావు, కొల్లికొండ ప్రసాద్, పీతల శ్రీనివాస్, తాళ్ల నాగరాజు, ఉన్నమట్ల ప్రేమ్ కుమార్, ముచ్చర్ల శ్రీనివాస్, పాల నాగలక్ష్మి, తానేటి బాబురావు, తదితరులు, పెద్ద సంఖ్యలో ద్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చైతన్యరథం

# ఎల్‌నినోపై జగన్ ది పచ్చి అబద్ధాల డ్రామా

- ముప్పును ముందే గుర్తించిన సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో చర్యలు
- 'జలధార-జలహారతి'తో 79,826 పనులు పూర్తి.. భూగర్భ జలాలు 0.79 మీటర్లు పెరుగుదల
- 17 లక్షల మంది రైతులు స్వచ్ఛందంగా పీఎండీఎస్ పద్ధతుల వైపు మొగ్గు
- మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు కూటమి ప్రభుత్వం రూ.800కోట్లకు పైగా ఖర్చు
- వైసీపీ హయాంలో రైతులకు చేసిందేమీ లేదు.. కాగితాలపై లెక్కలు చూపి మోసం చేశారు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి రైతులను, పంటలను కాపాడేందుకు కూటమిప్రభుత్వం శాస్త్రీయ దృక్పథంతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుంటే.. వాస్తవాలను పక్కన పెట్టి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్యప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఏమీ చేయలేదని జగన్ చెప్పడం పూర్తిగా అవాస్తవమని మంత్రి స్పష్టం చేశారు. ఎల్‌నినో ముప్పును ముందుగానే అంచనా వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 2026లోనే 'జలధార' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. ముందస్తు ప్రణాళికలు, క్షేత్రస్థాయి చర్యల ఫలితంగానే రాష్ట్రంలో భూగర్భ జలాలు 0.79 మీటర్లు పెరిగాయని వెల్లడించారు. 'జలధార-జలహారతి' కార్యక్రమం కింద కూటమి ప్రభుత్వం రూ.3,409.35 కోట్ల వ్యయంతో 79,826 పనులను పూర్తిచేసిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 625టీఎంసీల భూగర్భజలాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.ముందస్తు చర్యలు లేకపోయి ఉంటే పరిస్థితిమరింత క్లిష్టంగామారేదని పేర్కొన్నారు.

## గత ప్రభుత్వ బకాయిలను మేమే చెల్లిస్తున్నాం

పంటల బీమా గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఖరీఫ్ సీజన్‌లో కేవలం మూడేళ్లు మాత్రమే పంటలబీమా ప్రీమియం చెల్లించి, రెండు సంవత్సరాలు ప్రీమియం చెల్లించకుండా వదిలేశారని, ఐదేళ్లలో రబీకి ఒక్క ఏడాది కూడా బీమా కట్టలేని జగన్ ఇప్పుడు నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఏర్పడిన ఆర్థిక భారాన్ని భరిస్తూనే రైతులకు పంటల బీమా భద్రత కల్పిస్తున్నామని చెప్పారు.

కూటమి ప్రభుత్వం పంటలబీమాను గాలికి వదిలేసిందని విమర్శిస్తున్న జగన్ ముందుగా తన ఐదేళ్ల పాలనలో రైతులకు ఏ మేరకు బీమా రక్షణ కల్పించారో సమాధానం చెప్పాలనిప్రశ్నించారు.దేశంలోనే పంటల బీమా నమోదులో ఆంధ్రప్రదేశ్ అత్యధిక శాతం నమోదు సాధించిన రాష్ట్రంగా నిలిచిందని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బీమా ప్రీమియం నిధులను ముందుగానే ఎస్క్రో ఖాతాలో అందుబాటులో ఉంచామని తెలిపారు. కూటమి ప్రభు త్వం ముందుచూపుతో తీసుకున్న చర్యల ఫలితంగా తొలిసారిగా సుమారు రూ.16వేల కోట్ల విలువైన పంటలకు బీమా నమోదు జరిగిందని మంత్రి వెల్ల డించారు. రైతులకు ప్రకృతి వైపరీత్యాల నుంచి ఆర్థిక భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రైతు సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు వైసీపీ తన హయాంలో రైతులకు చేసిన అన్యాయానికి సమాధానం చెప్పాలని నిలదీశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింది కూటమి ప్రభుత్వం రూ.800 కోట్లకు పైగా ఖర్చు చేసింది.. వైసీపీ హయాంలో రైతులకు చేసిందేమీ లేదు.. కాగితాలపై లెక్కలు చూపి మోసం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు.

## శాస్త్రీయంగా పంచసూత్రాల అమలు

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పరిస్థితిని ముందుగానే అంచనా వేసి ఫిబ్రవరి 2026 నుంచే కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణను ప్రారంభించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జూన్-ఆగస్టు కాలంలో సాధారణ వర్షపాతం 350 మి.మీ. కాగా ఇప్పటివరకు 170.9 మి.మీ. మాత్రమే నమోదైందని, రాష్ట్రంలో వర్షపాత లోటు 51.2 శాతంగా ఉండగా దేశవ్యాప్తంగా ఇది సుమారు 13 శాతమేనని వివరించారు. పంట నష్టం జరిగిన తర్వాత స్పందించే విధానానికి భిన్నంగా, శాస్త్రీయ సమాచారం, శాటిలైట్ పర్యవేక్షణ, జలాశయాల నీటి నిల్వలు, నేల తేమ, పంటల పరిస్థితి, విత్తనాలు, సాగు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతు కేంద్రిత ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రాంతం-రైతు కమతం ఆధారిత వ్యూహం, పీఎండీఎస్-సీడ్ పెల్లింగ్, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, 'రైతన్న మీ కోసం' ఎల్‌నినో మిటిగేషన్ ప్లాన్, పంటల బీమా ద్వారా ఆర్థిక రక్షణ అనే పంచసూత్రాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 8,489 రైతు సేవా కేంద్రాల పరిధిలో.. 1,357 కేంద్రాలను హైరిస్క్, 2,077 కేంద్రాలను మోడరే ట్ రిస్క్‌గా గుర్తించి, ఏపీజీఎస్, శాటిలైట్ సమాచారం, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా రైతు కమతాలను నార్మల్, వాచ్, అలర్ట్ కేటగిరీలుగా విభజించి కమతం వారీగా ప్రత్యేక సలహాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వర్షాధార ప్రాంతాల్లో పీఎండీఎస్-సీడ్ పెల్లింగ్‌ను ప్రోత్సహిస్తుండగా సుమారు 23 లక్షల మంది రైతులు 25 లక్షల ఎకరాల్లో ఈ విధానాలను అనుసరిస్తున్నారన్నారు., పీఎండీఎస్‌ను గ్రీన్ ఫాడర్ మేనేజ్‌మెంట్‌తో అనుసంధానించి పశుగ్రాస కొరతను నివారిస్తున్నామని తెలిపారు.

## ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

జలాశయాలు, నదీ ప్రవాహాలు, సాగునీటి లభ్యతను అంచనా వేసి అధిక నీరు అవసరమయ్యే వరికి ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు,




చిరుధాన్యాలు, స్వల్పకాలిక పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 7, 2026న ప్రారంభించిన 'రైతన్న మీ కోసం-ఎల్ నినో మిటిగేషన్ ప్లాన్' ద్వారా 46.86 లక్షల మంది రైతులకు సంబంధించిన 2.75 కోట్ల కమతాలను పరిశీలిస్తూ వ్యవసాయ, రెవెన్యూ, జలవనరులు తదితర శాఖల సమన్వయంతో ప్రతి కమతంలోని పంట, నీటి లభ్యత, నేల తేమ, పంట దశ, ప్రమాద స్థాయిని అంచనా వేసి తక్షణం తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలు అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా పంటల బీమాను మరింత విస్తరించి 2025లో 19.5 లక్షలుగా ఉన్న బీమా దరఖాస్తులను 2026లో 35.15 లక్షలకు పెంచామని, బ్యాంకు రుణాలు తీసుకోని రైతులను కూడా బీమా పరిధిలోకి తీసుకురావడంతో వారి సంఖ్య 2 లక్షల నుంచి 27.5 లక్షలకు పెరిగిందన్నారు. ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, పట్టు తదితర అనుబంధ రంగాల్లోనూ నీటి పొదుపు, తేమ సంరక్షణ, పశుగ్రాసం, నీటి కొరత నివారణ, పంట-పశు రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు., గత ఏడాది 15,303గా ఉన్న పశువుల షెల్టర్లను ఈ ఏడాది 20,000కు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.

## రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ అభివృద్ధిపై కనీసం ఒక్క సమీక్ష సమావేశమైనా నిర్వహించారా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. వ్యవసాయాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా భావిస్తున్నందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నెలకు రెండుసార్లు వ్యవసాయ రంగంపై సమీక్షలు నిర్వహిస్తూ, రైతుల సమస్యలు, సాగునీరు, నీటి సంరక్షణ, పంటల పరిస్థితి, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని 'వాటర్ మ్యాన్' అని ఊరికే అనలేదని, నీటి వనరుల సంరక్షణ, సమర్థ వినియోగానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యతే అందుకు నిదర్శనమన్నారు. వైసీపీ హయాంలో మైక్రో ఇరిగేషన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో సుమారు రూ.1,100 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, వాటిని ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రిప్, మైక్రో ఇరిగేషన్ విస్తరణకు పెద్దపీట వేసి, ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపామని వెల్లడించారు. ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకోవడం, భూగర్భ జలాలను సంరక్షించడం, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషిని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించకుండా ఉంటే సీమ ప్రజలు హర్షిస్తారని మంత్రి వ్యాఖ్యానించారు. రాయలసీమను 'రతనాల సీమ'గా తీర్చిదిద్దే లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పరిధిలో సుమారు రూ.40 వేల కోట్లు, ప్రైవేట్ రంగంలో మరో రూ.60 వేల కోట్ల పెట్టుబడులతో మొత్తం రూ.1 లక్ష కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించి హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. వ్యవసాయం, సాగునీరు, ఉద్యానవన రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేసి రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## ముందుగానే విత్తనాల సిద్ధం

వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసిందని మంత్రి చెప్పారు. మొదటి విడతలో 47,321 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేయడంతో పాటు, ఆగస్టు 15 తర్వాత ఏర్పడే అదనపు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 1.12 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆగస్టు 3 నుంచే ఆర్ఎస్‌కేలు, మండల స్థాయిలో 'రైతన్నా మీకోసం' వారోత్సవాల ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అదేవిధంగా 6.30 లక్షల హెక్టార్లలో పంటల బీమా కవరేజీ కల్పించామని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వరి బీమా నమోదుకు గడువును ఆగస్టు 31 వరకు పొడిగించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఐదు నెలలకు సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. పశుగ్రాసం అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న జిల్లాలకు తరలించేందుకు ఇప్పటికే స్పష్టమైన ట్రాన్స్‌పోర్ట్ ప్లాన్‌ను సిద్ధం చేశామని చెప్పారు. పశువులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు.

## తెలంగాణ అక్రమ ప్రాజెక్టులపై జగన్ ఎందుకు మౌనం వహించారు?

వైసీపీ ఐదేళ్ల పాలనలో తెలంగాణ ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్న సమయంలో జగన్ మోహన్‌రెడ్డి ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాల్లో అప్పటి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రైతులు, వ్యవసాయం, నీటి వనరుల ప్రయోజనాలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు.ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు శాస్త్రీయ విధానాలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రతి రైతును.. ప్రతి పంటను కాపాడటమే కూటమి ప్రభుత్వలక్ష్యమని, ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం రాత్రింబవళ్లు పని చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## జాతీయ రహదారుల సత్వర పూర్తికి సహకారం

### - ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అమరావతి ప్రాజెక్టు అమలు యూనిట్ ప్రాజెక్టు డైరెక్టర్ విరాజ్ సురాజ్ వాలా శుక్రవారం సచివాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), వినుకొండ - గుంటూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 544 డీ) అభివృద్ధి పనుల గురించి వివరించారు. ప్రస్తుతం 2 లేన్లగా ఉన్న వినుకొండ - గుంటూరు జాతీయ రహదారిని 4 లేన్లుగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు - నిజాంపట్నం హైవేకు సంబంధించి అలైన్‌మెంట్ కు ఆమోదం లభించగా, టెక్నికల్ కమిటీ ముందుకు పంపనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా 190 కి.మీ మేర 6 లేన్లతో 5 జిల్లాల పరిధిలో చేపట్టిన అమరావతి ఓఆర్ ఆర్ భూసేకరణపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణం కోసం అవసరమైన ఫ్లై యాష్ ను ఉచితంగా సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఎన్‌హెచ్ఏఐకు వెసులుబాటు కల్పించిన అంశాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్యలు ఉంటే, ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సమస్యల పరిష్కారానికి ఒక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు



చేసి, పెండింగ్ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# జనవరిలో తెనాలి వేదికగా నంది నాటకోత్సవాలు

- ఆ నెల 10న కందుకూరి అవార్డుల ప్రదానం, అనంతరం వారం పాటు నాటకాల ప్రదర్శన
- రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల
- కందుకూరి ప్రతిష్ఠాత్మక పురస్కారాల సంఖ్య 5కు పెంపు, ఒక్కొక్కరికి రూ.1 లక్ష పారితోషికం
- ఈ వారంలోనే సినిమా, టీవీ రంగాల నంది అవార్డుల నోటిఫికేషన్
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి




అమరావతి (చైతన్యరథం): తెలుగు నాటకరంగానికి, సంస్కృతికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నంది నాటకోత్సవాలను పునఃప్రారంభిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండీ విశ్వనాథన్‌తో కలిసి మంత్రి దుర్గేష్ వివరాలు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..నంది నాటకోత్సవాలు కేవలం ప్రదర్శనలు కావు... తెలుగు నాటకరంగ సంస్కృతికి, నటీనటుల ప్రతిభకు పట్టం కట్టే అపూర్వ పండుగగా అభివర్ణించారు. కళను బతికించే నాటక సమాజాలు, సమాజాన్ని చైతన్యపరిచే కళాకారులు– తెలుగు సంస్కృతికి మూలస్తంభాలు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల మార్గదర్శకత్వంలో కళాకారులకు సరైన గుర్తింపునిచ్చేలా ఎఫ్.డి.సి ద్వారా అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. కళలకు కాణాచి అయిన గుంటూరు జిల్లా తెనాలిలో జనవరిలో నంది నాటకోత్సవాలు జరుగుతాయి. అవార్డుల ఎంట్రీల కోసం రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి, అక్టోబర్‌లో సెలక్షన్ కమిటీని నియమిస్తాం. డిసెంబర్‌లో ప్రాథమికంగా ఎంపికైన నాటకాల జాబితాను ప్రకటిస్తాం. జనవరి 10న ప్రతిష్ఠాత్మక కందుకూరి అవార్డుల ప్రదానంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం వారం పాటు ఎంపికైన నాటకాల ప్రదర్శనలు, ఆ తర్వాత అత్యంత వైభవంగా నంది నాటకోత్సవాల పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. ఇతర రాష్ట్రాల్లోని తెలుగు నాటక సమాజాలకు కూడా తొలిసారిగా అవకాశం కల్పిస్తున్నాం. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) తరహాలో వీడియోల ద్వారా పరిశీలించి పారదర్శకంగా ఎంపిక చేస్తాం.

గతంలో 3గా ఉన్న కందుకూరి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను 5 కి పెంచి, ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున అందజేస్తాం. స్థానం నరసింహారావు, ఆచార్య ఆత్రేయ, గరికపాటి రాజారావు, బందారు రామారావు, తదితర దిగ్గజాల పేర్లతో ఈ పురస్కారాలు ఉంటాయి.

కొత్తగా ఏర్పాటు అయిన 28 జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లా నుంచి ముగ్గురికి, అలాగే ప్రత్యేక సేవలు అందించిన మరొక 16 మందికి అవార్డులు ఇస్తాం. పద్యనాటకం, సాంఘిక నాటకం, రచయితలు, సాంకేతిక నిపుణులు, నాటక సమాజం కేటగిరీల్లో మొత్తం 100 మందికి/సంస్థలకు కందుకూరి విశిష్ట పురస్కారాలు ఇవ్వనున్నాం. నాటక పరిషత్తులకు ఒక్కో దానికి రూ. 5 లక్షలు ఇచ్చే బదులు, ఎక్కువ మంది కళాకారులకు లబ్ధి చేకూరేలా ఒక్కో పరిషత్‌కు రూ. 1 లక్ష చొప్పున విస్తృతంగా కేటాయిస్తున్నాం. ఇప్పటికే ఒక పర్యాయం కందుకూరి పురస్కారాలను గత ఏడాది తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 16 న 100 మందికి ఇచ్చాము. చిత్ర పరిశ్రమ, నాటకరంగానికి అవసరమైన అనుమతుల కోసం ఎఫ్‌డీసీ ద్వారా సింగిల్ విండో విధానం తెచ్చామని తెలిపారు. సినిమా, టీవీ రంగాల నంది అవార్డులకు సంబంధించి ఈ వారంలోనే ప్రకటన విడుదల చేసి, జనవరి నాటికి ప్రదానోత్సవాలు పూర్తి చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. పద్య నాటకం, సాంఘిక నాటకం, నాటిక, బాలల నాటిక, కాలేజీ,యూనివర్సిటీ నాటిక, రంగస్థలం మీద బెస్ట్ బుక్ తదితర కేటగిరీల్లో నంది అవార్డులు అందిస్తామని పేర్కొన్నారు..

# ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యం

**- పాలకొల్లులో 'యువత భవితకు భరోసా' సదస్సులో మంత్రి నిమ్మల రామానాయుడు**



పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్రంలో యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల సృష్టికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'యువత భవితకు భరోసా' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పూలు, పండ్లు నిండుగా ఉన్న చెట్టుకే రాళ్ల దెబ్బలు ఎక్కువగా తగులుతాయని, ఎందుకంటే ఆ చెట్టు నుంచి ఏదో ఒక ఫలం లభిస్తుందనే ఆశ ప్రజల్లో ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. నీడనూ, ఫలాలనూ ఇవ్వదనే ఉద్దేశంతో మోడువారిన చెట్టును ఎవరూ పట్టించుకోరన్నారు. నేడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఫలితాలు ఇస్తున్న చెట్టు లాంటిదని, గత జగన్ పాలన మాత్రం ప్రజల ఆశలను నెరవేర్చలేకపోయిందని వ్యాఖ్యానించారు. ఈ రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడాను యువత గమనించాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రతి ఏడాది డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటించినప్పటికీ అమలులోకి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీపై తొలి సంతకంచేసి 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టి వేలాది కుటుంబాల్లో ఆశలు నింపిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు గతంలోనే డీఎస్సీ ద్వారా రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత సాధించారని తెలిపారు.

భవిష్యత్తులో కూడా ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని, యువతకు ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమల స్థాపన ద్వారా లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. వాటి ఫలితాలు దశలవారీగా యువతకు అందుతాయని అన్నారు.

ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి చెప్పారు. అనంతపురం, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల్లో ఔత్సాహిక యువతకు శిక్షణ అందించే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఆక్వా, ఐటీ, సేవారంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని, వాటికి అవసరమైన నైపుణ్యాలను అందించేలా విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తున్నామని వివరించారు.

కళాశాల చైర్మన్ కె.వి.ఆర్. నరసింహారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐబీఎం ప్రాజెక్టు ఆఫీసర్, మాస్టర్ ట్రైనర్ రాహుల్ విక్రాంత్ విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్, లాజికల్ అప్రోచ్, జనరేటివ్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ప్రాబ్లమ్ సాల్వింగ్ విధానాలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అర్థమెటిక్ రీజనింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి కేవీ సీతారామ రాజు, ఖజాంచి ఆర్. ప్రవీణ్ భాను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై ఎన్డీఏ కూటమి కసరత్తు



- మూడు పార్టీల కీలక నేతల సమావేశం
- క్షేత్రస్థాయి పరిస్థితులు, ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘ చర్చ
- కూటమి సమన్వయమే కీలకం, గెలుపే లక్ష్యంగా కార్యాచరణ
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెల్లడి

విశాఖపట్నం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల సన్నద్ధత, అనుసరించాల్సిన వ్యూహాలపై కీలకంగా చర్చించినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం సమీపంలోని ప్రైవేట్ రిసార్టులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి పల్లా పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేసేలా క్షేత్రస్థాయి కార్యాచరణ, పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహాలపై సమావేశంలో చర్చించినట్లు పల్లా వెల్లడించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక సంస్థల్లో కూటమి బలం మరింత పటిష్టమవుతుందని పల్లా పేర్కొన్నారు.

# సాగునీటిపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు



- విజన్‌తో పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత
- పెనుకొండలో మంత్రి వార్డుల పర్యటన
- ఇంటి లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందజేత

పెనుకొండ (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలోని 10, 11వ వార్డుల్లో మంత్రి సవిత శుక్రవారం పర్యటించారు. వార్డుల్లోని ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను స్వయంగా విని, స్థానికంగా నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించాలని ఆదేశించారు. ప్రజలు తమ వార్డుల్లోని పలు చిన్నచిన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

### రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు

పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే 10, 11వ వార్డుల్లో సుమారు రూ.40 లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం మరో రూ.60 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మొత్తంగా మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం గ్రామ కంఠంలో ఇల్లు నిర్మించుకున్న వారికి ఇంటి పొజిషన్ పత్రాలను లబ్ధిదారులుకు నేరుగా వారి ఇంటి దగ్గరే మంత్రి సవిత అందజేశారు

### జగన్ వ్యాఖ్యలపై ఫైర్

ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులపై చేసిన వ్యాఖ్యలను మంత్రి సవిత తీవ్రంగా తప్పుబట్టారు. సాగునీటి గురించి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ప్రాంతానికి నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. వర్షాభావం, ఎల్‌నినో వంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి, రైతులకు నీటి కొరత లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేస్తున్నారని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల, వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభించామన్నారు. అదే విధంగా హంద్రీ-నీవా పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

### నాగులకట్ట అభివృద్ధికి రూ.లక్ష

పెనుకొండలోని శ్రీరాములయ్య కాలనీలో నాగులకట్ట అభివృద్ధి కోసం మంత్రి సవిత తన సొంత నిధుల నుంచి రూ.లక్ష కేటాయించారు. ఈ సందర్భంగా స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ, పెనుకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి సవిత అన్నారు.

## రూ.661 కోట్లతో అసెంబ్లీ భవనంపై స్పైర్ నిర్మాణం

- టెండర్లు పిలిచేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం
- మలి విడత ల్యాండ్ పూలింగ్ రైతులకు కనీస కౌలు రూ.40వేలు
- పురపాలక మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి నడిబొడ్డున అత్యంత ఎత్తైన భవన నిర్మాణాల్లో ఒకటైన అసెంబ్లీ ఐకానిక్ భవనంపై 250 మీటర్ల స్పైర్ నిర్మాణానికి రూ.661 కోట్లతో టెండర్ పిలిచేందుకు పరిపాలనామోదం ఇచ్చినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం వివరాలను ఏపీ సచివాలయం లోని ప్రచార విభాగంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి వెల్లడించారు.



రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 1548 కోట్లతో టెండర్లు పిలవడానికి కూడా పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు. రాష్ట్రంలోని స్టాండర్ట్స్ ప్రైవేట్ స్కూల్స్‌కు కూడా రాజధాని ప్రాంతంలో నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. అందులో భాగంగానే నలందా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌కి 5 ఎకరాలు కృష్ణాయపాలెంలో ఇవ్వనున్నా మన్నారు. ఏడాదిన్నరలో స్కూల్ నిర్మాణం పూర్తవనుందని మంత్రి తెలిపారు. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి నేలపాడులో 50సెంట్లు భూమి కేటాయించామన్నారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు కౌలు జరీబు అయితే రూ.50వేలు, నాన్ జరీబు అయితే రూ. 40వేలు అందిస్తున్నామన్నారు. 2014-19 మధ్యలో భూ సమీకరణలో భాగంగా భూములు ఇచ్చిన ఎకరం కంటే తక్కువ ఉన్న వారికి గతంలో రూ.30వేలు ఇచ్చామన్నారు. రెండో విడత భూ సమీకరణ సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు వారికి కూడా కౌలు రూ.40వేలు ఇవ్వడానికి అథారిటీ అనుమతి లభించిందన్నారు. అక్టోబర్ చివరి నాటికి రెవెన్యూ సమస్యలను సైతం పరిష్కరించి ల్యాండ్ పూలింగ్ 80 శాతం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే



- మంత్రి కందుల దుర్గేష్ ధీమా
- గుంటూరులో కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి
- కూటమి ధర్మాన్ని పాటిస్తూ స్థానిక ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో గెలుపే లక్ష్యమని ఉద్ఘాటన
- అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థుల గెలుపునకు సమన్వయంతో కృషి చేయాలని పిలుపు

గుంటూరు (చైతన్యరథం): ఎన్నిక ఏదైనా విజయం కూటమిదేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన కూటమి భాగస్వామ్య పక్షాల (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకుల సమన్వయ సమావేశంలో పాల్గొన్న అనంతరం మంత్రి దుర్గేష్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ క్షేత్రస్థాయిలో సమైక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఇదివరకే ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల మార్గదర్శకత్వంలో ప్రతి జిల్లాలో భాగస్వామ్య పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుంటూ సమన్వయ భేటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్టానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తే వారి గెలుపునకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని, అధిష్టానానిదే అంతిమ నిర్ణయమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి, ప్రజా ఆకాంక్షలు నెరవేర్చడం, 'సూపర్ సిక్స్' పథకాల అమలు తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి మద్దతు కూడగడతామన్నారు. ముందుగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు, అనంతరం పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని... ఎన్నిక ఏదైనా, అభ్యర్థి ఎవరైనా కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని, ఈ సెప్టెంబర్‌లోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్‌లో ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. నాటి వైకాపా పాలనలో ప్రతిపక్షాలను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా బలవంతపు ఏకగ్రీవాలకు పాల్పడ్డారని విమర్శించారు. నేడు వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో పోటీ పడలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కొని ప్రజల మనసు గెలుచుకుంటుందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. మీడియా సమావేశం అనంతరం నాయకులంతా కలిసి జై కూటమి అని నినదించారు.

ఈ సమావేశంలో టీడీపీ తరపున కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పిల్లి మాణిక్యాలరావు, రాజు, బీజేపీ తరపున తిరుపతిరావు, సూర్యనారాయణ, జయప్రకాష్, జనసేన తరపున చిల్లపల్లి శ్రీనివాసరావు, బిట్రగుంట మల్లిక్, షేక్ నాయక్ కమల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# పేదలందరికీ ఇళ్లే కూటమి ప్రభుత్వం లక్ష్యం

- అందుకు అనుగుణంగా పనులు వేగం పుంజుకోవాలి
- గృహనిర్మాణశాఖ అధికారులకు మంత్రి పార్థసారథి ఆదేశాలు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి పేదవారికి సొంతిల్లు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని, ఆ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని గృహనిర్మాణశాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. విజయవాడలోని నిర్మాణ భవన్‌లో పేదలకు ఇళ్లు అందించే అంశంపై సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల మంజూరు కోసం ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు, అర్హత ఉన్న దరఖాస్తులు ఎన్ని, ఎన్ని దరఖాస్తులు ఆమోదించారు, లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు, పెండింగ్ బిల్లులు, నిర్మాణాల పురోగతి, వాటిలో ఉన్న సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు తదితర అంశాలన్నింటిపై అధికారులను ఆరా తీశారు. పేదలకు ఇళ్లు ఇచ్చే విషయంలో, బిల్లుల చెల్లింపుల విషయంలో అలసత్వం ప్రదర్శించినా, ప్రజలను జాప్యంతో ఇబ్బందులు పెట్టినా ఉపేక్షించే పరిస్థితులు ఉండవని హెచ్చరించారు.

క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనులు, బిల్లుల చెల్లింపులు వేగవంతం చేసి పురోగతిని చూపించాలని ఆదేశించారు. కొత్తగా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, సాంకేతికపరమైన అంశాలు ఏమైనా ఉంటే వాటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పేదకుటుంబం సొంతింటి కలను సాకారం చేసేలా అధికారులు పనితీరును కనబర్చాలని కోరారు. తదుపరి సమీక్షా సమావేశం నిర్వహించేనాటికి పనుల్లో పురోగతి, వేగం రెండూ పెరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ వీసీ, ఎండీ హెప్సిబారాణి, ఓఎస్డీ డాక్టర్ ఎన్ ప్రకాష్ రావు, గృహనిర్మాణశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు తెలుగు జాతి సంపద

- ఒక కుటుంబానికి, పార్టీకి చెందిన వ్యక్తి కాదు
- 2019లో కూడా సీఎంగా కొనసాగిఉంటే అభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండేది
- ఏ-2 విజయసాయి నోట నీతులు హాస్యాస్పదం
- ఏ-1 జగన్‌తో కలిసి 12 సీబీఐ కేసుల్లో 16 నెలలు సహఖైదీగా జైల్లో
- అవినీతి రహిత పాలన అంటే జనం నవ్వుతున్నారు
- ప్రజలు నమ్మాలంటే అక్రమాస్తుల కేసుల్లో అప్రూవర్‌గా మారి, ఏ-1 అవినీతిని కోర్టు ముందుంచు
- కోర్టు తీర్పు తరువాత జనంలోకి రా.. అంతేకానీ ముసుగుతో వస్తే తరిమి కొడతారు
- ఆదర్శనేత చంద్రబాబును అవినీతి అనకొండ జగన్‌తో పోల్చడం ఘోర తప్పిదం
- మీడియాతో ఎమ్మెల్సీ వర్ల రామయ్య



అమరావతి (చైతన్యరథం): అవినీతి కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉంటూ, రాష్ట్రాన్ని దోచుకున్న ఏ-2 విజయసాయి రెడ్డి ఈరోజు "అవినీతి రహిత పాలన", "మూడో ప్రత్యామ్నాయం" అంటూ నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరి లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డితో కలిసి అడుగడుగునా అవినీతికి పాల్పడి, దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ చేతిలో అరెస్ట్ అయి, రూ.43వేల కోట్ల ప్రజాధనం లూటీకేసుల్లో ఏ-2గా చంచల్‌గూడ జైల్లో 16నెలలు జగన్‌తోపాటు సహ ఖైదీగా గడిపిన చరిత్ర విజయసాయిరెడ్డిదని ధ్వజమెత్తారు. గతంలో ప్రజలను మాయమాటలతో మోసం చేసి జగన్‌ను గద్దెనెక్కించడంలో, ఆ తర్వాత ఐదేళ్లపాటు ఆయన వెనకుండి ప్రభుత్వాన్ని నడిపించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడంలో విజయసాయి రెడ్డే ప్రధాన సూత్రధారి, సలహాదారుడు. ఇప్పుడు అదంతామర్చిపోయి జగన్‌ను పక్కన పెట్టి కొత్తగా మూడో ప్రత్యామ్నాయం తీసుకొస్తాననడం సిగ్గుచేటు. దాదాపు 12 సీబీఐ ఛార్జ్‌షీట్లలో నిందితుడిగా ఉండి, 2012 నుంచి నేటివరకు ఏదో ఒక సాకుతో, చిన్న చిన్న కారణాలు చూపుతూ కోర్టు విచారణలకు హాజరుకాకుండా వాయిదాల మీద వాయిదాలు వేయిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి బయట స్వేచ్ఛగా తిరుగుతూ రాజకీయం మాట్లాడటం చూస్తుంటే భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థలు ఎంత సరళంగా ఉన్నాయో అర్థమవుతోంది. దాదాపు 12 కేసుల్లో ఛార్జ్‌షీట్లు దాఖలై 12, 13 ఏళ్లు గడుస్తున్నా చిన్న చిన్న కారణాలతో కోర్టు విచారణలు ముందుకు సాగకుండా వాయిదాలు వేయిస్తున్నారు. సామాన్యుడి విషయంలోనూ చట్టం ఇలాగే ఉంటుందా లేక వీరికి మాత్రమే ప్రత్యేక మినహాయింపులా? న్యాయస్థానాలను విమర్శించడం నా ఉద్దేశం కాదు. కానీ, ఇంతకాలం విచారణ సాగకపోవడం వెనుక ఎవరి ఎత్తుగడలు ఉన్నాయో ప్రజలకు తెలియదా? లంచాలు లేని సమాజం, అవినీతి రహిత పాలన తెస్తానని, యువతను ముఖ్యమంత్రిని చేస్తానని విజయసాయి రెడ్డి మాట్లాడుతుంటే నవ్వాలో, ఏడ్వాలో అర్థం కావడం లేదు. దయ్యాలు వేదాలు వల్లించడమంటే సరిగ్గా ఇదే. రంగు రంగుల చొక్కాలు మార్చి, కొత్త జెండాలు పట్టుకుని కొత్త నాటకాలతో వస్తే నమ్మడానికి రాష్ట్ర ప్రజలు అమాయకులు కారని, అవినీతి పునాదులపై పుట్టిన వ్యక్తుల బండారాన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని వర్ల రామయ్య హెచ్చరించారు.

## నీతులు చెబితే ఎవరూ నమ్మరు

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన ఏ-2 విజయసాయి రెడ్డి ఈ రోజు మెరికల్లాంటి యువతను తెస్తాం, అవినీతి రహిత పాలన అందిస్తామంటూ కల్లబొల్లి మాటలు చెప్పడం సిగ్గుచేటని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అవినీతి రహిత యువతను తయారు చేస్తానంటున్న విజయసాయి రెడ్డికి అసలు ఆ అర్హత ఎక్కడిది? గతంలో జగన్మోహన్ రెడ్డి అనే వ్యక్తిని ఆయనే కదా తయారుచేశారు! జగన్ అవినీతికి తొలి అక్షరం 'ఓం' అని దిద్దింది, ఆ తర్వాత రాష్ట్రాన్ని దోచుకోవడంలో తోడుగా నిలిచింది ఆయనే కదా? చార్టర్డ్ అకౌంటెంట్‌గా ఉన్న నైపుణ్యాన్ని, తెలివితేటలన్నింటినీ రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే ఉపయోగించి జగన్‌ను ఒక పెద్ద "అవినీతి సామ్రాట్"గా తీర్చిదిద్దారు. జగన్ లాంటి అవినీతి పరుడిని తయారుచేసిన వ్యక్తి నుంచి వచ్చే యువత అదే విధంగా తయారవుతారు గానీ అవినీతి రహితంగా ఉంటారా అని వర్ల రామయ్య అన్నారు.

## ఎందుకీ సంస్కారహీన మాటలు?

తమ కొత్త పార్టీ అధికారంలోకి వస్తే రాయలసీమను 'రతనాల సీమ' చేస్తామని విజయసాయి రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారు. మరి ఐదేళ్లపాటు పూర్తి అధికారం మీ పార్టీ చేతుల్లోనే ఉంది కదా, మీ ప్రభుత్వం రాయలసీమకు ఏం చేసింది? మీరు చెప్పినట్లే జగన్మోహన్ రెడ్డి పరిపాలించారు. రాయలసీమ వెనుకబాటుతనానికి పాలకులే కారణమంటూ ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదం. మరి ఆ ఐదేళ్ల పాలకులు నువ్వు, నీ జగన్మోహన్ రెడ్డి కాదా? మీ అసమర్థత వల్లే సీమ ఎడారిగా మారిందనే నిజం ప్రజలకు తెలియదా? "రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడుతాం" అని విజయసాయి రెడ్డి మాట్లాడటం వెనుక ఆంతర్యమేంటి? కుల రాజకీయాలను సమాజంలోకి జొప్పించడమే కాకుండా, అసలు ఒరిజినల్ రెడ్లు, నకిలీ రెడ్లు అని ఉంటారా? అంటే నీ ఉద్దేశంలో గత ఐదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన జగన్మోహన్ రెడ్డి ఒరిజినల్ రెడ్డి కాదా? ఆయన దొంగ రెడ్డా లేక నకిలీ రెడ్డా? ఏం చెప్పాలని ఇలాంటి సంస్కారహీనమైన మాటలు మాట్లాడుతున్నారు? బాధ్యత గల స్థానాల్లో ఉన్నామని చెప్పుకునేవారు ఇంత దిగజారి మాట్లాడటం దారుణం. తోటి దొంగతో కలిసి రాష్ట్రాన్ని కొల్లగొట్టి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు 'మూడో ప్రత్యామ్నాయం' పేరుతో ప్రజల ముందుకు వస్తే రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానించడానికి ప్రజలు సిద్ధంగా లేరని, ఇలాంటి నాటకాలను ఎవరూ విశ్వసించబోరని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

## అప్రూవర్‌గా మారి జగన్‌కు శిక్ష పడేలా చేయాలి

ఈరోజు కొత్త ముసుగు వేసుకుని జగన్మోహన్ రెడ్డి అవినీతిని ఏ-2 విజయసాయి రెడ్డి పరోక్షంగా తప్పుబడుతున్నారు.. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సీబీఐ కేసుల్లో 'అప్రూవర్'గా మారాలని డిమాండ్ చేశారు. రూ.43 వేల కోట్ల ప్రజాధనం దోపిడీ కేసుల్లో నిందితుడిగా ఉంటూ, న్యాయస్థానాల్లో విచారణలు ఎదుర్కోకుండా తప్పించుకు తిరుగుతున్న ఏ-2 విజయసాయి రెడ్డికి మళ్లీ ప్రజల్లోకి వచ్చి నీతులు చెప్పే నైతిక హక్కు లేదని వర్ల రామయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆ రెండు కుటుంబాలే పరిపాలన చేస్తున్నాయి అంటూ విజయసాయి రెడ్డి మాట్లాడుతున్నారు. ప్రజలు మెచ్చినవారే ప్రజాస్వామ్యంలో అధికారంలోకి వస్తారు. గతంలో ఆయన చెప్పిన మాయమాటలు నమ్మి ఐదేళ్లు జగన్మోహన్ రెడ్డికి అధికారం ఇస్తే, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. అందుకే ప్రజలు విసిగిపోయి విజయసాయి రెడ్డిని, ఆయన బాస్ జగన్‌ని మెడపెట్టి గెంటేశారు. ప్రజలు తిరస్కరించిన తర్వాత ఇప్పుడు మళ్లీ ఏ ముసుగు వేసుకుని ప్రజల ముందుకు వస్తున్నారు? విజయసాయి రెడ్డి ప్రజల్లోకి రావడానికి మేమేమీ అడ్డు చెప్పడం లేదు. కానీ ఆయనకు చేతనైతే ముందుగా కోర్టుకు వెళ్లి... జగన్మోహన్ రెడ్డితో కలపకుండా ఆయన కేసులు విడిగా విచారణకు వచ్చేలా చేసుకోవాలి. రోజువారీ ప్రాతిపదికన (డే-టు-డే పాటర్న్) విచారణ జరిపి తీర్పు వెల్లడించాలని కోర్టును కోరాలి. కోర్టు నిర్దోషిగా ప్రకటిస్తే ప్రజల్లోకి రా.. అప్పుడు నిన్ను నమ్మే అవకాశముంటుందని వర్ల సూటి సవాల్ విసిరారు.

## చంద్రబాబుతో జగన్‌ను పోల్చడం సిగ్గుచేటు

నారా చంద్రబాబు నాయుడు స్థాయి, విలువ ఏ-2 విజయసాయి రెడ్డికి, ఆయన బాస్ జగన్మోహన్ రెడ్డికి ఏం తెలుసని వర్ల రామయ్య నిలదీశారు. చంద్రబాబు ఈ దేశంలో తెలుగు జాతి గర్వించదగ్గ మహా సంపద అని, అలాంటి నాయకుడిని అవినీతిపరులతో పోల్చే నైతిక హక్కు విజయసాయి రెడ్డికి లేదని మండిపడ్డారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు నవ్యాంధ్రను అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే, విజయసాయి రెడ్డి స్వయంగా జగన్మోహన్ రెడ్డి అనే ఒక పెద్ద అవినీతి డైనోసార్‌ను తయారుచేసి 'ఒక్క ఛాన్స్' పేరుతో ప్రజల మీదకు వదిలారు. 2019లో కూడా చంద్రబాబే సీఎంగా కొనసాగి ఉంటే ఈపాటికి ఆంధ్రప్రదేశ్ మరో గుజరాత్‌లా అభివృద్ధిలో దూసుకుపోయేది. కానీ విజయసాయి రెడ్డి నేతృత్వంలో ఆ అవినీతి సామ్రాట్ చేసిన విధ్వంసం వల్ల రాష్ట్రం ఏకంగా పదేళ్లు వెనక్కి వెళ్లిపోయింది. ఆ ఐదేళ్లు కూడా చంద్రబాబు ధికారంలో కొనసాగి ఉంటే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేది. రాజధాని అమరావతికి ఒక అద్భుతమైన రూపం వచ్చి గ్లోబల్ నగరంగా మారేది. ఐదేళ్లలోనే రాష్ట్రం పదేళ్ల అభివృద్ధిని సాధించేది. కానీ ఏ-1 జగన్మోహన్ రెడ్డి, ఏ-2 విజయసాయి రెడ్డి చేసిన దరిద్రపు పనుల వల్లే అమరావతి ఆగింది, పోలవరం పడకేసింది, రాష్ట్రం అధోగతి పాలైంది. అవినీతిలో పుట్టి, అవినీతిలో పెరిగిన జగన్మోహన్ రెడ్డి ఎక్కడ? రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలని అహర్నిశలు తపించే చంద్రబాబు నాయుడు ఎక్కడ? చంద్రబాబు బ్రాండ్, ఆయనకున్న విశ్వసనీయత చూసే నేడు రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. దమ్ముంటే అమరావతి వెళ్లి నిర్మాణ పనులు ఎలా పరుగులు పెడుతున్నాయో చూడాలని విజయసాయి రెడ్డికి సవాల్ విసిరారు. చంద్రబాబు నేతృత్వంలో సాగుతున్న ప్రజాహిత, ప్రజారంజక పరిపాలన పట్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. వరద నీటిలో కొట్టుకుపోయేవాడు బతకడానికి గడ్డిపరక దొరికినా పట్టుకోవాలని చూసినట్లే, ఉనికిని కాపాడుకోవడానికి ఈ రోజు విజయసాయి రెడ్డి "మూడో ప్రత్యామ్నాయం" అంటూ మాట్లాడుతున్నారు. అసలు టీడీపీ పాలనకు ప్రత్యామ్నాయం కావాలని నిన్ను ఎవరు అడిగారు? అడిగినా ఇంత నేర చరిత్ర ఉన్న నీలాంటి వ్యక్తిని అడుగుతారా? ఒక దొంగతో పాఠాలు చెప్పించుకోవడానికి ప్రజలేమీ అమాయకులు కారు. చంద్రబాబు పాలనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, మూడో ప్రత్యామ్నాయం అనేది ప్రజలను మోసం చేయడానికి విజయసాయి రెడ్డి అల్లుతున్న ఒక పచ్చి భ్రమ మాత్రమేనని వర్ల రామయ్య తేల్చిచెప్పారు.

## ప్రజలే తరిమి కొడతారు

ఘోరమైన నేర చరిత్రను వెనకేసుకుని, "అవినీతి రహిత పాలన అందిస్తాం" అంటే నమ్మడానికి ప్రజలు వెర్రివాళ్లేమీ కాదు. యువత అంతా నా వెంటే ఉంటారు" అని విజయసాయి రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదం. ఆయన వెంట నడవడానికి ఆయనేమైనా ఆదర్శ నాయకుడా, స్వాతంత్ర్య సమరయోధుడా? ముసుగులు వేసుకుని ప్రజలను మభ్యపెట్టే రోజులు పోయాయని, తక్షణమే కోర్టుల్లో కేసులు క్లియర్ చేసుకుని నిర్దోషిత్వంతోనే బయటకు రావాలని, లేకపోతే ప్రజలే తరిమికొడతారని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

చైతన్యరథం

# ప్రకృతి విపత్తులపైనా జగన్ నీచ రాజకీయం

- ఎల్‌నినోపై ముందుగానే సీఎం చంద్రబాబు అప్రమత్తం
- అధిగమించేందుకు పక్కా ప్రణాళికలు
- జల వనరుల సమర్థ నిర్వహణ, తొలుత తాగునీటికి ప్రాధాన్యం
- రైతులకు అన్ని విధాలా అండగా కూటమి ప్రభుత్వం
- ఐదేళ్ల పాలనలో అన్నదాతను ముంచేసి, నేడు జగన్ మొసలి కన్నీరు
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

అమరావతి (చైతన్యరథం): ఎల్ నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా 40 నుంచి 50 దేశాలు తీవ్ర నీటి ఎద్దడి, విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్లే రాష్ట్రంలో నీటి సమస్య తీవ్రం కాకుండా కాపాడుకోగలుగుతున్నామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలను గమనించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలల క్రితమే ప్రణాళికలు రచించి, పక్కాగా అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఆశించినంతగా వర్షాలు పడకపోయినా, కృష్ణా నదికి వచ్చిన కొద్దిపాటి వరదను కూడా ఒడిసిపట్టామన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా గండికోట సహా కడప జిల్లాలోని ప్రాజెక్టులను నింపాం. హంద్రీ-నీవా కాలువల ద్వారా అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు తాగు, సాగునీటి ఇబ్బందులు లేకుండా చేశాం. గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలు కాకుండా పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు తరలించాం. పోలవరం ఎడమ కాలువ, పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరిస్తున్నాం. ఎవరూ ఊహించని రీతిలో వెలుగొండ ప్రాజెక్టుకు సైతం కృష్ణా జలాలను తరలించిన ఘనత సీఎం చంద్రబాబుదని రాంగోపాల్ రెడ్డి అన్నారు.

### చంద్రబాబు దార్శనికతకు జాతీయ మీడియా ప్రశంసలు

పడుతున్న ప్రతి నీటిబొట్టును సమర్థవంతంగా సద్వినియోగం చేస్తున్న చంద్రబాబు నాయుడు దార్శనికతను ప్రముఖ ఆంగ్ల జాతీయ పత్రిక ఎకనమిక్ టైమ్స్ సైతం గుర్తించి, ఆయనను 'వాటర్‌మ్యాన్'గా కొనియాడింది. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఆయన మేనేజ్‌మెంట్‌కు ప్రశంసలు దక్కుతుంటే, ఓర్వలేక జగన్‌మోహన్‌రెడ్డి ఆయన అనుచరులు 'చంద్రబాబు, కరువు కవల పిల్లలు' అంటూ విషం కక్కుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో డ్యామ్‌లు నిండినా కాలువలను సరిగ్గా నిర్వహించలేక పంటలను ఎండబెట్టిన చరిత్ర జగన్‌ది. 2017-18లో కరవు తాండవిస్తున్నప్పుడు జగన్ ప్రాతినిధ్యం వహించే పులివెందుల నియోజకవర్గంలో చీనీ, అరటి తోటలు ఎండిపోకుండా కృష్ణా, తుంగభద్ర జలాలను తీసుకొచ్చి కాపాడింది చంద్రబాబే. గత ప్రభుత్వంలో డ్రిప్ ఇరిగేషన్ నిధులను సైతం దారిమళ్లించి మైక్రో ఇరిగేషన్‌ను నాశనం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే మైక్రో ఇరిగేషన్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఐదు ఎకరాల లోపు రైతులకు 100 శాతం, ఐదు ఎకరాల పైబడిన రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్పులు, స్ప్రింక్లర్లు అందించి రైతాంగాన్ని ఆదుకుంటున్నాం. వాస్తవాలను పక్కనపెట్టి ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలను ప్రజలు నమ్మరని, రాష్ట్ర రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాంగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

### జగన్ హయాంలో వ్యవసాయం అధోగతి

వైఎస్సార్సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా సర్వనాశనం చేశారని రాంగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంటల బీమా నుంచి ప్రాజెక్టుల పునరుద్ధరణ వరకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటోందని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం పంటల బీమా విధానంలో సమూల సంస్కరణలు తెచ్చింది. రైతులు ఇబ్బంది పడకూడదని ప్రీమియం చెల్లింపు గడువును దాదాపు 21 రోజుల నుంచి నెలకు పైగా పొడిగించి రైతులందరికీ బీమా రక్షణ కల్పించాం. గత పాలకులు 'వైఎస్సార్ పంటల బీమా' పేరుతో వ్యవస్థను గందరగోళానికి గురిచేసి, రెండేళ్లపాటు కంపెనీలకు ప్రీమియం చెల్లించకుండా రైతులను దగా చేశారు. నాడు అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు భీష్మించి నిలదీస్తేనే రాత్రికి రాత్రే దాదాపు రూ.550 కోట్ల జీవో విడుదలై రైతుల ఖాతాల్లోకి నిధులు వచ్చాయి. సరైన నిర్వహణ లేక, కనీసం కాపలాదారులను కూడా పెట్టకపోవడం వల్లే అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు కొట్టుకుపోయి ప్రజల ప్రాణాలు పోయాయి. పులిచింతల, గోరకల్లు, అవుకు వంటి కీలక జలాశయాల గేట్లు, మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా సాగు, తాగునీటి వ్యవస్థలను నాశనం చేశారని రాంగోపాల్ రెడ్డి దుయ్యబట్టారు.



### వెలుగొండ 30 ఏళ్ల కల సాకారం

దశాబ్దాలుగా కరువుతో అల్లాడిన ప్రాంతాలకు జలకళ తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగానికి జరిగిన తీవ్ర నష్టాన్ని పూడుస్తూ, సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రాజెక్టులను గాడిన పెడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. దాదాపు 30 ఏళ్లకు పైగా ఎదురుచూస్తున్న మార్కాపురం, ప్రకాశం ప్రాంత ప్రజల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసింది. గుక్కెడు తాగునీటికి అలమటించి, బీటలు వారిన నేలల్లోకి నేడు కృష్ణా జలాలు చేరడంతో ప్రజలు జాతరలా సంబరాలు చేసుకుంటున్నారు. అంతా తామే చేశామని చెప్పుకుంటున్న జగన్, అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులోకి ఎందుకు నీళ్లు తీసుకురాలేకపోయారు? ముంపు నిర్వాసితులకు పరిహారం ఎందుకు చెల్లించలేదు? చిత్తశుద్ధి లోపించడం వల్లే గతంలో పనులు ఆగిపోయాయని రాంగోపాల్ రెడ్డి విమర్శించారు.

### ప్రకృతి విపత్తులపై రాజకీయం తగదు

రాయలసీమతో పాటు సొంత నియోజకవర్గం పులివెందులలో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పుడు ఏనాడూ పట్టించుకోని వైఎస్సార్సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, నేడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రకృతి విపత్తులను రాజకీయం చేయడం మాని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని హితవు పలికారు. 2014-19 మధ్య ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పులివెందుల, కడప జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటి, చీనీ, అరటి తోటలు నిట్టనిలువునా ఎండిపోతున్నా జగన్ కనీసం పట్టించుకోలేదు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు అరటి గిట్టుబాటు ధర పతనమై టన్ను రూ.1,000 నుంచి రూ.2,000 పడిపోయి రైతులు తోటలను ఉచితంగా వదిలేసుకునే దుస్థితి వచ్చినా ఏనాడూ ఆదుకోలేదు. పైగా "ధరలు నిర్ణయించేది నేను కాదు, కొనేవాళ్లు చూసుకుంటారు, ప్రభుత్వాల చేతుల్లో ఏముంది" అంటూ మాట్లాడిన చరిత్ర ఆయనది. నేడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాయలసీమ, పులివెందుల ప్రాంత ఉద్యాన రైతులకు అండగా నిలుస్తోంది. బాంబే, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, నాగపూర్ వంటి ప్రధాన దేశీయ మార్కెట్లతో పాటు గల్ఫ్ దేశాల్లోని ధరలు, అక్కడి పరిస్థితులు, యుద్ధ వాతావరణాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. తగిన హెచ్చరికలు, సరైన మార్కెటింగ్ సూచనలు చేస్తూ అన్నదాతలకు మెరుగైన ధర దక్కేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. తుపాన్లు, కరువు, సునామీ, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు ముందస్తుగా చెప్పి రావు. కరోనా తర్వాత ప్రపంచాన్ని వణికిస్తున్న అతిపెద్ద సంక్షోభం ఎల్ నినో. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఈ తీవ్ర దుర్భిక్షాన్ని కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటోంది. ప్రకృతి విపత్తులను ఎవరూ రాజకీయ కోణంలో చూడకూడదు. రోజూ పనిగట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లడం మానుకోవాలి. ఎల్ నినోను ఎలా అధిగమించాలి, సాగునీటి నిర్వహణను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, రైతులకు ఏ విధంగా మేలు చేకూర్చవచ్చనే అంశాలపై జగన్ మోహన్‌రెడ్డి సుహృద్భావ వాతావరణంలో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నాం. రైతుల కష్టాలను పట్టించుకోకుండా గతంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన వైకాపా నేతలు, ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

### రైతు క్షేమమే ధ్యేయం

రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన పంటల కోసం ఏకంగా రూ.1 లక్ష కోట్లతో బృహత్తర ప్రణాళికలు రచిస్తున్నాం. గతంలో జగన్ ప్రభుత్వం కుప్పానికి ట్యాంకర్లతో నీళ్లు పోసి 'కృష్ణా జలాలు తెచ్చాం' అని చవకబారు ప్రచారం చేసుకుంది. కానీ చంద్రబాబు రాగానే రూ.3,500 కోట్లతో హంద్రీ-నీవా కాలువలను ఆధునికీకరించి, వెడల్పు చేసి, లైనింగ్ పనులు పూర్తి చేసి కృష్ణా నది నుంచి చిట్టచివరి కుప్పం వరకు నీటిని పారిస్తున్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు కనీసం ఒక్క ఎకరానికైనా అదనంగా సాగునీరు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గం పులివెందులలోని ఎత్తిపోతల పథకాలకు కనీసం మోటార్లు బిగించలేక, మరమ్మతులు చేయించలేక పంటలను ఎండగట్టిన చేతకాని చరిత్ర జగన్‌ది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లోనూ పోతిరెడ్డిపాడు ద్వారా గండికోట ప్రాజెక్టుకు రోజూ 11,500 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నాం. కడప, అనంతపురం జిల్లాల్లో ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా అధికార యంత్రాంగం రైతులకు అవగాహన కల్పిస్తూ పొదుపుగా నీటిని వినియోగిస్తోంది. రాబోయే రబీ సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ ప్రణాళికను ఇప్పటికే ప్రకటించాం. వర్షాలు పడితే స్వల్పకాలిక పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహిస్తూ, సబ్సిడీ ధరలపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సమకూరుస్తున్నాం. వ్యవసాయాన్ని, ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిన గత పాలకులకు ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

### తాగునీటికి ప్రాధాన్యత

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పోలవరం నిర్మాణ సంస్థను బెదిరించి పంపించేసి, కీలకమైన డయాఫ్రమ్ వాల్‌ను దెబ్బతీశారు. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలో అధికార, సాంకేతిక యంత్రాంగం నిరంతరం శ్రమిస్తూ పనులను గాడిన పెట్టింది. అకుంఠిత దీక్షతో 2027 ఆఖరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతాం. గత పాలనలో తుంగభద్ర నుంచి రావాల్సిన 35 శాతం కోటాను సైతం సాధించలేకపోయారు. కానీ నేడు డ్యామ్‌లో సరైన ప్రవాహం లేకున్నా, తుంగభద్ర బోర్డుతో, కర్ణాటక ప్రభుత్వంతో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రులు, అధికారులు నిరంతరం సంప్రదింపులు జరిపి మన న్యాయమైన వాటాను రాబట్టారు. ఆ నీటితో అనంతపురం జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశయాలను నింపి సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా కరువు లేదా ఎల్ నినో పరిస్థితులు వచ్చినప్పుడు ఏ మాన్యువల్ అయినా ముందుగా తాగునీటి నిల్వలకు ప్రాధాన్యమివ్వాలని చెబుతుంది. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు తుపాన్లు, వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ, భవిష్యత్తును ముందుగానే అంచనా వేసి ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా జలాశయాల్లో నిల్వలు పెంచుతున్నాం. తాగునీటి అవసరాలు తీరిన వెంటనే వ్యవసాయానికి పక్కా ప్రణాళికతో నీరందిస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, కృత్రిమ సమస్యలను సృష్టించి గందరగోళం చేయాలని వైఎస్సార్సీపీ నేతలు చూస్తున్నారు. ఏ గ్రామానికి, ఏ వార్డుకు తాగునీటి ఇబ్బంది రాకుండా ప్రభుత్వం రక్షణ కవచంలా పనిచేస్తోంది. సంక్షోభాలను ఎలా పరిష్కరించాలో, ప్రజలను ఎలా ఆదుకోవాలో తెలిసిన సమర్థ నాయకుడు చంద్రబాబు. ఆయనకు పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేకే వైకాపా నేతలు కడుపుమంటతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. రాష్ట్రంలోని రైతాంగాన్ని, ప్రజలను అన్నివిధాలా కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందని, వైసీపీ అసత్య ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మవద్దని రాంగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# గ్రూప్-1 స్కామ్‌లో అడ్డంగా దొరికిన దొంగ జగన్

- సిట్ విచారణలో బట్టబయలైన భారీ కుంభకోణం
- నాటి అక్రమాలపై జగన్ నోరు విప్పాలి
- పారదర్శక డీఎస్సీపై గొడ్డలిపార్టీ నిరాధార ఆరోపణలు
- బహిరంగ చర్చకు మంత్రి లోకేష్ సవాల్ చేసినా ముందుకురాని జగన్
- ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్

అమరావతి (చైతన్యరథం): గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రజలు పడ్డకష్టాలు,ఆ పార్టీ నాయకులు సాగించిన అరాచకాలను రాష్ట్ర ప్రజలెవరూ మర్చిపోలేదని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండీ రాకేష్ మండిపడ్డారు. అధికారంలోకి రాక ముందు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు యువనేత నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ఆ యాత్రలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రజల కష్టాలను స్వయంగా చూసేందుకు యువనేత లోకేష్ పాదయాత్ర చేస్తుంటే.. ఆనాటి పాలకులు అడ్డుకోవాలని, అవహేళన చేయాలని చూశారు. కానీ, ప్రజలు స్వచ్ఛందంగా కదిలి లోకేష్‌కి అండగా నిలిచి అడుగులో అడుగు వేశారు. ఆంధ్రప్రదేశ్ జీడీపీ పెరగాలన్నా, ప్రతి ఇంటి ఆదాయం రెట్టింపు కావాలన్నా ప్రైవేట్ ఉద్యోగాల కల్పన, ఐటీ, మ్యానుఫ్యాక్చరింగ్, ఎగుమతులు-దిగుమతులు పెరగాలని లోకేష్ మొదటినుంచీ బలంగా నమ్మారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో చర్చించి, రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చే దిశగా పక్కా ప్రణాళికతో నేడు మంత్రి లోకేష్ పనిచేస్తున్నారు.

### జగన్‌కు కడుపుమంట

జగన్మోహన్ రెడ్డిలా ఎన్నికల ముందు మోసపూరిత మాటలు చెప్పే అలవాటు లోకేష్‌కి లేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి, అధికారంలోకి రాగానే కేబినెట్‌లో చర్చించి పూర్తి పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహణకు చర్యలు చేపట్టారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తుంటే జగన్ తట్టుకోలేకపోతున్నారు.



మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి కోర్టుల చుట్టూ తిరిగింది జగన్ అండ్ కో కాదా? న్యాయస్థానాలు చివాట్లు పెట్టి మొట్టికాయలు వేసినా ఇంకా బుద్ధి రాలేదు. అవినీతి, అక్రమాల్లో నిండా కూరుకుపోయిన జగన్ రెడ్డి..ఆ బురదలను అందరికీ అంటించాలనే పైశాచిక ఆనందంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు కష్టం, లోకేష్ విజన్ చూసి కడుపుమంటతో మాట్లాడుతున్నారు. డీఎస్సీ అంశంపై బహిరంగ చర్చకు రావాలని ఇప్పటికే ఎన్నోసార్లు సవాల్ విసిరాం. లోకేష్ ఇప్పటికే ప్రజల ముందు అన్ని వివరాలు ఉంచారు. దమ్ముంటే జగన్ నేరుగా చర్చకు రావాలి, సమాధానాలు తెలుసుకోవాలి. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుంటే, జగన్ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మే పరిస్థితిలో లేరని దూండీ రాకేష్ పేర్కొన్నారు.

### గ్రూప్ 1 అక్రమాలకు జగన్ సమాధానం చెప్పగలరా?

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించి, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన జగన్మోహన్ రెడ్డికి నేడు డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదని దూండీ రాకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాడు జరిగిన ఘోరాలపై ఇప్పటివరకు నోరు మెదపని జగన్, నేడు మెగా డీఎస్సీ ద్వారా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నిండుతుంటే ఓర్వలేక బురదజల్లుతున్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహణను అడ్డగోలుగా మార్చేశారు. ప్రైవేట్ రిసార్ట్ అయిన హాయ్‌లాండ్‌లో అనధికారికంగా పరీక్ష పత్రాలు పెట్టి క్లర్కులు, డ్రైవర్లు, వాచ్‌మెన్లు, వాలంటీర్లతో సమాధాన పత్రాలు దిద్దించింది వాస్తవం కాదా? వేరువేరు కలాలతో ఇష్టం వచ్చినట్లు దిద్ది మార్కులు మార్చేసిన దారుణానికి జగన్ ఏం సమాధానం చెబుతారు? ఈ కుంభకోణంపై హైకోర్టు ఆదేశాల మేరకు సిట్ విచారణ జరిపితే విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మొత్తం 736 మంది అభ్యర్థుల్లో ఏకంగా 718 మంది ఓఎంఆర్ షీట్లలో మార్పులు, చేర్పులు జరిగిన విషయం బయటపడింది. 197 మందికి అడ్డగోలుగా మార్కులు పెంచారు. అర్హులైన 22 మందికి మార్కులు తగ్గించారు. ఈ అక్రమాలను న్యాయస్థానం కూడా నిర్ధారించిన మాట నిజం కాదా? జగన్ హయాంలో ఏపీపీఎస్సీ ఉద్యోగాలను బహిరంగంగా వేలం వేశారు. డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.5 కోట్ల నుంచి రూ.5 కోట్లకు, ఆర్డీవో పోస్టును రూ. కోటికి, డీఎస్పీ పోస్టును రూ.50లక్షలకు అమ్ముకున్నారు. ఈ విధంగా దాదాపు రూ.150కోట్ల రూపాయల నిరుద్యోగుల రక్తాన్ని, భవిష్యత్తును జగన్ అండ్ కో దోచుకుంది వాస్తవం కాదా? దీనిపై ఎక్కడైనా, ఎప్పుడైనా సమాధానం చెప్పే దమ్ము జగన్‌కు ఉందా? కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి వేలాది మంది నిరుద్యోగులకు కొలువులు ఇస్తే.. వారి పాపాలను కప్పిపుచ్చుకోవడానికి వైసీపీ నేత నిత్యం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజం అయిపోదు. డిబేట్లలో, మీడియా సమావేశాల్లో అధికారులు, మంత్రి లోకేష్ లెక్కలతో సహా అన్నీ స్పష్టంగా వివరించారు. జగన్ ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకోకుండా నిరుద్యోగులను తప్పుదోవ పట్టించేలా అసత్యాలు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. ముందు ఏపీపీఎస్సీ కుంభకోణంపై సమాధానం చెప్పి ఆ తర్వాతే మాట్లాడాలని దూండీ రాకేష్ డిమాండ్ చేశారు.

### జగన్ మౌనం నేరాంగీకారమే..

గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలు, పోస్టుల అమ్మకాలపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి గానీ, ఆయన పార్టీ నాయకులు గానీ ఎందుకు నోరు మెదపడం లేదని దూండీ రాకేష్ నిలదీశారు. తప్పు చేశారు కాబట్టే నేడు సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారని, ఏపీపీఎస్సీ పాపాలపై మౌనంగా ఉండటం ముమ్మాటికీ నేరాన్ని ఒప్పుకోవడమేనని ఆయన మండిపడ్డారు. నాడు నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటూ మార్కులు మార్చింది నిజం కాదా? అర్హులకు అన్యాయం చేసి కోట్లకు పడగలెత్తిన వారికి పోస్టులు అమ్ముకున్నది నిజం కాదా? న్యాయస్థానం మొట్టికాయలు వేసి అధికారులపై చర్యలు తీసుకున్న మాట వాస్తవం కాదా? వీటన్నింటిపై జగన్ గానీ, ఆయన పార్టీ నేతలు గానీ, వారి పేటీఎం సోషల్ మీడియా బ్యాచ్ గానీ ఎందుకు సమాధానం చెప్పడం లేదు? తప్పు చేయాల్సిన అవసరం కూటమి ప్రభుత్వానికి లేదు. మంత్రి లోకేష్ పారదర్శక పాలనకు కట్టుబడి ఉన్నారు. డీఎస్సీ నిర్వహణపై జగన్ సంధించే ప్రతి నిరాధార ఆరోపణకు తగిన రీతిలో జవాబు ఇవ్వడానికి తామంతా ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముందు ఏపీపీఎస్సీ కుంభకోణంపై జగన్ బహిరంగ విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉండటం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చి కుటుంబాలు నిలదొక్కుకోవడం జగన్‌కు ఏమాత్రం ఇష్టం లేదని ఆరోపించారు. వర్గాల మధ్య తగాదాలు పెట్టి, విద్వేషాలు రెచ్చగొట్టి చలికాచుకోవాలని చూస్తే ఇక్కడ చూస్తూ ఊరుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని హెచ్చరించారు. ఇక్కడ నడుస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై పోరాడింది మేమే.. నేడు అధికారంలో ఉంటూ ప్రజా సంక్షేమం, నిరుద్యోగుల ఉపాధి కోసం ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల పక్షాన నిలబడేది కూడా తామేనని దూండీ రాకేష్ తేల్చిచెప్పారు.

# కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ

- ఐదేళ్ల జగన్ పాలనలో నరక కూపంలా రోడ్లు
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో జోరుగా రహదారుల పనులు
- టీడీపీ రాష్ట్ర నాయకుడు వేమూరి ఆనంద్ సూర్య

అమరావతి (చైతన్యరథం): వైసీపీ ఐదేళ్ల పాలనలో నరకకూపంగా మారిన రహదారులకు నేడు చంద్రబాబు హయాంలో మహర్దశ వచ్చిందని టీడీపీ రాష్ట్ర నాయకుడు వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో రోడ్లు అతలాకుతలమై, ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. 45,378 కి.మీ. ఆర్ అండ్ బి రహదారుల్లో సుమారు 23,000 కి.మీ. దెబ్బతిన్నాయి. 2014-19లో టీడీపీ ప్రభుత్వం రూ.12,000 కోట్లు ఖర్చు చేసి 25,000 కి.మీ. రోడ్లు నిర్మించింది. 2019-24లో వైసీపీ రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేవలం 0.41% మాత్రమే రోడ్లకు కేటాయించి, ఐదేళ్లలో 2,500 కి.మీ. కూడా పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టర్ల బకాయిలు రూ.2,300 కోట్లలో రూ.922 కోట్లు 100 రోజుల్లో చెల్లించింది. రెండేళ్లలోనే రూ.5,400 కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించింది. మరో రూ.8,230 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు.

### జోరుగా రహదారుల పనులు

2024న నవంబర్ 1న ప్రారంభించిన గుంతల రహిత రహదారుల కార్యక్రమం ఇప్పటికి 99% పూర్తయింది. దాదాపు 20 వేల కి.మీ. రహదారుల మరమ్మతులు 171 నియోజకవర్గాల్లో 100% పూర్తయ్యాయి. డానిష్ ఫైబర్ టెక్నాలజీ, ఏఐ, డ్యాష్‌క్యామ్ సర్వే, రోడ్ డాక్టర్ వాహనాలు ప్రవేశపెట్టి 8,457 గుంతలు పూడ్చారు. శ్రీ



సత్యసాయి జిల్లాలో 24 గంటల్లో 28.95 కి.మీ. బీటీ రోడ్ వేసి గిన్నిస్ రికార్డులు సాధించారు. కేంద్రం నుంచి రూ.2,558 కోట్లు సాధించారు. భారతమాల కింద ఏడు ప్రాజెక్టులు, నాలుగు గ్రీన్‌ఫీల్డ్ హైవేలు ప్రారంభించారు. 2024-26లో సీసీ రోడ్లు 9,600 కి.మీ., బీటీ 10,000 కి.మీ., రాష్ట్ర రహదారులు 2,700 కి.మీ., జాతీయ రహదారులు 2,594 కి.మీ. మేర అభివృద్ధి చేస్తున్నామని ఆనంద్ సూర్య చెప్పారు.

### రహదారి భద్రత పట్టని జగన్

గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో రహదారి భద్రతను గాలికొదిలేశారు. జగన్ పాలన ఐదేళ్లలో 15,000 రోడ్డు ప్రమాదాలు జరిగితే 43,000 మరణాలు సంభవించాయి. రహదారి భద్రతకు జగన్ రెడ్డి ప్రభుత్వం కేవలం రూ.10 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఏఐబీతో ఒప్పందం చేసుకున్న రహదారుల నిర్మాణ పనులు, అనంతపురం ఎక్స్‌ప్రెస్‌వే, అమరావతి రింగ్ రోడ్ వంటివి జగన్ రెడ్డి రద్దు చేశాడు.

నేడు ఉత్తరాంధ్ర-భోగాపురం, కడప-పులివెందుల, హైదరాబాద్-విజయవాడ, అమరావతి ఓఆర్ఆర్, విశాఖ పోర్ట్ కనెక్టివిటీ, బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే వంటి పెద్ద ప్రాజెక్టులు జరుగుతున్నాయి. రూ.81,875 కోట్లతో 1,749 కి.మీ. 8 జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం అంగీకారం తెలిపింది. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ఆధునిక రవాణా వ్యవస్థను నిర్మిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు కొత్త దిశ నిర్దేశిస్తున్నారని ఆనంద్ సూర్య అన్నారు.

# తిరుమల క్షేత్రంలో..
# పవిత్రతకు ప్రాధాన్యం, పచ్చదనానికి ప్రోత్సాహం

- పర్యావరణ హిత సప్తగిరులకు సీఎం చంద్రబాబు కార్యాచరణ
- ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంగా అభివృద్ధి
- 100 శాతం నెట్-జీరో ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్పు
- భక్తుల భాగస్వామ్యంతోనే ఈ యజ్ఞం విజయవంతం
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్

అమరావతి (చైతన్యరథం): రాజకీయాలు, మార్కెట్లు, టార్గెట్లు నిత్యం ఉండేవే అయినా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది శ్రీవారి భక్తులు గర్వపడేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటనలో ప్రకటించిన కార్యాచరణ ఎంతో ప్రత్యేకమైనదని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ అన్నారు. తిరుపతి గడ్డపై పుట్టి పెరిగిన ఒక సామాన్య శ్రీవారి భక్తుడిగా, అదే సమయంలో జీవవైవిధ్య బోర్డు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల అంటే కేవలం ఒక కొండ కాదు, కోట్ల మంది గుండె చప్పుడు.. తిరుమల కేవలం ఒక ఆధ్యాత్మిక క్షేత్రం మాత్రమే కాదని.. అరుదైన వృక్ష, జంతు, పక్షి జాతులకు నిలయంగా ఉన్న అపూర్వమైన జీవవైవిధ్య ప్రాంతమని పేర్కొన్నారు. అలాంటి పవిత్ర పర్యావరణాన్ని భవిష్యత్ తరాలకు మరింత సురక్షితంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించిన కార్యాచరణ తిరుమల తిరుపతిని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగని పేర్కొన్నారు. తిరుమలను ఎటువంటి హానికర ఉద్గారాలు, వ్యర్థాలు లేని ప్రపంచంలోనే మొట్టమొదటి 100 శాతం నెట్-జీరో ఆధ్యాత్మిక నగరంగా మార్చడం. అరుదైన వృక్ష, జంతు సంపదకు నెలవైన శేషాచల అడవులను కాపాడుతూ, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయడం. రోజుకు లక్ష నుంచి లక్షా పాతిక వేల మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో, వచ్చే వంద-రెండు వందల ఏళ్ల వరకు తిరుమల సహజసిద్ధ పవిత్రతను కాపాడేందుకు అవసరమైన శాస్త్రీయ, భవిష్యత్ కార్యాచరణ అమలు చేయడం. ఇది కేవలం ఒక డిపార్ట్‌మెంట్‌తో సాధ్యం కాదు. టీటీడీ, అటవీ శాఖ, జీవవైవిధ్య బోర్డుతో పాటు ప్రతిరోజూ శ్రీవారిని దర్శించుకునే లక్షలాది మంది భక్తుల భాగస్వామ్యంతోనే ఈ మహత్తర యజ్ఞం విజయవంతమవుతుంది. పవిత్రత, పర్యావరణం రెండూ సమపాళ్లలో సాగేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. తిరుమల దివ్య క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి హరిత ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిపేందుకు భక్తులందరూ సంపూర్ణ సహకారం అందించాలని విజయ్ కుమార్ కోరారు.

### తిరుమల పవిత్రత, పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

తిరుమల కొండల సహజసిద్ధ పవిత్రతను, పర్యావరణాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దాదాపు రెండున్నర గంటలపాటు సమగ్ర సమీక్ష నిర్వహించి చారిత్రక మార్గదర్శకాలను అందించారు. తిరుమల కాంక్రీట్ అడవిలా మారిపోకుండా, భావితరాలకు స్వచ్ఛమైన సప్తగిరులను అందించడమే మా కూటమి ప్రభుత్వ ప్రక్షాళన లక్ష్యం. తిరుమల చుట్టూ 10-12 కిలోమీటర్ల పరిధిలోని మొత్తం వ్యవస్థను సంప్రదాయ బొగ్గు, జల విద్యుత్ నుంచి పూర్తిగా తప్పించి, 100% పవన, సౌర ఇంధనంతోనే నడపాలని నిర్ణయించాం. ప్రస్తుతం టీటీడీ మొత్తం వినియోగంలో ఉన్న విద్యుత్ దాదాపు 10 కోట్ల యూనిట్లు కాగా, అందులో కేవలం 10 శాతం మాత్రమే పునరుత్పాదక ఇంధనం అందుతోంది. దీన్ని త్వరలోనే పూర్తిస్థాయి 10 కోట్ల యూనిట్లకు పెంచి జీరో ఎమిషన్ క్షేత్రంగా మారుస్తాం. రాత్రివేళ విద్యుత్ అవసరాల కోసం పగలు ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను నిల్వ చేసేందుకు అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్లాంట్లను బ్యాకప్‌గా ఏర్పాటు చేస్తున్నాం.



కాలుష్య నివారణ కోసం ఇప్పటికే భారత్ బయోటెక్, టీసీఎస్ వంటి సంస్థల సహకారంతో నడుస్తున్న ఈ-బస్సులకు తోడుగా, మరో 32 బస్సులను ముఖ్యమంత్రి ప్రారంభించడంతో ప్రస్తుతం 44 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. రాబోయే ఒకటి రెండేళ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా తిరుపతి-తిరుమల ఘాట్ రోడ్లలో రోజూ తిరిగే 300 నుంచి 700 ట్రిప్పుల ఆర్టీసీ బస్సులన్నింటినీ 100% ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తాం. శేషాచలం బయోస్పియర్ రిజర్వ్‌లోని వేల ఏళ్ల నాటి సహజ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఎర్రచందనంతో పాటు అంతరించిపోతున్న స్థానిక వృక్షజాతుల పెంపకానికి పెద్దపీట వేస్తాం. పచ్చదనాన్ని విస్తరించడం ద్వారా కొండలపై ఉష్ణోగ్రతలను తగ్గించి, సహజసిద్ధమైన చల్లదనం, తేమతో కూడిన మృదువైన గాలుల వాతావరణాన్ని పరిరక్షిస్తాం. అంతరించిపోతున్న చిరుతలు, అరుదైన పక్షుల ఆవాసాలను, వాటి సహజ కారిడార్లను పటిష్టం చేసి వన్యప్రాణులు యాత్రికుల బాట పట్టకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపడతాం. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యావరణాన్ని పూర్తిగా గాలికొదిలేయడం వల్ల కొండపై ఏకంగా 80,000 టన్నుల లెగసీ వేస్ట్ పేరుకుపోయింది. ఆ దుస్థితి నుంచి తిరుమలను గట్టెక్కించేందుకే ఈ ప్రక్షాళన. తడి, పొడి చెత్తను మూలాల్లోనే కచ్చితంగా వేరు చేయాలి. నిబంధనలు పాటించని వారిని ఉపేక్షించేది లేదు. భారీ జరిమానాలు విధిస్తాం. అన్నదానం, యాత్రికుల ఆహార వ్యర్థాలు, ఆర్గానిక్ వేస్ట్‌ను డంపింగ్ చేయకుండా అత్యాధునిక బయో-రిసోర్స్ కన్వర్షన్ ద్వారా బయోగ్యాస్‌గా మారుస్తాం. శేషాచల కొండల్లో కురిసే వర్షపు నీటిని ఒడిసిపట్టే సమగ్ర కార్యాచరణ అమలు చేస్తాం. ఒక్క నీటి చుక్క కూడా వృథా కాకుండా అత్యాధునిక మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా రీసైకిల్ చేసి, ఆ నీటిని పూర్తిగా తోటల పెంపకానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తాం. తిరుమల పవిత్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకునే ఈ కఠిన, సాహసోపేత నిర్ణయాలకు శ్రీవారి భక్తులందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

### అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి

తిరుమల కొండలను కేవలం పర్యావరణపరంగానే కాకుండా, ఆధ్యాత్మికంగా, మౌలిక వసతుల పరంగా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చారిత్రక కార్యాచరణను ప్రకటించారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ట్రస్ట్ నిధులు రూ.104 కోట్ల భారీ వ్యయంతో శ్రీ వేంకటేశ్వర మ్యూజియాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దాం. 14 ప్రత్యేక గ్యాలరీల్లో 8,000లకు పైగా అరుదైన పురాతన కళాఖండాలు, శ్రీవారి చరిత్ర వైభవం, చారిత్రక రాజవంశాల విశేషాలను ప్రదర్శిస్తున్నాం. రాబోయే ఐదేళ్లపాటు ఈ మ్యూజియం నిర్వహణ బాధ్యతలను టీసీఎస్ సంస్థే చూసుకుంటుంది. 2001-02 కరువు సమయంలో తిరుమలలో నీరులేక గుడి మూసివేసే పరిస్థితి వస్తే, అప్పట్లో చంద్రబాబు కేవలం 100 రోజుల్లో కల్యాణి డ్యామ్ నుంచి పైప్‌లైన్ వేసి సంక్షోభాన్ని పరిష్కరించారు. రాబోయే తరాలకు శాశ్వతంగా నీటి ఎద్దడి రాకుండా సోమశిల పైప్‌లైన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సోమశిల జలాలను కండలేరు మీదుగా బాలాజీ సాగర్‌కు అనుసంధానించి, అక్కడి నుంచి వాటర్ గ్రిడ్ ద్వారా కల్యాణి డ్యామ్‌కు తరలించి తిరుమలకు నిరంతరాయంగా తాగునీరు అందిస్తాం. శ్రీవారి ఆస్తులు ప్రజల సొత్తు. స్వామివారి ఆభరణాలు మాత్రమే కాకుండా తిరుపతి, చెన్నై, మైసూర్, రిషికేష్ సహా దేశవ్యాప్తంగా టీటీడీకి ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలన్నింటినీ పారదర్శకంగా మ్యూజియంలో, బహిరంగ వేదికల్లో ప్రజల ముందు ఉంచుతాం. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే తక్షణమే రూ.2 లక్షల పరిహారం అందేలా ఎల్ఐసీ గ్రూప్ ఇన్సూరెన్స్ వర్తింపజేస్తున్నాం. తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి సెంట్రల్ బస్ స్టేషన్‌ను కలుపుతూ కిలోమీటరు మేర స్కైవాక్ నిర్మాణం చేపడతాం. నగరంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు చెక్ పెడుతూ 50 ఎకరాల్లో భారీ మల్టీ-లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేస్తాం. స్విమ్స్, బర్డ్, రుయా, పద్మావతి చిల్డ్రన్స్ హాస్పిటల్, కంచి మఠం క్యాన్సర్ ఆసుపత్రులను సమన్వయం చేస్తూ అంతర్జాతీయ స్థాయి హెల్త్ నెట్‌వర్క్‌గా తిరుపతిని మారుస్తాం. ఆధ్యాత్మిక వాతావరణంలో వివాహాలు జరుపుకునేందుకు అనువుగా తిరుపతిని ప్రముఖ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా తీర్చిదిద్ది స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాం. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో 5,000 కొత్త ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ చేపడతాం. దేశంలోనే కాకుండా మారిషస్, న్యూజిలాండ్ వంటి విదేశాల్లోనూ శ్రీవారి ఆలయాలను నిర్మించి జగన్నాథుడి వైభవాన్ని ప్రపంచమంతటా విస్తరిస్తాం. భక్తుల రద్దీ పెరుగుతున్న వేళ, తిరుమల మరో కాంక్రీట్ అడవిగా మారకుండా హరిత మౌలిక వసతులు కల్పించడమే నిజమైన ప్రక్షాళన. సప్తగిరుల ఆధ్యాత్మిక వైభవం, పర్యావరణ పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఈ బృహత్తర సంకల్పానికి భక్తులందరూ భాగస్వాములు కావాలని విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

### గత పాలకుల పాపాలను ప్రక్షాళన చేస్తున్నాం

2019-2024 మధ్య గత వైకాపా ప్రభుత్వం తిరుమల పవిత్రతను, బ్రాండ్ ఇమేజ్‌ను సర్వనాశనం చేసింది. కోట్ల మంది హిందువుల సనాతన ధార్మిక భావనలను ఘోరంగా అవమానించి, తిరుమలను ఒక రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చింది. ఆ ఐదేళ్ల లెగసీ పాపాలను కడిగేసి, సమగ్ర ప్రక్షాళన చేయడానికే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని విజయ్ కుమార్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో స్వామివారి లడ్డూ ప్రసాదంలో అత్యంత నాసిరకమైన నెయ్యిని వాడి తీవ్ర అపచారానికి ఒడిగట్టారు. రెండు మూడు రోజుల్లోనే లడ్డూ పాడైపోయి వాసన వచ్చే దారుణ పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం రాగానే స్వచ్ఛమైన ఆవు నెయ్యి సేకరణకు పక్కా నిబంధనలు తెచ్చాం. లడ్డూ ప్రసాదానికి పూర్వ వైభవం తెచ్చి, నాణ్యతలో రాజీపడకుండా చర్యలు తీసుకున్నాం. ధర్మారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి వంటి అప్పటి సీఎం బంధువులు, సన్నిహితులకు టీటీడీలో కీలక పదవులు కట్టబెట్టారు. ఏకంగా 80 నుంచి 90 మందితో జంబో బోర్డులు ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాల పారిశ్రామికవేత్తలతో 'క్విడ్ ప్రో కో' దందాలు నడిపారు. కాంట్రాక్టులు, పైరవీల కోసం పవిత్ర పాలక మండలిని వేదికగా మార్చారు. కోర్టులు మొట్టికాయలు వేసినా వీరికి సిగ్గు రాలేదు. భక్తులు భక్తితో రాసిచ్చిన భూములు, నిధులపై కన్నేసి కోట్లాది రూపాయలను దారి మళ్లించి దేవాదాయ శాఖను నాశనం చేశారు. మాజీ మంత్రి రోజా వంటి నేతలు ప్రతి వారం 70-80 మందిని వెంటబెట్టుకుని వచ్చి, ఒక్కొక్కరి దగ్గర రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి వీఐపీ దర్శనాల పేరుతో భారీ దందాలు నడిపారు. రోజుకు వందల మందిని అడ్డగోలుగా తోస్తూ సామాన్య భక్తులను గంటల తరబడి క్యూలైన్లలో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈ అడ్డగోలు వీఐపీ సిఫార్సులకు కళ్లెం వేసి, క్యూలైన్లను క్రమబద్ధీకరిస్తూ, సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పిస్తూ మెడిటేషన్ జోన్లతో నేడు ప్రశాంత వాతావరణాన్ని తెస్తున్నాం. తిరుమలలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే ఏసీబీ దాడులు ప్రారంభమయ్యాయి. ఇంకా చాలామంది ఉన్నారు, ఎవరూ తప్పించుకోలేరు. పక్కా సాక్ష్యాధారాలు సేకరించి, శ్రీవారి సొమ్మును దోచుకున్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు దోషులుగా నిలబెడతాం. శ్రీవారి పవిత్రతను కాపాడటం, స్వామివారి ఆస్తులను రక్షించడం, సామాన్యుడికి పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ అసలైన ప్రక్షాళన అని విజయ్ కుమార్ పునరుద్ఘాటించారు.

### భక్తులు సహకరించాలి

రాజకీయాలను పక్కన పెడితే, మన తిరుమలను, మన ఆరాధ్య దైవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. పాత కాలంనాటి స్వచ్ఛమైన, పవిత్రమైన తిరుమలను రేపటి తరాలకు అలాగే అందించాలంటే ఇప్పుడే కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే కొన్నాళ్లకు తిరుమల ఒక కాంక్రీట్ అడవిలా మారిపోయే ప్రమాదం ఉంది. ఈ ముప్పును ముందే గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు.. దేవస్థానం ఉన్నతాధికారులు సిద్ధం చేసిన సమగ్ర నివేదికలను దాదాపు రెండున్నర గంటలపాటు క్షుణ్ణంగా పరిశీలించి, తిరుమల భవిష్యత్తు కోసం తిరుగులేని 'సూపర్ మాస్టర్ ప్లాన్'ను రూపొందించారని విజయ్ కుమార్ స్పష్టం చేశారు. తిరుమల పవిత్రతను కాపాడటంతో పాటు పారదర్శక పాలనను తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఈ సమగ్ర ప్రక్షాళనలో భాగంగా తీసుకునే కొన్ని నిర్ణయాలు తాత్కాలికంగా అసౌకర్యంగా అనిపించినా, కష్టంగా ఉన్నా భావితరాల శ్రేయస్సు కోసం ఇవి తప్పవు. తిరుమల రక్షణ కోసం ప్రతి ఒక్క భక్తుడు ఈ మహత్కార్యంలో భాగస్వామి కావాలి. శ్రీవారి పవిత్రతను, శేషాచల జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత మనపైనే ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ చారిత్రక మాస్టర్ ప్లాన్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులందరూ పూర్తి మద్దతు అందించాలని విజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

## పాతపట్నంలో ఎమ్మెల్యే ఎంజీఆర్ ప్రజాదర్బార్




పాతపట్నం (చైతన్యరథం) : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వ్యాఖ్యానించారు. శు క్రవారం నాడు పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 40 వినతి పత్రాలు వచ్చాయని, ముఖ్యంగా రెవెన్యూ, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి ప్రధాన సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గృహ నిర్మాణాలు, వృద్ధులు--వికలాంగులు-వితంతువుల వ్యక్తిగత వినతులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి అర్జీపై స్పష్టమైన చర్యలు తీసుకుని, 15 రోజుల్లో పరిష్కార వివరాలు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## ప్రజల ముంగిటకే ప్రభుత్వం : పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ప్రజలకు చేరువలో ప్రభుత్వం ఉండాలనే దృఢ సంకల్పంతో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం (PGRS) కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. పరిపాలన ప్రజల వద్దకే వెళ్లాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుండగా, ప్రతి శుక్రవారం ఎమ్మెల్యేలు స్వయంగా పీజీఆర్ఎస్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, మున్సిపల్ కమిషనర్, వన్ టౌన్ మరియు టూ టౌన్ సీఐలు తదితర పోలీస్, రెవెన్యూ శాఖల అధికారుల సమక్షంలో ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తంగా 55 అర్జీలను ప్రజల నుండి స్వీకరించడం జరిగింది. అధికారుల సమక్షంలోనే ఈ సమస్యలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి, ఫిర్యాదుదారులకు తక్షణమే పరిష్కార మార్గాలను లేదా జవాబులను పంపించేలా అత్యంత వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల నుండి వస్తున్న వినతులలో ప్రధానంగా రెవెన్యూ, పెన్షన్లకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటున్నాయని, ఈ సంవత్సరాంతానికి రెవెన్యూ సమస్యలన్నీ పూర్తిగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారని ఆయన పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం (చైతన్యరథం): ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత పటిష్టపరచాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శు క్రవారం ఎంవీపీ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో మాట్లాడారు. వైసీపీ హయంలో అవినీతి, అరాచకాలు ప్రజలకు గుర్తు చేస్తూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రచారం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి విజయం సాధించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, పార్టీ నేతలు చిక్కాల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రూ.43.5 వేలు పలికిన టీడీపీ కార్యాలయ వినాయకుని లడ్డూ

అమరావతి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినాయక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది స్వామివారికి నివేదించిన వినాయక లడ్డూను వేలం వేశారు. ఈ వేలం పాటలో రూ.43,500కి గుంటూరు టీడీపీ నేత మాదల చైతన్య లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించినట్లు చైతన్య తెలిపారు.



# పంట పొలాలకు 'ఎత్తిపోతల' జీవకళ

**●రైతుల పొలాలకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం**

**●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**




కోటబొమ్మాళి (చైతన్యరథం): టెక్కలి నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలకు పునర్వైభవం తీసుకొచ్చి, చివరి ఎకరం వరకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.8.65 కోట్ల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రస్తుతం ఆయా పథకాల పునరుద్ధరణ, ఆధునీకీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని 14 ఎత్తిపోతల పథకాల పరిధిలో 18,220 ఎకరాల ఆయకట్టుకు మరింత సమర్థంగా సాగునీరు అందే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

**అధికారంలోకి రాగానే రూ.78 లక్షలతో చర్యలు**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో సరైన పర్యవేక్షణ లేక నియోజకవర్గంలోని పలు ఎత్తిపోతల పథకాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి పరికరాలు, ఇతర యంత్ర సామగ్రి చోరీకి గురై పథకాలు నిర్వీర్యమయ్యాయని మంత్రి తెలిపారు. సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి రూ.78 లక్షల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆ నిధులతో అవసరమైన మరమ్మతులు చేపట్టి ఎత్తిపోతల పథకాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.

**మరో రూ.7.87 కోట్లతో ఆధునీకీకరణ**

ఎత్తిపోతల పథకాలను కేవలం మరమ్మతులతో సరిపెట్టకుండా పూర్తిస్థాయిలో ఆధునీకరించి ఆయకట్టుకు సాగునీటి సామర్థ్యాన్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో 2026లో మరో రూ.7.87 కోట్ల నిధులు మంజూరు చేయించామని అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందులో కోటబొమ్మాళి మండలంలోని కొండపేట ఎత్తిపోతల పథకానికి రూ.3.77 కోట్లు, టెక్కలి మండలంలోని మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకానికి రూ.4.10 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిధులతో నూతన పైప్‌లైన్ల నిర్మాణం, ఆయకట్టు విస్తరణతో పాటు అవసరమైన ఆధునీకీకరణ పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వీలైనంత త్వరగా పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయి ప్రయోజనం అందేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

**14 పథకాలు.. 18,220 ఎకరాల ఆయకట్టు**

టెక్కలి నియోజకవర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకాల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. కోటబొమ్మాళి మండలంలో 11 పథకాల కింద 13,650 ఎకరాలు, టెక్కలిలో 2 పథకాల కింద 4,100 ఎకరాలు, నందిగాంలో ఒక పథకం కింద 470 ఎకరాలు కలిపి మొత్తం 14 ఎత్తిపోతల పథకాల పరిధిలో 18,220 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. వీటి ద్వారా సుమారు 15 వేల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

**రైతు పొలానికి నీరందించడమే మా లక్ష్యం**

ఎత్తిపోతల పథకాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వరితో పాటు మొక్కజొన్న, రాగి, వేరుశనగ, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల సాగుకు మరింత భరోసా లభిస్తుందని అచ్చెన్నాయుడు తెలిపారు. సాగునీటి సౌకర్యాలను బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూలనపడిన ఎత్తిపోతల పథకాలకు కూటమి ప్రభుత్వం పునర్జీవం పోస్తోంది. రూ.8.65 కోట్లతో చేపట్టిన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. పనులను త్వరితగతిన పూర్తి చేసి 18 వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతు పొలానికి నీరు చేరాలి.. పంట పండాలి.. రైతు కుటుంబం ఆనందంగా ఉండాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## వంతెన పనులు వేగవంతం చేయాలి... ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**●నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు**



నరసన్నపేట (చైతన్యరథం): పోలాకి మండలం వనిత మండలం వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. వంతెన నిర్మాణ పనుల పురోగతిని ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే.. పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ... వనిత మండలం వద్ద వంతెన నిర్మాణానికి గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రాష్ట్ర మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు, పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహకారంతో రూ.72 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అయితే అనంతరం వచ్చిన ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులను పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు అదనంగా రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసి పనులను తిరిగి ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించడంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా పనులను వేగంగా పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వంతెన నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

## గురుకుల విద్యార్థుల భోజనం కోసం ఆధునిక సదుపాయాలు : ఎమ్మెల్యే కూన

ఆమదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని బూర్జ మండలం కొల్లివలసలో ఉన్న బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.87 లక్షల DMF నిధులతో నిర్మించిన స్మార్ట్ కిచెన్‌ను ఆమదాలవలస నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. రూ.87 లక్షల ఐవీఖీ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ ద్వారా విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో సిద్ధం చేసేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. వంటశాలలో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు మరింత మెరుగైన భోజన సౌకర్యం లభిస్తుందని చెప్పారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి అవసరమైన మరిన్ని సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## జగ్గంపేటలో మెగా జాబ్ మేళాకు భారీ స్పందన... యువత భవిష్యత్తుకు బంగారు బాట

●జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో యువత భవిష్యత్తుకు బంగారు బాటలు

జగ్గంపేట (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోపికృష్ణ పర్యవేక్షణలో జగ్గంపేటలో నిర్వహించిన జాబ్ మేళా - 2026ను కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతుల నవీన్ ప్రారంభించారు. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, బిసైడ్ పోలవరం కెనాల్, గోకవరం రోడ్, జగ్గంపేట వేదికగా జరిగిన ఈ మెగా జాబ్ మేళాకు 150 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ మెగా జాబ్ మేళాలో 18 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. టాటా క్యాపిటల్, ఐసిఐసిఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, విప్రో, ఫాక్స్ కాన్, రాయల్ ఎన్ ఫీల్డ్, కియా, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి దిగ్గజ సంస్థలు వందలాది ఉద్యోగావకాశాలను యువత ముందుంచాయి. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ... యువతలో ఆత్మవిశ్వాసం నింపారు. తమ స్కిల్‌కు తగ్గ ఉద్యోగం రాకపోయినా అందివచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగంలో చేరి మీలోని టాలెంట్‌ను బయటికి తీసుకురావాలని, అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. ఇప్పుడు సంపాదించే అనుభవం, సీనియారిటీ రేపు రాబోయే పెద్ద ఉద్యోగాల్లో కీలకంగా మారుతుందని తెలిపారు. ఉద్యోగం కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలు, కలలు నిజం చేసే సాధనమని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, జాబ్ మేళాల ద్వారా ప్రతి ఇంట్లో ఉద్యోగం అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

## కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం



కొవ్వూరు (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, కుటుంబ, గ్రామీణ, పట్టణ మరియు ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి 120 వినతి పత్రాలను అందజేశారు. ప్రజలు వివరించిన సమస్యలను ఎమ్మెల్యే ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా, కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనే నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో ప్రజలు ఫోన్ ద్వారా ఎమ్మెల్యేని సంప్రదించి తమ సమస్యలను వివరించారు. ప్రజలు తెలిపిన సమస్యలపై ఎమ్మెల్యే సంబంధిత ప్రభుత్వ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధాన ధ్యేయం : ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

●సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలపై ఆదేశాలు జారీచేసిన ఎమ్మెల్యే



రంపచోడవరం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా సేవలందిస్తున్నట్లు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె APIIC డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు ముందుగా స్థానిక మండల నాయకత్వానికి తెలియజేయాలని సూచించారు. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే తన వద్దకు వస్తే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పలు రకాల మౌలిక సదుపాయాలు కల్పన కొరకు, పలు వ్యక్తిగత సమస్యలపై పలు వినతులు రాగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులకు చరవాణిలో మాట్లాడి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మరియు పరిష్కారం చేసిన పిదప తన దృష్టిలో పెట్టాలని సూచించారు. దరఖాస్తుదారులతో మాట్లాడిన ఆమె ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనతో చెప్పే అవకాశం ఉందన్నారు. తమ కార్యాలయంలో అయిన తెలియజేస్తే వెంటనే స్పందించి పరిష్కారం చేస్తామన్నారు. కొన్ని సమస్యలపై పారదర్శకంగా ప్రాధాన్యత క్రమంలో అన్నింటిని క్రమానుగుణంగా పరిష్కారం చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

## ప్రజాదర్బార్‌లో అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



శృంగవరపుకోట (చైతన్యరథం): ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. శృంగవరపుకోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి స్వయంగా హాజరై నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులు అందించిన సమస్యలను సావధానంగా విన్న ఆమె, వాటిని సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజాదర్బార్‌లో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి మొత్తం 34 అర్జీలు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 25 అర్జీలు రాగా, విద్యుత్ శాఖకు సంబంధించి 3, దేవాదాయ శాఖకు 2, గ్రామీణ నీటి సరఫరా (RWS) విభాగానికి 2, ఎంపీడీవో (పెన్షన్లు) విభాగానికి 1, పంచాయతీరాజ్ విభాగానికి 1 దరఖాస్తు అందాయి. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రభుత్వం ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తోందని, అధికారులు ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా స్పందించి సకాలంలో పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే లలిత కుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'భారతీయం' కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు : పర్యవేక్షిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ

కాకినాడ (చైతన్యరథం): ఈ నెల 20వ తేదీన ఉదయం 8.30 గంటలకు కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని అచ్చంపేట జంక్షన్ సమీపంలో ఉన్న ఆకుంటి లక్ష్మీ గోశాలలోని వసంత మండపం మీటింగ్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యార్థుల నైతిక విలువలు, నైతిక ప్రవర్తన సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తిని, నైతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో 'భారతీయం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖ, సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు, 66 మంది ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొననున్నారు. గోశాల సందర్శన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పోలీసులు చేపట్టనున్నారు.

## కూటమి పాలనలో శరవేగంగా రాష్ట్రాభివృద్ధి

●ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



గోపాలపురం (చైతన్యరథం): కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా సాగుతుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వ్యాఖ్యానించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఎమ్మెల్యే... స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించి, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు మరియు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ కార్యక్రమాలు చేపడుతున్నామని దీంతో సమస్యల పరిష్కారం వేగంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ ఉద్యోగ కల్పనే లక్ష్యం

● యువత భవితకు భరోసా కార్యక్రమంలో ఎమ్మెల్యే యనమల దివ్య



తుని (చైతన్యరథం) : ప్రతి ఇంటికీ ఉద్యోగ కల్పనే లక్ష్యమని తన ముందున్న కర్తవ్యమని, యువతకు ఉద్యోగం, నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండాగా పని చేస్తున్నామని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య పునరుద్ఘాటించారు. తుని ఆదిత్య కాలేజ్‌లో నిర్వహించిన యువత భవితకు భరోసా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ... కూటమి పాలనలో ఒకవైపు అభివృద్ధి మరో వైపు ఉద్యోగ ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి ఆదిశగా అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. మొన్నటి వరకు వాణిజ్య కేంద్రంగా ఉన్న తుని భవిష్యత్‌లో పారిశ్రామిక ప్రగతికి పునాదిగా నిలుస్తుందన్నారు. విపక్షం నిరాధార ఆరోపణలను తిప్పి కొట్టిన ఎమ్మెల్యే యనమల దివ్య... డీఎస్సీ నియామాకాలపై వైసీపీ లొల్లిని తూర్పారబడుతూ యువత ఏదీ నిజమెంతో గుర్తెరగాలన్నారు. యువత భవిష్యత్‌కు భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో భాగంగా తుని నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య యువతతో ముఖాముఖి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, మెగా డీఎస్సీ, పోటీ పరీక్షలు, కెరీర్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులు, నిరుద్యోగ యువతతో చర్చించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖాముఖి సందర్భంగా యువత తమకు ఎదురవుతున్న విద్య, ఉద్యోగ, శిక్షణ సంబంధిత సమస్యలను ఎమ్మెల్యే దివ్య దృష్టికి తీసుకువచ్చారు. విద్యాసంస్థల్లో అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలపై కూడా పలు సూచనలు చేశారు. యువత నుంచి వచ్చిన అభిప్రాయాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైన మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ప్రజలు వాకింగ్ ట్రాక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం (చైతన్యరథం): మైలవరం పట్టణంలోని సూరిబాబునగర్‌లో దేవుని చెరువు కట్టపై రూ.50 లక్షలతో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ఉద్దేశంతో దేవుని చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువు కట్టపై ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. మైలవరం పట్టణ ప్రజలు ఈ వాకింగ్ ట్రాక్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ మైలవరం నియోజకవర్గంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు.

## వినాయకచవితి వేడుకలకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం : టీడీపీ నేత గద్దె క్రాంతి కుమార్



విజయవాడ (చైతన్యరథం): వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సంపూర్ణ సహకారం అందిస్తోందని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం 14వ డివిజన్‌లో ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ వారు ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద టీడీపీ నేత గద్దె క్రాంతి కుమార్, బొప్పన భావకుమార్ లు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ... వినాయక చవితి వేడుకలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. వినాయక పందిర్ల వద్ద ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం, డీజేలకు నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వడం, విగ్రహాల ఊరేగింపుల సందర్భంగా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచడం వంటి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఊరేగింపుల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం, పండుగ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు చేయడం ద్వారా భక్తులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గౌరవం ఇస్తూ కూటమి ప్రభుత్వం పండుగల నిర్వహణకు సహకరిస్తోందన్నారు. వినాయక చవితి వేడుకలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని గద్దె క్రాంతి కుమార్ కోరారు.

## త్రాగునీటి సమస్యలపై వచ్చిన ప్రజలకు... భరోసా ఇచ్చిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ పట్టణ శివారు దొండపాడు కాల్వ వద్దగల శ్రీదేవి నగర్ కాలనీకి చెందిన నివాసితులు తమ ప్రాంతంలో త్రాగునీటి సమస్యను ప్రజావేదిక కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను సావధానంగా విని తెలుసుకున్న ఎమ్మెల్యే రాము... కాలనీ గుడివాడ పట్టణ శివారులో ఉన్న పంచాయతీ పరిధిలో ఉండడం వల్ల సమస్యలు పరిష్కారానికి సమస్యలు వస్తున్నాయని, నెల రోజుల్లో కాలనీ గుడివాడ పరిపాలక సంఘంలో విలీనం అవుతుందని తక్షణమే త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. ఈలోపు ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలని అధికారులకు సూచనలు చేశారు. సత్వరమే స్పందించి భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే రాముకు స్థానిక నివాసితులు ధన్యవాదాలు చెప్పారు.

## రూ.1.88 కోట్లతో మూడు బీటీ రహదారి పనులకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శంకుస్థాపన



తాడికొండ (చైతన్యరథం) : రూ.1.88 కోట్లతో మూడు బీటీ రహదారి అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. గరుడాచలపాలెం ఫిరంగిపురం మండలం గరుడాచలపాలెం గ్రామంలో రూ.1.28 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వేములూరిపాడు-అమీనాబాద్: ఫిరంగిపురం మండలం వేములూరిపాడు నుండి అమీనాబాద్ వరకు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మేడికొండూరు మండలం దోకిపర్రు గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం, గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే కాగిత



పెడన (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన వివిధ వర్గాల ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ, విద్యుత్, రహదారులు, సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా.. వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ, ప్రతి సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. గ్రీవెన్స్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు క్షేత్రస్థాయిలో పారదర్శకమైన, జవాబుదారీ పాలనను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గుంటూరులోని ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి ఫిర్యాదులను, వినతులను స్వీకరించారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించాల్సిన వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని సూచించారు. మరికొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఇతర శాఖలకు సంబంధించిన ఫిర్యాదుల నిమిత్తం అవసరమైన పీజీఆర్ఎస్ నమోదు చేయమని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన లక్ష్యం : బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలోని బుద్ధా వెంకన్న కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్ధా వెంకన్న, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ... "ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవడం మా బాధ్యత అని, అందుకే ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికక్కడ తిరగాల్సిన అవసరం లేకుండా, మా కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తామని, ప్రజలకు సేవ చేయడమే మా ప్రధాన లక్ష్యమని బుద్ధా వెంకన్న అన్నారు.

## ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం

●అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు : ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో ప్రజాప్రతినిధిగా తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నానని అన్నారు. శుక్రవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. స్వయంగా ప్రజల నుండి వినతులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ... సెంట్రల్ నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా ప్రజాదర్బార్ రోజున మాత్రమే కాకుండా ప్రతిరోజూ ఎమ్మెల్యే కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, నిత్యం వందలాది మంది ప్రజలు తమ సమస్యలను తీసుకుని కార్యాలయానికి వస్తుంటారని అన్నారు. ప్రజల సమస్యలను ఓపికగా విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతోనే ప్రతి శుక్రవారం పెద్ద సంఖ్యలో ప్రజలు తమ కార్యాలయానికి వచ్చి వినతులు అందజేస్తున్నారని బొండా ఉమా అన్నారు.

## ఇరిగేషన్‌పై జగన్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు : మాజీ మంత్రి దేవినేని ఉమా

విజయవాడ (చైతన్యరథం): రైతాంగం, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కీలక ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గొల్లపూడి లోని కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఉమా రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై జగన్ రెడ్డి చేస్తున్న ఫేక్ ప్రచారాలపై తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి పట్టుదల, కృషితోనే పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని ఉమా పేర్కొన్నారు. పోలవరం డయాఫ్రం వాల్ విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉద్దేశపూర్వక నిర్ణయాలే ప్రాజెక్టుకు నష్టం కలిగించాయని ఆరోపించారు. 2023 మార్చిలోనే 41.15 మీటర్ల ఎత్తుకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు అదే అంశంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 22 మంది ఎంపీలను పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలారు అని ఉమా విమర్శించారు. ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం వద్ద గట్టిగా మాట్లాడకుండా కేసుల మాఫీ కోసం పైరవీలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు.

# నిర్వాసితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి వెల్లడి



మార్కాపురం (చైతన్యరథం): శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలో జవహర్ నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు తెలుసుకొని పరిష్కారం చేయటం కోసం ఈ " ప్రజా దర్బార్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామలైన గొట్టిపడియ, సుంకేసుల, గుండంచెర్ల, కలనుతల గ్రామ ప్రజలు పాల్గొని ఆర్ఆర్ కాలనీలోని సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజాదర్బార్ లో వచ్చిన అర్జీలలోని కొన్ని సమస్యలను ఇక్కడికిక్కడే పరిష్కారం చేశామని మిగతా వాటికి త్వరిగతిన పరిష్కారం అధికారులు చూపుతారని అన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ఈ ప్రజా దర్బార్ ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



# సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

### టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు

యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుపాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అర్జీల రూపంలో అర్జీదారుల నుండి తీసుకున్నారు. ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గుంటూరు ఛానల్ విస్తరణకు శ్రీకారం

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి గెజిట్ విడుదల



పర్చూరు (చైతన్యరథం): నీళ్లు రాని కాలువ వైపే ఏళ్ల తరబడి ఎదురుచూపులు.. వాన కురిస్తే తప్ప తడవని పొలాలు.. ఓ రైతన్న ఆవేదన.. ఇదంతా పర్చూరు ప్రాంత రైతుల నిన్నటి కథ. ఈ పాత కథ కొత్త మలుపు తిరిగింది. గుంటూరు ఛానల్ విస్తరణ కోసం భూసేకరణ ప్రక్రియ అధికారికంగా మొదలైంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విశేష కృషి ఫలితంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ తో ప్రభుత్వం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో, పర్చూరు ప్రాంత అభివృద్ధి చరిత్రలో ఇది మరో కీలక మైలురాయిగా నిలిచింది. పర్చూరు నియోజకవర్గ చరిత్రలో కీలక అధ్యాయం మొదలైంది. గుంటూరు కాలువను కి.మీ. 70.900 నుంచి కి.మీ.75.035 వరకు విస్తరించడంతోపాటు నాలుగు లిఫ్ట్ స్కీంలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం పర్చూరు మండలంలోని ఇనగల్లు, ఏదుబాడు, గర్నెపూడి గ్రామాల పరిధిలో 49.53 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ ప్రభుత్వం జారీ చేసింది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ గెజిట్ ఎక్స్‌ట్రార్డినరీ నం.377, జి.699లో ఈ నోటిఫికేషన్ ప్రచురితమైంది. గుంటూరు ఛానల్ విస్తరణ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, పర్చూరు ప్రాంత భవిష్యత్ అభివృద్ధికి కీలక మలుపని రైతులు, స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రాజెక్టుతో తాగునీరు సాగునీరు, పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైలు రాయిగా నిలవనుంది.సాగునీటి వసతులు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పాదకత పెరగడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించే అవకాశం ఉందని, నీటి వనరుల అభివృద్ధితో పర్చూరుకు కొత్త దిశ ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. గెజిట్ నోటిఫికేషన్ కోసం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన ప్రయత్నాలు ఫలించాయని టీడీపీ నేతలు పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన ఫైళ్ల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులతో సమన్వయం చేశారని పేర్కొన్నారు. "పది రోజుల్లో గెజిట్ విడుదల చేయిస్తా" అని రైతులకు ఇచ్చిన హామీని ఆయన నిలబెట్టుకున్నారని, ఆ మేరకు ప్రక్రియను వేగవంతం చేయడంపైనే ప్రత్యేక దృష్టి సారించారని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన విషయాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రకటించడంతో పర్చూరులో ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బొమ్మల సెంటర్ లో రైతులు,ప్రజలు ఆనందోత్సాహాలతో కోలాహలంగా మారింది. టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్న రైతులకు తెలుగుదేశం పార్టీ నేతలు స్వీట్లు పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రాజెక్టుకు మళ్లీ కదలిక రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు ఛానల్ విస్తరణకు గతంలో ఆమోదం లభించి ప్రక్రియ ముందుకు సాగినా, 2019--2024 మధ్య పనులు రద్దయ్యాయని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తదితరుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతోపాటు, అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ ఎమ్మెల్యే ఏలూరి భూసేకరణ అంశాన్ని ముందుకు తీసుకెళ్లారని టీడీపీ నాయకులు తెలిపారు. గెజిట్ నోటిఫికేషన్‌తో భూసేకరణ ప్రక్రియకు అధికారికంగా మార్గం ఏర్పడింది. దీంతో గుంటూరు ఛానల్ విస్తరణపై పర్చూరు రైతుల్లో మళ్లీ నమ్మకం బలపడింది. కాలువ పనులు పూర్తయి సాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తే, పర్చూరు ప్రాంత వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, అనగాని సత్య ప్రసాద్, నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు తెలిపారు. పర్చూరు ప్రజల చిరకాల స్వప్నం గుంటూరు ఛానల్ నెరవేర్చే దిశగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



### బీసీ, అంబేద్కర్ , జగ్జీవన్

# భవన్‌ల నిర్మాణాలకు శ్రీకారం

నెలూరు (చైతన్యరథం): బీసీ భవన్, అంబేద్కర్ భవన్, బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లను జిల్లాకు మంజూరు చేసిన ఘనత నారా చంద్రబాబుదని ఎమ్మెల్సీ, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా, రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి భవన్ ల స్థలాలను పరిశీలించారు. 2017-19 మధ్యకాలంలో ఆనాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీ భవన్, అంబేద్కర్ భవన్, బాబూ జగ్జీవన్ రావు భవన్ లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోబీసీ భవన్ నిర్మాణ పనులు ప్రారంభం కాగా, అంబేద్కర్ భవన్, బాబూ జగ్జీవన్ రామ్ భవన్ నిర్మాణాలకు స్థల కేటాయింపు జరిగిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీ భవన్, అంబేద్కర్ భవన్, జగ్జీవన్ రావు భవన్ నిర్మాణాలను పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. బీసీ భవన్ నిర్మాణానికి మున్సిపల్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ తమ విద్యాసంస్థల నుండి కోటి రూపాయల సిఎస్ఆర్ నిధులను అందించారన్నారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు కోటి రూపాయల నిధులను బీసీ భవన్ నిర్మాణానికి కేటాయించారు.బీసీ, అంబేద్కర్ భవన నిర్మాణాల కోసం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇంజనీర్లతో కలెక్టరు హిమాన్ష్ శుక్ల గారు చర్చించారు.బీసీ భవన్, అంబేద్కర్ భవన్ నిర్మాణాలు పూర్తి చేయడానికి అవసరమైన డ్రాయింగ్ లు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.బాబు జగ్జీవన్ రామ్ భవన్ నిర్మాణం కోసం కొత్తూరు ప్రాంతంలో కేటాయించిన స్థలంలో సమస్యలు ఉండడంతో బీసీ, అంబేద్కర్ భవనాల సమీపంలో స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరాం.మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలతో పలు దఫాలు చర్చించాక, కలెక్టర్‌తో కలిసి నిర్మాణ స్థలాలు నేడు పరిశీలించారు.



# ప్రజా దర్బార్‌లో సమస్యల సత్వర పరిష్కారం

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, స్థానిక సమస్యలను కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు అందించిన వినతులను ఆయన సానుకూలంగా స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి రోజు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ ప్రజలకు ఉదయం 7 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది, కావున ప్రజలందరూ కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుకుంటున్నామన్నారు. ప్రజల సూచనలు, సలహాల మేరకే నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. పై కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ, క్లస్టర్ ఇంచార్జు జలదంకి సుధాకర్, షశీషుద్దీన్, కో క్లస్టర్ ఇంచార్జు లక్ష్మీ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు విజయ్ భాస్కర్, టీడీపీ నాయకులు రవి, మునీర్ భాష పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి




పుట్టపర్తి (చైతన్యరథం): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. పుట్టపర్తి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె ప్రతి సమస్యను స్వయంగా విని వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ప్రజల సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా, సమస్యలపై స్పందించి నిర్ణీత సమయంలో పరిష్కారం చూపేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు.



# సమస్యల పరిష్కారమే ధ్యేయం

## ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వెల్లడి

కోడుమూరు (చైతన్యరథం): ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించి పరిష్కరించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు కోడుమూరు నియోజక వర్గం శాసనసభ్యుడు బొగ్గుల దస్తగిరి తన నివాసం నందు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# 60 ఏళ్ల కలకు శాశ్వత పరిష్కారం

## మంత్రి నారాయణ చొరవతో 1215 కుటుంబాల్లో జీవన్ జ్యోతులు

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్ట వాసుల 60 ఏళ్ల కల సాకారం కాబోతోందని నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాలు అందించే ప్రక్రియకు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ లైన్ క్లియర్ చేశారని వెల్లడించారు. శుక్రవారం నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేపల్లి కాలువకట్ట వాసులకు శాశ్వత పట్టాలు ఇప్పించేందుకు మంత్రి నారాయణ అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ నిరంతరం కృషి చేశారని రూప్‌కుమార్ తెలిపారు. అధికారుల సూచనల మేరకు దేశంలో తొలిసారిగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నర్మదా నది పరీవాహక ప్రాంత వాసులకు పట్టాలు ఇచ్చిన విధానాన్ని పరిశీలించి, అదే తరహాలో నెల్లూరు కాలువకట్ట వాసులకు కూడా న్యాయం జరిగేలా మంత్రి ప్రయత్నించారని చెప్పారు. మంత్రి నారాయణ చొరవతో ఈ నెల 3న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పొందిందని, దీంతో 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీకి మార్గం సుగమమైందన్నారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో పట్టాలను పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి పరమేశ్వరి కళ్యాణమండపంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. పేదల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి నారాయణ ముందుంటున్నారని రూప్‌కుమార్ అన్నారు. గతేడాది భగత్‌సింగ్ కాలనీలో 1400 కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇప్పించిన విషయాన్ని గుర్తుచేశారు. పేదలకు అండగా నిలవాలన్న సంకల్పంతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను మంత్రి నారాయణ చొరవతో పరిష్కరిస్తున్నారని చెప్పారు. పేదల పక్షపాతిగా పనిచేస్తున్న మంత్రి నారాయణపై వైఎస్సార్‌సీపీ నేతలు సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని రూప్‌కుమార్ విమర్శించారు. రోజుకో అబద్ధం చెప్పి తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతల దుర్మార్గాన్ని ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతోనే సమాధానం చెబుతారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నేతలు బాలాజీ, తిరుమలనాయుడు, జహీర్ పాల్గొన్నారు.






# మంత్రి లోకేష్ పర్యటనకు భారీగా తరలిరండి

## పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు

రాప్తాడు (చైతన్యరథం): ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యటనకు పెద్ద ఎత్తున తరలి రావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రామగిరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి భవనంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈనెల 22న నారా లోకేష్ రాప్తాడుతో పాటు చెన్నేకొత్తపల్లికి రానున్నట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు. రాప్తాడులో ర్యాలీ ఉంటుందని.. అలాగే పార్టీ కార్యకర్తల సమావేశం కూడా ఉంటుందన్నారు. ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహావిష్కరణ ఉన్న నేపథ్యంలో భారీగా తరలివస్తామని నాయకులు చెబుతున్నారన్నారు. రామగిరి మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు వచ్చేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. దీనిపై నాయకులు చొరవ తీసుకుని పర్యటనకు వచ్చేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మంది రామగిరి నుంచే రావాలన్నారు. మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికి.. నియోజకవర్గంలో మన పార్టీ బలాన్ని చూపించాలని పిలుపునిచ్చారు.

# క్రెడిట్ చోరీ వైసీపీ డీఎన్ఏలోనే ఉంది

## టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి (చైతన్యరథం): వైఎస్సార్‌సీపీ నేతలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వాస్తవాలను ప్రజల ముందుంచకుండా కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు తమదే క్రెడిట్ అంటూ ప్రచారం చేసుకోవడం సరికాదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ విమర్శించారు. వైసీపీ నేతల రాజకీయ వైఖరిలోనే క్రెడిట్ చోరీ ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తిరుపతిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని నరసింహ యాదవ్ అన్నారు. తిరుమలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మ్యూజియాన్ని ప్రారంభించడంపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. అభివృద్ధి కార్యక్రమాన్ని తామే చేశామని చెప్పుకోవడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలకు వేగం పెరిగిందని నరసింహ యాదవ్ పేర్కొన్నారు. ఒక ప్రాజెక్టు గతంలో ప్రారంభమై ఉంటే దాని పురోగతి, పూర్తి స్థాయి, ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ప్రజలకు స్పష్టమైన వివరాలు ఇవ్వాలని అన్నారు. నిజంగా వైసీపీ హయాంలోనే అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి ఉంటే వాటిని అప్పుడే ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ప్రజల ముందుకు వాస్తవాలతో రావాలని డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని నరసింహ యాదవ్ ఆరోపించారు. వైసీపీ నేతలు, అనుచరుల వ్యవహారశైలిపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడటంతోనే 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ప్రజా వేదిక కూల్చివేత నుంచి తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి నాణ్యతపై వచ్చిన వివాదం వరకు పలు అంశాలను నరసింహ యాదవ్ ప్రస్తావించారు. తిరుమల వంటి పవిత్ర క్షేత్రాన్ని రాజకీయాలకు ఉపయోగించారంటూ వైసీపీపై విమర్శలు చేశారు. ప్రభుత్వ వ్యవస్థలను బలహీనపరిచారనే ఆరోపణలు కూడా చేశారు. టీడీపీకి అభివృద్ధి, సంక్షేమం ప్రధాన అజెండాలని నరసింహ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, రాజకీయ విమర్శల కంటే పనితీరే ప్రభుత్వానికి కొలమానమని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో వాస్తవాలను ప్రజలకు వివరించాలని, క్రెడిట్ కోసం రాజకీయ ప్రచారాలు చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు సూచించారు.

# తెలుగమ్మాయికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్

**ఇంజినీరింగ్, న్యూరోసైన్స్ కోర్సులు అభ్యసించేందుకు అర్హత సాధించిన అనీస్ ఫాతిమా**

**రూ.1.50 కోట్లు మంజూరు చేసిన యూనివర్సిటీ**

**అండగా నిలుస్తామన్న విద్యా శాఖ మంత్రి నారా లోకేష్**



**గుంతకల్లు (చైతన్యరథం):** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక సాధారణ విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిపెట్టింది. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన అనీస్ ఫాతిమా ప్రపంచ ప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్ కైవసం చేసుకుని తన చిన్ననాటి కలను సాకారం చేసుకుంది. చిన్నప్పటి నుంచే ఆక్స్‌ఫర్డ్‌లో చదవాలని ఆకాంక్షించిన అనీస్ ఇంటర్మీడియట్ స్థాయి నుంచే విదేశీ ప్రవేశ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమైంది. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా 123 దేశాల నుంచి పోటీపడిన వేలాది మంది విద్యార్థులతో తీవ్రంగా శ్రమించింది. ఆమె రూపొందించిన 'C++ ప్రాజెక్ట్' ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ నిపుణులను విశేషంగా ఆకట్టుకుంది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన అత్యుత్తమ 12 మంది విద్యార్థుల్లో ఒకరిగా నిలిచి చరిత్ర సృష్టించింది.

ఈ ఘనతతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్, న్యూరోసైన్స్ కోర్సులు అభ్యసించేం దుకు అనీస్ ఫాతిమాకు 70 వేల పౌండ్ల స్కాలర్‌షిప్ లభించింది. తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపిన అనీస్ విజయం ప్రస్తుతం ఎంతో మంది తెలుగు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన షాన్‌వాజ్ బేగం-జాకీర్ హుస్సేన్ దంపతుల కుమార్తె అనీస్ ఫాతిమా పదో తరగతి వరకు కేంద్రీయ విద్యాలయంలో విద్యనభ్యసించింది. ఇంటర్మీడియట్ చదువు కోసం రిషివ్యాలీ పాఠశాలకు వెళ్లింది. ప్రఖ్యాత విద్యా సంస్థలో విద్యనభ్యసించాలన్న కోరికతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నాలుగు సంవత్సరాలకు ఒకసారి అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో పాల్గొని అర్హత సాధించింది. ఆమెకు రూ.1.50 కోట్ల స్కాలర్‌షిప్‌ను యూనివర్సిటీ మంజూరు చేసింది. ఇంత కష్టపడి అర్హత సాధించిన ఆమెకు అక్కడికి వెళ్లి చదవాలంటే పేదరికం అడ్డంకిగా మారింది. ప్రతి సంవత్సరం అక్కడ విద్యను అభ్యసించాలంటే కనీసం 35 నుంచి 40లక్షల వరకు ఖర్చవుతుంది. ఇందుకు రూ.కోటికి పైగా డబ్బు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా వీసా ప్రాసెసింగ్ కోసం కనీసం రూ.35 లక్షలు బ్యాంకులో జమ చేయాల్సి ఉండగా మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఫాతిమా తల్లిదండ్రులు అంత డబ్బు సమకూర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఫాతిమా ఇబ్బందులను గుర్తించిన స్థానిక కార్పొరేటర్ ఆంజనేయులు వీరి కుటుంబ సభ్యులను గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వద్దకు తీసుకెళ్లి ఎలాగైనా ఈ విద్యార్థిని పరిస్థితిని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ దగ్గరకు తీసుకెళ్లాల్సిం దిగా కోరారు. అసెంబ్లీ సమావేశాలు జరిగిన సమయంలో ఫాతిమాను మంత్రి నారా లోకేష్ వద్దకు తీసుకెళ్లి విషయాన్ని తెలియజెప్పారు. సానుకూలంగా స్పందించిన లోకేష్ కచ్చితంగా దేశంలోనే ఒకే ఒక విద్యార్థిగా ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో విద్యను అభ్యసించే అవకాశాన్ని పొందిన ఫాతిమాకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



# తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం

**'ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్' పురస్కారం అందుకున్న గణేష్**



**లండన్:** ఇంగ్లాండ్ రాజధాని లండన్‌లో అత్యంత ప్రాచీనమైన, విశిష్ట ప్రాచుర్యం పొందిన 'ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్' పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన కుప్పాల గణేష్ అందుకున్నారు. లండన్ అధికారులు ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. మిర్యాలగూడకు చెందిన కుప్పాల ఆదిలక్ష్మి-బాలస్వామి దంపతుల కుమారుడైన గణేష్ తన విద్యాభ్యాసాన్ని స్వగ్రామంలోనే పూర్తి చేసి ఉద్యోగరీత్యా లండన్‌లో స్థిరపడ్డారు. లండన్‌లో గణేష్ అందించిన స్వచ్ఛంద సేవలు, సామాజిక, సాంస్కృతిక సంస్థలకు ఆయన వహించిన నాయకత్వాన్ని గుర్తించిన లండన్ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధి చెందిన ఈ అవార్డును అందుకోవడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని, ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని గణేష్ సంతోషం వ్యక్తం చేశారు.



# తిరుమల శ్రీవారికి నాట్య నివేదన


**సింగపూర్ నుంచి తరలివచ్చిన కళాకారులు**

**సింగపూర్:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాట్య నివేదన సమర్పించేందుకు సింగపూర్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారులు విచ్చేశారు. టీటీడీ సౌజన్యంతో శ్రీ సాంస్కృతిక కళాసారధి-సింగపూర్ (SSKS) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. సింగపూర్‌కు చెందిన అభినయ నాట్యాలయ-ప్రత్యూష అవధానుల శిష్య బృందం, మాతృశ్రీ సాయి అకాడమీ-నిషిత యాబాజీ శిష్య బృందంలకు చెందిన 22 మంది కూచి పూడి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గురువులతో కలిపి సుమారు 45 మంది ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొననున్నారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడ సేవ సందర్భంగా.. శనివారం తిరుమల మాడ వీధుల్లో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సింగపూర్ బృందం కూచిపూడి నృత్యంతో నాట్య నివేదన సమర్పించనుంది. విదేశాల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయ కళలను అభ్యసిస్తున్న యువ కళాకారులు తమ సొంత ఖర్చులతో భారత్‌కు వచ్చి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నాట్య సేవ చేయడం విశేషం. ముఖ్యంగా సింగపూర్, జర్మనీల నుంచి కళాకారులు తొలిసారిగా స్వీయ ఖర్చులను భరించి విచ్చేశారు. విదేశాల్లో పెరుగుతున్న తెలుగు తరానికి మన సంస్కృతి, సాహిత్యం, సంగీతం, నృత్య సంప్రదాయాలను పరిచయం చేసి వాటిని కొనసాగించేలా ప్రోత్సహించడమే శ్రీ సాంస్కృతిక కళాసారధి-సింగపూర్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సంస్థ అధ్యక్షులు రత్నకుమార్ కవుటూరు తెలిపారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు, ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు తిరుమల మాడ వీధుల్లో జరిగే నాట్య నివేదనను భక్తులు ఎస్వీబీసీ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు.

# యువత వాస్తవ పరిస్థితులు గ్రహించాలి

**ప్రముఖ ఎమోషనల్ ఇంటెలిజెన్స్ కోచ్ భారతి నాదెండ్ల**

**నాట్స్ ఆధ్వర్యంలో 'అమెరికా కలలు-వాస్తవాలు' ఆన్‌లైన్ అవగాహన సదస్సుకు విశేష స్పందన**




**యూఎస్ఏ:** అమెరికాలో తెలుగువారి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్ తాజాగా 'అమెరికా కలలు-వాస్తవాలు' శీర్షికతో నిర్వహించిన ఆన్‌లైన్ అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ప్రముఖ ఎమోషనల్ ఇంటెలిజెన్స్ కోచ్ భారతి నాదెండ్ల ఎన్నో అమూల్యమైన విషయాలను తెలిపారు. అమెరికాలో అడుగుపెట్టే ప్రతి ఒక్కరి మనసులో ఎన్నో ఉన్నతమైన కలలు ఉంటాయని, అయితే అక్కడి పరిస్థితులు, జీవన శైలి, వృత్తిపరమైన ఒత్తిళ్లు పూర్తిగా భిన్నంగా ఉంటాయని విశ్లేషించారు. పైకి కనిపించే మెరిసే జీవితం వెనుక ఎంతో కఠినమైన శ్రమ, సవాళ్లు ఉంటాయని యువత గ్రహించాలని ఆమె సూచించారు.

చదువు కోసం, ఉద్యోగాల కోసం అమెరికాకు వస్తున్న విద్యార్థులు ఆర్థిక సర్దుబాట్లు, ఒంటరితనం, కొత్త సంస్కృతికి అలవాటుపడటంలో ఎదురయ్యే ఇబ్బందులను భారతి ప్రస్తావించారు. సరైన అవగాహన లేకపోతే చిన్న సమస్యలు కూడా మానసిక ఆందోళనకు దారితీస్తాయని, ముందస్తు మానసిక సిద్ధత ఎంతో అవసరమని చెప్పారు. అమెరికాలో వివాహాలు, సంబంధాల విషయంలో యువత వారి కుటుంబాల అంచనాలు వాస్తవరూపం దాల్చేటప్పుడు కొన్నిసార్లు పొరపడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా అమెరికా జీవన విధానాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఆద్యంతం ఎంతో ఉపయుక్తంగా జరిగిన ఈ సదస్సుకు నాట్స్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి చిలుకూరి అనుసంధానకర్తగా వ్యవహరించారు. అమెరికాలో గృహహింస, కుటుంబ వివాదాల బారిన పడుతున్న వారికి నాట్స్ ఏ విధంగా అండగా నిలుస్తుందో రాజ్యలక్ష్మి వివరించారు. అమెరికా జీవితం గురించి ఎన్నో ఆశలతో వచ్చే మహిళలు వాస్తవంగా ఎదుర్కొంటున్న పరిస్థితులను, వారి భద్రత కోసం నాట్స్ తీసుకుంటున్న చర్యలను తెలియజెప్పారు. నాట్స్ హెల్ప్‌లైన్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఇలాంటి వెబినార్ల ద్వారా విదేశాలకు వచ్చే తెలుగు యువతకు, విద్యార్థులకు వాస్తవ పరిస్థితులపై ముందే ఒక స్పష్టత వస్తుందని, తద్వారా వారు ఎలాంటి తప్పు నిర్ణయాలు తీసుకోకుండా ఉండటానికి సహాయపడుతుందని హాజరైన తెలుగు వారు తెలిపారు. సదస్సు విజయవంతం కావడంలో నాట్స్‌కు చెందిన మురళి, రాజేష్, కిషోర్, అశ్వద్దీప్తి తదితరులు కీలక పాత్ర పోషించారు. అమెరికా కలలపై వాస్తవాలను తెలుగువారికి చేరువ చేయడానికి కృషి చేసిన నాట్స్ టీం సభ్యులను నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడ ప్రత్యేకంగా అభినందించారు.

# ఢిల్లీలో మరో దారుణం

## 17 ఏళ్ల బాలికపై ముగ్గురు మైనర్లు సహా నలుగురు కలిసి సామూహిక అత్యాచారం



దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణ ఘటన వెలుగు చూసింది. 17 ఏళ్ల బాలికపై ముగ్గురు మైనర్లు సహా నలుగురు కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై ఆమెను అతికిరాతకంగా హతమార్చి.. మృతదేహాన్ని బహిరంగ ప్రదేశంలో పారేశారు. చివరకు ఆ మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత బాలికకు, నిందితుల్లో ఒకరికొకరు పరిచయం ఉంది. ఘటనా సమయంలో ఆమె వారితో కలిసి ఓ టెంపోలో ప్రయాణిస్తున్నారు. ఆ వాహనంలోనే బాలికపై అత్యాచారం చేసి, ఆ తర్వాత కత్తితో పొడిచి చంపేసి, మృతదేహాన్ని రోడ్డుపై పారేసి పరారయ్యారు. ఈ దారుణ ఘటనకు ముందు వారంతా టెంపోలోనే మద్యం సేవించారు. ఈ నెల 13న వాయవ్య ఢిల్లీ కుషక్ రోడ్‌లోని స్వరూప్ నగర్ ప్రాంతంలో బాధితురాలి మృతదేహం కుళ్లిపోయి.. కనీసం లింగ నిర్ధారణ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయని, ఒక చేయి వేరుగా పడి ఉన్నట్టు గుర్తించామన్నారు. మరోవైపు.. బాలిక అదృశ్య ఘటనపై ఆమె కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఆమె తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లేదని, కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండేదని వారు చెప్పారన్నారు. నిందితులను పట్టుకునేందుకు సుమారు 50కి పైగా సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టారు పోలీసులు. ఈ నెల 15, 16న అర్ధరాత్రి వేళ ముమ్మరంగా గాలించి తొలుత టెంపో డ్రైవర్‌ను పట్టుకున్నారు. తద్వారా ఘటనతో సంబంధమున్న ముగ్గురు మైనర్లు సహా నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులపై బీఎన్‌ఎస్, పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

# దీదీకి దెబ్బ మీద దెబ్బ

## మమత మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ అభ్యర్థి అరెస్టు



త్వరలో నందిగ్రామ్ నియోజకవర్గ ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. 2007 నాటి భూసేకరణ వ్యతిరేక నిరసనల కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నందిగ్రామ్ ఉపఎన్నికలో తమ వర్గం కాంగ్రెస్ నేత మిలన్‌కు మద్దతు ఇస్తుందని మమతా బెనర్జీ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఈ అరెస్టు కలకలానికి దారి తీసింది. 2007 నాటి నిరసనల్లో 14 మంది గ్రామస్థులు మరణించిన విషయం తెలిసిందే. అంతకుముందు మమతా బెనర్జీ మాట్లాడుతూ తాము కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తామని ప్రకటించారు. అంతే కాకుండా మమత వర్గానికి చెందిన సంచితా ప్రధాన్ డే కూడా తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. బీజేపీపై పోరాడుతున్న కూటమికి సంఘీభావంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నామని పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం తెలిపారు. ఇదిలా ఉంటే, టీఎంసీలో చీలిక నేపథ్యంలో పార్టీ పేరును, గుర్తును నేడు ఈసీ స్తంభింపజేసింది. వచ్చే ఉపఎన్నికలో మమతా బెనర్జీ వర్గానికి మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరును ఖరారు చేసింది. ఫుట్ బాల్ ప్లేయర్ గుర్తును ఈసీ వారికి కేటాయించింది. మరోవైపు, టీఎంసీ రెబల్ వర్గానికి డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరును ఈసీ ఖరారు చేసింది. ఎన్వలప్ సింబల్‌ను తాత్కాలిక ప్రాతిపదికన కేటాయించింది. రాబోయే ఉపఎన్నికకు ఈ మార్పులు వర్తించనున్నాయి. ఈ పరిణామాలపై మమతా స్పందించారు. ఇదో చీకటి దినమని విమర్శించారు.





# చీలిన తృణమూల్ కాంగ్రెస్

## ఉప ఎన్నికల వేళ రెండు పార్టీలకు వేర్వేరు గుర్తులు కేటాయించిన ఈసీ

పశ్చిమ్ బెంగాల్‌లో అసెంబ్లీ ఉప ఎన్నకలు సమీపిస్తున్న వేళ.. తృణమూల్ కాంగ్రెస్‌లో నెలకొన్న గందరగోళానికి కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) తెరదించింది. టీఎంసీకి చెందిన రెండు వర్గాలకు కొత్త పేర్లు, ఎన్నికల గుర్తులను కేటాయించింది ఈసీ. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరును కేటాయిస్తూ.. 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఇచ్చింది. ఇక రెబల్స్ గ్రూపైన రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని ఇంకో వర్గానికి 'డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరును ఖరారు చేస్తూ, 'ఎన్వలప్ కవర్' గుర్తును కేటాయించింది. కాగా.. ఇటీవల టీఎంసీ పేరు, ఆ పార్టీకి కేటాయించిన 'ఫ్లవర్(పూలు), గ్రాస్(గడ్డి)' ఎన్నికల గుర్తును ఇరు వర్గాలు వినియోగించకుండా ఈసీ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వచ్చేనెల 6వ తేదీన జరిగే(నందిగ్రామ్, రేజీనగర్) ఉపఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తకుండా రెండు వర్గాలకు తాత్కాలికంగా ఇలా కొత్త పేర్లు, గుర్తులను కేటాయించినట్లు తెలుస్తోంది. ఈసీ ఆదేశాల ప్రకారం.. ఈ వివాదంపై తుది నిర్ణయం వెలువడే వరకు ఇరువర్గాలు అసలు పార్టీ పేరు, రిజర్వ్‌డ్ గుర్తును ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. దానికి బదులుగా ఉపఎన్నికల కోసం కేటాయించిన కొత్త పేర్లు, గుర్తులతోనే పోటీ చేయాల్సి ఉంటుంది.

# యువతలో ధర్మచింతన శుభదాయకం

## రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్





'ధర్మం' అనేది కేవలం వృద్ధాప్యానికి మాత్రమే పరిమితమైనది కాదని, మనిషి జీవితం ప్రారంభం నుంచి అంతం వరకూ తోడుగా ఉండేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో శుక్రవారం నిర్వహించిన 'యువ ధర్మ సంసద్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాధారణంగా ధర్మం గురించి వృద్ధులే మాట్లాడతారనే భావన ఉన్న నేటి రోజుల్లో, యువత 'ధర్మం' గురించి ఆలోచించడం, చర్చించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన అన్నారు. గీత, రామాయణాలను రిటైర్ అయిన తర్వాతే చదవాలనే అపోహ సమాజంలో ఉందని, కానీ అది ఎంతమాత్రం నిజం కాదని భాగవత్ చెప్పారు. ధర్మం ఆధారంగానే విశ్వం నడుస్తుందని పేర్కొన్నారు. 'ప్రతిదీ నా నియాంత్రణలోనే ఉంది, నా ప్రకారమే జరగాలి' అనే అహంకారంతో నడుచుకునే వ్యక్తి తీవ్రమైన భ్రమలో పడతాడని, అలా అనుకోవడం పొరపాటని హెచ్చరించారు. ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ముందుగా మనస్సులో ఉన్న పాత, స్థిరపడిపోయిన అపోహల నుంచి బయటపడాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ పిలుపునిచ్చారు. సృష్టి ఆరంభం నుంచి అంతం వరకూ ధర్మం ఉనికిలో ఉంటుందని.. పుట్టుక నుంచి మరణం వరకూ ప్రతి ఒక్కరి జీవితంలోనూ అది భాగమేనని, సమస్త సంతోషానికి ధర్మమే మూలకారణమని భాగవత్ తెలిపారు.

# ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు



దేశ రాజధాని ఢిల్లీలో పాఠశాలలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. శుక్రవారం) మయూర్ విహార్ ఫేజ్-1లోని బలరామ్ పబ్లిక్ స్కూల్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇతర భద్రతా బృందాలు పాఠశాల వద్దకు చేరుకున్నాయి. ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారుల ప్రకారం.. ఉదయం 8.40 గంటలకు పాఠశాలలో బాంబు ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే భద్రతా బృందాలు పాఠశాలకు చేరుకుని తనిఖీలు ప్రారంభించాయి. పాఠశాల ప్రాంగణంలోని తరగతి గదులు, కారిడార్లు, ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ వారంలోనే ఢిల్లీలోని పలు ప్రముఖ పాఠశాలలకూ బాంబు బెదిరింపు ఈ మెయిళ్లు వచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు. చాణక్యపురిలోని బ్రిటిష్ స్కూల్, ధౌలా కువాన్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్, లోధీ ఎస్టేట్‌లోని సర్దార్ పటేల్ విద్యాలయం, ఎయిర్ ఫోర్స్ బాల్ భారతి స్కూల్, కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌కు బెదిరింపు ఈ-మెయిళ్లు వచ్చినట్లు వెల్లడించారు. ఈ ఈమెయిళ్లన్నీ పంజాబీ భాషలో ఉన్నట్లు అనుమానిస్తున్నామని చెప్పారు. పాఠశాలలతో పాటు పోలీస్ స్టేషన్లు, పోలీస్ పోస్టులు, కోర్టు సముదాయాల వద్ద పేలుళ్లు జరుగుతాయని దుండగులు హెచ్చరించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 29 వరకు ఢిల్లీ మెట్రో, రైళ్లలో ప్రయాణించవద్దనీ ఈమెయిళ్లలో ఉన్నట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అయితే, బెదిరింపులు వచ్చిన ప్రతి ప్రాంతానికీ భద్రతా బృందాలు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఆయా పాఠశాలలు, కార్యాలయాల వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎలాంటి బాంబులు లభ్యం కాలేదని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం బలరామ్ పబ్లిక్ స్కూల్‌లో తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీలు పూర్తయిన అనంతరం అధికారులు మరిన్ని కీలక వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

# రష్యా, ఇరాన్‌లకు అమెరికా ఆంక్షలు

## సంబంధాలపై భారత విదేశాంగ శాఖ ఆందోళన



రష్యా, ఇరాన్‌పై అమెరికా తీసుకురానున్న కొత్త ఆంక్షల చట్టంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చట్టం వల్ల అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై మాత్రమే కాకుండా, భారత్, అమెరికా మధ్య సంబంధాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ హెచ్చరించింది. అమెరికా ప్రతినిధుల సభ ఇటీవల లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026 బిల్లును ఆమోదించింది. ఇది చట్టరూపం దాలిస్తే, రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు కొనే దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం ఉంటుంది. రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకూ ఈ చట్టం వర్తించే అవకాశం ఉంది. ఈ విషయంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు ఆమోదం పొందిన విషయాన్ని గమనించామని, తదుపరి పరిణామాలను పరిశీలిస్తున్నామని తెలిపింది. భారత్ తన ప్రజలకు తక్కువ ధరలో, నిరంతరాయంగా ఇంధనం అందించడం అత్యంత ముఖ్యమైన అంశం అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అందుకోసం వివిధ దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపింది. ఈ అంశంపై భారత్ ఇప్పటికే అమెరికాతో ఉన్నత స్థాయిలో చర్చలు జరిపినట్లు వెల్లడించింది. కాగా.. భారత్ అమెరికా ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. అలాంటి తరుణంలో ఆంక్షల బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది.




# అవన్నీ తప్పుడు కథనాలే

## జిన్‌పింగ్, రమఫోసాలపై అనారోగ్య ప్రచారానికి ఖండన

భారత్‌లో జరిగిన బ్రిక్స్ వార్షిక శిఖరాగ్ర సదస్సుకు హాజరైన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా అనారోగ్యానికి గురయ్యారంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వదంతులను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అవన్నీ ఫేక్ వార్తలని విదేశాంగ శాఖ ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టం చేసింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఇలాంటి దురుద్దేశపూర్వక పోస్టులు పెట్టొద్దని హెచ్చరించింది. బ్రిక్స్ సదస్సుకు హాజరైన జిన్‌పింగ్ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన బ్రిక్స్ గాలా డిన్నర్‌కు గైర్హాజరయ్యారు. సుదీర్ఘ ప్రయాణం, వరుస భేటీల వల్ల కలిగిన అలసట కారణంగానే ఆయన హోటల్ గదికి వెళ్లిపోయినట్టు విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ అప్పట్లో కథనాలు వచ్చాయి. చైనాకు చేరుకున్నాక జిన్‌పింగ్‌ను బీజింగ్‌లోని 301 హాస్పిటల్‌కు తరలించారని 'చైనా డెమొక్రటిక్ పార్టీ' చైర్మన్ 'వాన్‌జున్ షి' తన 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. మరికొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా భారత్ పర్యటనకు జిన్‌పింగ్ అనారోగ్యానికి ముడిపెడుతూ పోస్టులు పెట్టారు. అనారోగ్యం కారణంగా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కారంటూ దక్షిణాఫ్రికా అధ్యక్ష కార్యాలయం చేసిన ప్రకటన ఈ వదంతులకు తోడైంది. దీంతో భారత విదేశాంగ శాఖ అప్రమత్తమై ఇవన్నీ తప్పుదోవ పట్టించే కథనాలని కొట్టిపారేసింది.

# ఫిలిప్పీన్స్‌లో మళ్లీ కాల్పుల కలకలం



ఫిలిప్పీన్స్‌లో మరోసారి కాల్పుల కలకలం రేగింది. బంగా టౌన్‌లోని ఓ స్కూల్లో 16 ఏళ్ల బాలుడు కాల్పులకు తెగబడటంతో ఇద్దరు మృతి చెందారు. మరో 8 మంది గాయపడ్డారు. శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో నిందితుడు కూడా మరణించాడని టౌన్ మేయర్ ఆల్బర్ట్ పాలెన్సియా తెలిపారు. అయితే, అతడు ఎలా మరణించాడనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. గాయపడ్డ ఎనిమిది మందిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని మేయర్ తెలిపారు. సమీప ఆసుపత్రుల్లో బాధితులకు చికిత్స ఇస్తున్నామని అన్నారు. బాధితులు అందరూ 14, 17 ఏళ్ల మధ్య వారేనని చెప్పారు. కాల్పులకు కారణమేంటో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై అక్కడి విద్యా శాఖ విచారం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తుపాకీ శబ్దం వినగానే చిన్నారులు భయంతో బయటకు పరుగులు తీసిన వైనం వీడియోలో రికార్డైంది. గాయపడ్డ వారిని కొందరు

### క్లాసు రూమ్‌లోనే ఇద్దరు విద్యార్థుల ఘాతుకం

స్కూల్ నుంచి బయటకు తీసుకొస్తున్న దృశ్యాలు వీడియోలో కనిపించాయి. గత నెలలోనే ఓ విద్యార్థి క్లాస్ రూమ్‌లో మరో విద్యార్థిని హత్య చేసి ఆపై తనని తాను కాల్చుకుని చనిపోయాడు. ఇదంతా లైవ్ స్ట్రీమ్ చేయడంతో దేశవ్యాప్తంగా కలకలం రేగింది. జూన్ నెలలో జరిగిన మరో ఘటనలో ఇద్దరు విద్యార్థులు ఓ పబ్లిక్ స్కూల్‌లో కాల్పులకు తెగబడటంతో ముగ్గురు విద్యార్థులు మరణించారు. మరో 20 మంది గాయపడ్డారు. ఫిలిప్పీన్స్‌లో గన్‌లైసెన్సులకు సంబంధించి కఠిన చట్టాలు ఉన్నాయి. అయితే, అక్రమమార్గాల్లో జరుగుతున్న తుపాకీల విక్రయాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయలేకపోతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

### పాకిస్థాన్ మసీదులో ఆత్మాహుతి పేలుడు : 16 మంది మృతి

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కొహాట్ జిల్లాలోని ఓ మసీదులో శుక్రవారం నమాజ్ సమయంలో సంభవించిన శక్తిమంతమైన ఆత్మాహుతి పేలుడు తీవ్ర కలకలం సృష్టించింది. ఈ దుర్ఘటనలో 16 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కొహాట్ జిల్లాలోని ఓల్డ్ పోలీస్ లైన్స్ సమీపంలో ఉన్న మసీదులో శుక్రవారం ప్రార్థనలు (జుమా నమాజ్) జరుగుతుండగా ఈ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి మసీదు భవనంతో పాటు సమీపంలోని భవనాలు, దుకాణాలు దెబ్బతిన్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాల్లో మసీదు శిథిలాల నుంచి గాయపడిన వారిని రక్షించే దృశ్యాలు కనిపిస్తున్నాయి.



# నోరు జారిన ప్రధాని.. బద్దలైన కింగ్‌డమ్



యూకేలో చీలిక దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. స్కాట్‌లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ప్రాంతాలు యూకే నుంచి వేరుపడే దిశగా అడుగుల వేస్తున్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తమ భవిష్యత్తును నిర్ణయించుకునే హక్కు కోసం ఫస్ట్ మినిస్టర్స్ (ముఖ్యమంత్రులు) జాన్ స్విన్నీ (స్కాట్‌లాండ్), హ్రూన్ అప్ యోర్వర్త్ (వేల్స్), మిషెల్ ఓ నీల్ (ఉత్తర ఐర్లాండ్) కార్డిఫ్ నగరంలో రేపు సమావేశం కానున్నారు. ప్రజాస్వామ్య మార్గాల్లో యూకే నుంచి వేరు పడే హక్కును కోరుతూ తీర్మానం చేయనున్నారు. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్‌లాండ్, ఉత్తర ఐర్లాండ్‌ను కలిపి యూనైటెడ్ కింగ్‌డమ్ అంటారన్న విషయం తెలిసిందే. ఇటీవల యూకే ప్రధాని ఆండీ బర్న్‌హామ్ చేసిన ఓ ప్రకటనతో వేర్పాటు డిమాండ్స్ మళ్లీ మొదలయ్యాయని అక్కడి విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. పార్లమెంటు సమావేశాల్లో ప్రధాని మాట్లాడుతూ స్కాట్‌లాండ్ స్వాతంత్ర్యంపై మరో రెఫరెండమ్‌ను నిర్వహించేందుకు తాము సిద్ధమేనని పొరపాటున ప్రకటించారు. ఆ వెంటనే తేరుకున్న ఆయన స్కాట్‌లాండ్ నేతలకు లేఖ రాస్తూ రెఫరెండమ్‌కు అవకాశమే లేదని తేల్చి చెప్పినప్పటికీ జరగవల్సిన నష్టం జరిగిపోయింది. ఇటీవలి ఎన్నికల్లో లేబర్ పార్టీ అపజయాలు ఎదుర్కోవడంతో అక్కడి రాజకీయాల్లో కీలక మార్పులు మొదలయ్యాయి. వేల్స్‌కు స్వయం ప్రతిపత్తిని కోరుతున్న ప్లెయిడ్ కమ్రీ అక్కడ అతిపెద్ద పార్టీగా అవతరించింది. పార్టీ నేత హ్రూన్ ఆప్ యోర్వర్త్ ఫస్ట్ మినిస్టర్‌గా ఎన్నికయ్యారు. స్కాట్‌లాండ్‌లో ఎస్ఎన్‌పీ బలమైన రాజకీయ శక్తిగా కొనసాగుతోంది. ఇక ఉత్తర ఐర్లాండ్‌లో షిన్ ఫెయిన్ పార్టీ శక్తివంతమైన పార్టీగా కొనసాగుతోంది. మిషెల్ ఓ నీల్ ఫస్ట్ మినిస్టర్‌గా ఉన్నారు. యూకే నుంచి స్వేచ్ఛ కోరుతూ ఈ మూడు పార్టీలు ఒక్కతాటిపైకి రావడం చరిత్రలో ఇదే తొలిసారని అక్కడి రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు కూడా ఈ మూడు పార్టీలకు కొత్త బలాన్ని ఇచ్చాయి.

ఉత్తర ఐర్లాండ్, రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ ఒక్కటైతే చూడాలని ఉందని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం కోసం ముగ్గురు ముఖ్యమంత్రులూ తీర్మానించినా ఆ కల సాకారం కావడం అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. యూకే నుంచి విడివడేందుకు రెఫరెండమ్‌ను అనుమతించే అధికారం కేవలం యూకే పార్లమెంటుకు మాత్రమే ఉందని అంటున్నారు. అయితే, యూకేలో శాశ్వత రాజకీయపరమైన మార్పులు మాత్రం మొదలయ్యాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంగ్లండ్, వేల్స్, ఐర్లాండ్, స్కాట్‌లాండ్ మధ్య వందల ఏళ్ల పాటు జరిగిన యుద్ధాలు, ఒప్పందాల అనంతరం యూకే ఒక దేశంగా ఏర్పడింది. 1536లో వేల్స్ రాజ్యం ఇంగ్లండ్‌లో భాగమైంది. 1707లో జరిగిన విలీన ఒప్పందంతో స్కాట్‌లాండ్ కూడా చేరడంతో గ్రేట్ బ్రిటన్ ఏర్పడింది. అనంతరం 1801లో ఐర్లాండ్ గ్రేట్ బ్రిటన్‌లో ఐక్యం కావడంతో యూనైటెడ్ కింగ్‌డమ్ ఏర్పడింది. ఇక 1922లో ఐర్లాండ్ చీలికతో రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. ఉత్తర ఐర్లాండ్ మాత్రం యూకేలో భాగంగా ఉండిపోయింది.

# శ్రీచరణి స్పిన్‌కు జపాన్ విలవిల

**- ఆసియా క్రీడల సెమీ ఫైనల్లో భారత్ -**



ఆసియా క్రీడల్లోనూ భారత మహిళల జట్టు అదరగొట్టింది. క్వార్టర్ ఫైనల్లో తిప్పేసిన శ్రీచరణి (4-10) కెరీర్లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో జపాన్‌ను అలవోకగా చిత్తు చేసింది టీమిండియా. స్వల్ప ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ (40 నాటౌట్, 2-13) విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించింది. ఎనిమిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించిన ఉమెన్ ఇన్ బ్లూ సెమీస్‌కు దూసుకెళ్లింది.

డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునే దిశగ సాగుతోంది. నిరుడు గోల్డ్ మెడల్‌తో సత్తా చాటిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం దర్జాగా సెమీస్‌లో దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్ బ్యాటర్లను శ్రీ చరణి (4-10) వణికించింది. ఈ తెలుగమ్మాయి సంచలన ప్రదర్శనతో 57 పరుగులకే ఆతిథ్య దేశం జట్టు కుప్పకూలింది. అనంతరం ఓపెనర్ షఫాలీ వర్మ (40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో 5 ఓవరల్లోనే ఉమెన్ ఇన్ బ్లూ జయకేతనం ఎగురవేసింది.

**శ్రీచరణి, షఫాలి పోటీపడి**

తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్‌ను భారత స్పిన్నర్లు స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. ఓపెనర్ అయకా కటో స్టఫోర్డ్ (25) ప్రతిఘటించినా.. శ్రీ చరణి (4-10), షఫాలీ వర్మ (2-13) ధాటికి మిగతా వారు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఒకే ఓవర్లో రెండేసి వికెట్లతో శ్రీచరణి జపాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ స్పిన్ ద్వయం వికెట్ల వేటతో ప్రత్యర్థిని 57కే పరిమితం చేసింది టీమిండియా. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఐదు ఓవర్లలోనే టీమిండియా ఉఫ్‌మనిపించింది.

ఓపెనర్ షఫాలీ వర్మ (40 నాటౌట్) మెరుపు అరంభాన్నిస్తూ.. 15 బంతుల్లోనే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుకుపడింది. జి.కమలిని (0), భారతి ఫుల్‌మాలి (6) విఫలమైనా షఫాలి దూకుడుతో జపాన్ బౌలర్లు అల్లాడిపోయారు. రీచా ఘోష్ (12 నాటౌట్) జతగా టీమిండియాకు 8 వికెట్ల విజయం కట్టబెట్టింది డాషింగ్ ఓపెనర్. అద్భుత విజయంతో సెమీస్ చేరిన భారత్... ఫైనల్ బెర్తు కోసం ఆదివారం బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది. అదేరోజు ఉదయం తొలి సెమీస్‌లో పాకిస్థాన్, శ్రీలంక తలపడతాయి.

## ప్రభుత్వ నిర్ణయానికే మన క్రీడాకారులు కట్టుబడాలి

**ఇండో-పాక్ వివాదంపై కపిల్‌దేవ్**



న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్ర దాడి ఘటన తర్వాత పాకిస్థాన్ క్రికెటర్లతో కరచాలనం (హ్యాండ్ షేక్) నిరాకరించడం, ఆ దేశ ప్రతినిధుల చేతుల మీదుగా ట్రోఫీలను స్వీకరించకపోవడంపై చెలరేగిన వివాదంపై భారత క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ స్పందించారు. పాక్ అథ్లెట్లతో కరచాలనం చేయవద్దని భారత ప్రభుత్వం నిర్ణయిస్తే టీమిండియా ఆటగాళ్లు దానికి కట్టుబడి ఉండటమే సరైన పద్ధతి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆదేశాలను దాటి క్రీడాకారులకు మరో ప్రత్యామ్నాయం ఉండదని స్పష్టం చేశారు. ఇటీవల ముగిసిన మహిళల ఆసియా కప్‌లో భారత జట్టు విజయం సాధించిన అనంతరం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకునేందుకు భారత్ విముఖత చూపడం చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో జైలులో అనారోగ్యంతో బాధపడుతున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై కపిల్‌దేవ్ ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు దేశంతో ఎన్ని రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, మానవతా దృక్పథంతో అతనికి తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

## ఆసియాడ్ ప్రతినిధిగా అంకమ్మ చౌదరి



హైదరాబాద్: ఆంధ్ర బ్యాడ్మింటన్ సంఘం (ఏపీబీఏ) ప్రధాన కార్యదర్శి అంకమ్మ చౌదరి ఆసియా క్రీడల భారత బ్యాడ్మింటన్ జట్టు అధికారిక ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు భారత బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ ప్రకటించారు. శనివారం నుంచి జపాన్‌లోని ఐజీ-నగోయా వేదికగా జరిగే ఆసియా క్రీడల్లో 20 మందితో కూడిన బ్యాడ్మింటన్ జట్టు తలపడుతుంది.

## ఆసియా క్రీడల్లో భారత పతాకధారులుగా మనూ భాకర్, తజీందర్‌పాల్ సింగ్



జపాన్‌లోని ఐచీ నగోయాలో శనివారం ప్రారంభం కానున్న 2026 ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత పతాకధారులుగా రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మనూ భాకర్, ఆసియా క్రీడల ప్రస్తుత చాంపియన్ తజీందర్‌పాల్ సింగ్ తూర్ ఎంపికయ్యారు. వీరిద్దరి ఎంపికను శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. భారత బృందం చీఫ్ డి మిషన్ సహదేవ్ యాదవ్ మనూ భాకర్ పేరును ప్రకటించగా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తజీందర్‌పాల్ సింగ్ తూర్‌ను రెండో పతాకధారిగా ఖరారు చేసింది. కాగా 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మనూ భాకర్ అద్భుత ప్రదర్శన చేసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించిన ఆమె.. సరబ్జోత్ సింగ్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో మరో కాంస్యాన్ని సాధించింది. దీంతో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా ఆమె చరిత్ర సృష్టించింది.

## అవకాశాల కోసం వేచి చూడాల్సిందే


**వైభవ్ వివాదంపై గౌతమ్ గంభీర్ స్పష్టత**



న్యూఢిల్లీ: భారత టి20 జట్టులో చోటు దక్కించుకోవడంపై సాగుతున్న చర్చకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెరదించారు. ఇటీవల అఫ్ఘనిస్థాన్‌తో ముగిసిన టీ20 సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసిన అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కకపోవడం, అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌కు ప్రాధాన్యమివ్వడంపై గంభీర్ క్లారిటీ ఇచ్చారు. సీనియర్లకు, స్థిరమైన ప్రదర్శన చేసే ఆటగాళ్లకే టీమ్ మేనేజ్‌మెంట్ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని గంభీర్ తేల్చి చెప్పారు. వైభవ్ అత్యంత ప్రతిభావంతుడే అయినప్పటికీ, జట్టులోకి వచ్చే అవకాశం కోసం ఇంకాస్త సమయం వేచిచూడక తప్పదని స్పష్టం చేశారు. "వైభవ్‌తో మేము ఇప్పటికే స్పష్టంగా మాట్లాడాం. అతనిలోని టాలెంట్ ఏంటో మాకు తెలుసు. అయితే రెండేళ్లుగా నిలకడగా రాణిస్తున్న సీనియర్లకు, కొత్తగా వచ్చిన ఆటగాళ్ల కంటే ముందు ప్రాధాన్యం ఉంటుంది. ప్లేయర్ వయసు 15 ఏళ్లా లేదా 30 ఏళ్లా అనేది ముఖ్యం కాదు, టీమ్‌లో అవకాశం కోసం ఎవరైనా వేచి చూడాల్సిందే." అన్నారు. "వైభవ్‌కు అవకాశం వచ్చినప్పుడు అతనికి తగినంత సమయం (లాంగ్ రన్) ఇస్తాం. భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలాంటి ఆరోగ్యకరమైన పోటీ ఉండటం శుభపరిణామం."

సంజూ శాంసన్‌పై నమ్మకం: "సంజూ సామర్థ్యం ఏంటో ప్రపంచ కప్‌లోనే నిరూపితమైంది. ఇంగ్లాండ్ సిరీస్‌లో అతనిపై వేటు వేయడం నా కోచింగ్ కెరీర్‌లోనే అత్యంత కఠినమైన నిర్ణయం. కేవలం మూడు నాలు గేమ్‌ల్లో విఫలమైనంత మాత్రాన ఎవరూ చెడు ఆటగాళ్లు అయిపోరు. వరల్డ్ కప్ గెలిచిన కాంబినేషన్‌కే మేము మళ్లీ ప్రాధాన్యమిచ్చాం." అన్నారు.

## వసతి నిర్వహణలో వైఫల్యం



**జిమ్నాస్ట్ ప్రణతి నాయక్, కోచ్‌కి ఒకే గది కేటాయింపు**

నాగోయా (జపాన్): ఆసియా గేమ్స్ 2026 ప్రారంభానికి ముందే భారత క్రీడాకారులకు నిర్వహణ లోపాలు, వసతి సమస్యలు తీవ్ర అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. తాజాగా భారత మహిళా జిమ్నాస్ట్ ప్రణతి నాయక్, ఆమె కోచ్ అశోక్ మిశ్రాలకు నిర్వాహకులు ఒకే గదిని కేటాయించడం వివాదాస్పదమైంది. క్రీడాకారులు విడిది చేసిన క్రూయిజ్ షిప్‌లో మహిళా అథ్లెట్, పురుష కోచ్‌కి కలిపి ఒకే రూమ్ ఇవ్వడంపై భారత అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ గంటల తరబడి స్పందించలేదు. చివరికి ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ రంగంలోకి దిగి జోక్యం చేసుకోవడంతో అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వేరే గది ఏర్పాటు చేశారు.

**అక్కడితో తీరని తిప్పలు:**

పరిష్కారం లభించిందని భావించి కోచ్ అశోక్ మిశ్రా రూమ్ తాళం కోసం వెళ్లగా మరో విచిత్ర సంఘటన ఎదురైంది. హోటల్ రిజిస్టర్‌లో ఆయన పేరు నమోదు కాలేదని సిబ్బంది వెల్లడించారు. సిస్టమ్ రికార్డుల్లో ఆయన పేరులోని అ అనే అక్షరం మిస్ కావడంతోనే ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. ఆ తప్పును సరిదిద్ది, అక్రిడిటేషన్‌ను క్లియర్ చేయడానికి మరో 45 నిమిషాల సమయం పట్టింది. దీంతో కోచ్ అర్ధరాత్రి 2 గంటల తర్వాతే తన గదిలోకి వెళ్లగలిగారు.

ఈ సంఘటనపై ప్రణతి నాయక్ స్పందిస్తూ.. "మా ఇద్దరికీ కలిపి ఒకే గదిని కేటాయించారనేది నిజమే, ఆ తర్వాత సమస్యను పరిష్కరించినప్పటికి అప్పటికే అర్ధరాత్రి 2 గంటలు దాటిపోయింది" అని తెలిపారు. కాగా నిర్వహణ లోపాలతో అథ్లెట్లు మానసికంగా, శారీరకంగా అలసిపోతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# చైతన్య రథం సినిమా

శనివారం 19 సెప్టెంబరు 2026 X

## అసెంబ్లీలో విజయ్ ప్రసంగాలు అద్భుతం: నాని



టాలీవుడ్ కథా నాయకుడు నాని తన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' ప్రచారంలో భాగంగా చెన్నైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తమిళనాడు సీఎం,ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ప్రజల్లో విజయ్‌కు ఉన్న అపరిమితమైన క్రేజ్,నమ్మకంగురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు."ఇది కేవలం ఆయన స్టార్‌డమ్ లేదా బాక్సాఫీస్ విజయం కాదు. తమిళనాడు ప్రజలు విజయ్‌పై ఎన్నోఏళ్లుగా నమ్మ కాన్ని పెంచుకున్నారు. ఆయన్ను తమ కుటుంబంలో ఒకరిగా భావిస్తారు. ఇది ఆయనపై వారికి ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా చూపిస్తోంది.శాసనసభలో ఆయన ప్రసంగించిన వీడియోలను సోషల్‌మీడియాలో చూశాను... చాలా అద్భుతంగా ఉన్నాయి. రాబోయే ఏళ్లలోనూ ఆయన పాలన ఇలాగే సాగాలని, తమిళనాడు ప్రజల ఎంపిక సరైనదేనని రుజువు కావాలని కోరుకుంటున్నాను" అని నాని ఆకాంక్షించారు.గతంలో ఎన్నికల్లో విజయ్ గెలిచినప్పుడు కూడా నాని శుభాకాంక్షలు తెలిపిన సంగతి తెలిసిందే.

ఇదే ప్రెస్‌మీట్‌లో తనను 'పాన్ ఇండియా స్టార్' అని పిలవడం పట్ల నాని అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఒక బాలీవుడ్ సినిమా విజయం సాధిస్తే దానిని సాధారణంగా 'హిందీ సినిమా' అని మాత్రమే అంటారు. కానీ ఒక దక్షిణాది సినిమా విజయం సాధిస్తే మాత్రం దానికి 'పాన్ ఇండియా' అనే లేబుల్ వేస్తారు. ఆ వ్యత్యాసం నాకు నచ్చదు, అందుకే నా సినిమాలను పాన్ ఇండియా చిత్రాలు అని పిలవడం ఎంతమాత్రం ఇష్టం లేదు" అని తేల్చి చెప్పారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన నాని చిత్రం 'ది ప్యారడైజ్' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## సెన్సార్ పేరుతో గొంతు నొక్కుతున్నారు

**సీబీఎఫ్‌సీ కొత్త మార్గదర్శకాలపై భగ్గుమంటున్న సినీ లోకం**

భారతదేశంలో సినిమాల సర్టిఫికేషన్ కోసం కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా సవరించిన నిబంధనలను విడుదల చేసింది. 1991 నాటి పాత మార్గదర్శకాల స్థానంలో ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. అయితే ఈ తాజా నిబంధనలపై సినీ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది సర్టిఫికేషన్ కాదని, పూర్తిగా సెన్సార్ చేయడమేనని నెటిజన్లు, సినీ ప్రియులు మండిపడుతున్నారు.

ఇక కొత్త నిబంధనల ప్రకారం... సినిమాల్లో హింస, డ్రగ్స్, ధూమపానం వంటి వాటిని ప్రోత్సహించేలా చూపకూడదు. లైంగిక దాడి దృశ్యాలను గ్రాఫిక్ రూపంలో ప్రదర్శించరాదు. మహిళలను కించపరిచేలా లేదా తక్కువ చేసి చూపేలా కంటెంట్ ఉండకూడదు. చిన్నారులు హింసకు గురయ్యే లేక హింసను ఎదుర్కొనే సన్నివేశాలపై ఆంక్షలు విధించారు. అలాగే కోర్టుల గౌరవానికి భంగం కలిగించేలా, విదేశీ సంబంధాలను దెబ్బతీసేలా లేదా దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించేలా చిత్రాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అయితే ఈ మార్గదర్శకాలను సినిమాను మొత్తంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించినప్పటికీ, ఇవి సృష్టికర్తల స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నాయని విమర్శలొస్తున్నాయి. ఈ నిబంధనలతో దేశంలో సామాజిక-రాజకీయ చిత్రాలు రావడం కష్టమని, సమాజంలో జరిగే తప్పులను ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకే వీటిని తెచ్చారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సెన్సార్ నిబంధనలు ఇలాగే కఠినంగా ఉంటే థియేటర్లకు ప్రేక్షకులు రావడం కష్టమని, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఇది పెద్ద ఎదురుదెబ్బని సినీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆస్కార్-2027 రేసులో మరాఠీ చిత్రం 'గోంధళ్'

**భారత్ అధికారిక ఎంట్రీగా ఖరారు!**




న్యూఢిల్లీ: ఆస్కార్-2027 పురస్కారాలకు భారత్ తరపున అధికారిక ఎంట్రీ ఖరారైంది. మరాఠీ థ్రిల్లర్ చిత్రం 'గోంధళ్' ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. ఈ మేరకు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. త్వరలో జరగనున్న 99వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) వేడుకలో 'ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్' విభాగంలో ఈ చిత్రం భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఆస్కార్ ఎంట్రీ కోసం దేశవ్యాప్తంగా మొత్తం 33 చిత్రాలు పోటీపడ్డాయి. ఇందులో హిందీ నుంచి అత్యధికంగా 14 సినిమాలు రాగా.... మరాఠీ, తెలుగు, గుజరాతీ భాషల నుంచి నాలుగు చొప్పున చిత్రాలొచ్చాయి. తమిళం నుంచి మూడు, మలయాళం, నాగామీస్ భాషల నుంచి ఒక్కో సినిమాతో పాటు ఒక మూకీ చిత్రం కూడా ఈ రేసులో ఉన్నాయి. ఈ చిత్రాల ఎంపిక కోసం ఫిల్మ్ ఫెడరేషన్ ప్రత్యేక జ్యూరీ ఏర్పాటు చేసింది. తెలుగు నుంచి 'సింగ్ గీతం', 'పెద్ది', 'ఇరుముడి', 'ఇగ్వా' చిత్రాలు కమిటీస్క్రీనింగ్‌కు వెళ్లాయి.హిందీ నుంచి '120 బహదూర్', 'బోర్డర్-2', 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్', 'ఇక్కీస్' సహా ఇటీవల బ్లాక్‌బస్టర్ అయిన 'హనుమాన్ అంశ్' తదితర చిత్రాలను జ్యూరీ వీక్షించింది. వీటన్నింటినీ వెనక్కి నెట్టి 'గోంధళ్' ఈ అవకాశాన్ని దక్కించుకోవడం విశేషం.

## జైలర్-2: సూరజ్ వెంజరమూడు రోల్ ఇదే!



సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'జైలర్' సీక్వెల్ 'జైలర్ 2' విడుదల తేదీ ఖరారైంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబరు 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా చిత్రంలోని కీలక పాత్రధారి సూరజ్ వెంజరమూడు రోల్‌ని రివీల్ చేశారు. ఆయన దిలీప్ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ స్పెషల్ వీడియో పంచుకున్నారు. ఇందులో కారుపై కూర్చుని సిగరెట్ తాగుతూ మాస్ లుక్‌లో కనిపించారు. ఇది చూస్తుంటే సూరజ్ పవర్‌ఫుల్ రోల్ చేయనున్నారని అర్థమవుతోంది. మొదటి భాగంలో విలన్ వర్మ పాత్ర ఎంతలా ఆకట్టుకుందో, అంతకుమించి ఉండేలా సూరజ్ పాత్రను దర్శకుడు నెల్సన్ అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దినట్టు ఈ వీడియో ద్వారా స్పష్టమవుతోంది.

## సినీ సెలబ్రిటీల 'మహిళా సేవా సంకల్ప్'



హైదరాబాద్/ముంబై: ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా సాగనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున భాగస్వాములవుతున్నారు. మహిళా సాధికారత, విద్యాభివృద్ధి లక్ష్యంగా పలువురు నటులు కీలక ప్రకటనలు చేశారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతూ ఒక కీలక ప్రకటన చేశారు. 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా వెయ్యి మంది మహిళలకు ఉచితంగా 'స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్' (నైపుణ్యాభివృద్ధి శిక్షణ) అందిస్తానని వెల్లడించారు. మరోవైపు బాలీవుడ్ నటీనటులు రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ ముంబైలోని ప్రసిద్ధ 'లాల్‌బాగ్చా రాజా' వినాయకుని దర్శించుకుని తమ 'సేవా కార్యక్రమాలను ప్రకటించారు. 'ఈ అభియాన్‌లో భాగంగా 1000 మంది బాలికల చదువు బాధ్యతను నేను తీసుకుంటున్నాను. ఈ మంచి పనిని వినాయకుడే ముందుండి నడిపిస్తాడని నమ్ముతున్నాను" అని రణ్‌వీర్‌సింగ్ తెలిపారు. ముంబైలోని 20 పాఠశాలలను అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని రణ్‌బీర్ కపూర్-ఆలియాభట్ దంపతులు వెల్లడించారు.

## 'వెట్టువం' ఫస్ట్ గ్లింప్స్ విడుదల

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రం 'వెట్టువం' ఫస్ట్ గ్లింప్స్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. నీలం ప్రొడక్షన్స్, లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆర్య, శోభిత ధూళిపాళ్ల, వీఆర్ దినేష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పురాతన కాలం, సమకాలీన కాలం, భవిష్యత్తు అనే మూడు వేర్వేరు కాలాల నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రకృతిలో జరిగే పరిణామాలు, భవిష్యత్తులో వచ్చే వినాశకర మార్పులు, మానవ జాతిలో ఆధిపత్య పోరు, "ఈ భూమిని ఎవరు ఏలాలి?" అనే అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. చిత్రంలో పురాతన తమిళ ఆత్మరక్షణ విద్యలైన 'అడిమురై' ఆధారంగా భారీ యాక్షన్ సీన్లు తీర్చిదిద్దారు. ఇందుకోసం నటీనటులు ప్రత్యేకంగా శిక్షణ పొందారు. కథలో అత్యున్నత నాయకత్వ పదవిని దక్కించుకోవడానికి జరిగే 'ఇంద్ర విశ' అనే భీకర పోరాటం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

